ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
ప్రకాశం
జిల్లా వార్తలు
గురువారం 18, సెప్టెంబరు 2025

21న ముగ్గురు మంత్రులు రాక

తూర్పునాయుడుపాలెంలో రూ.10 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

- మర్లపాడులో ఎన్టీఆర్, దామచర్ల విగ్రహాల ఆవిష్కరణ
- 22న పరిమితంగా ఆంజనేయులు వర్ధంతి కార్యక్రమం





ఒంగోలు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కొండపి నియోజకవర్గంలో ఈనెల 21న ముగ్గురు మంత్రులు పర్యటించనున్నారు. హోం మంత్రి వంగలపూడి అనిత, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామిలతోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, టీడీపీ ముఖ్యనేతలు పాల్గొననున్నారు. వారంతా 21వతేదీ ఉదయం ఒంగోలు చేరుకొని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నివాసంలో కలుస్తారు. అక్కడి నుంచి తొలుత టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం వెళ్లి సుమారు రూ.10 కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యమాలకు ప్రారంభోత్సవాలు చేస్తారు. ప్రధానంగా విద్యుత్ సబ్ స్టేషన్, తాజాగా నిర్మించిన హైస్కూల్ ప్రహరీగోడ, గ్రామంలో చేపట్టిన సీసీరోడ్లు, డ్రైన్లు వంటి వాటిని ప్రారంభిస్తారు. అనంతరం అదే మండలంలోని మర్లపాడులో గ్రామ టీడీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలను ఆవిష్కరిస్తారు. నియోజకవర్గ టీడీపీ శ్రేణులంతా పాల్గొని మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య కోరారు. ఇదిలా ఉండగా ఏటా తూర్పునాయుడుపాలెంలో భారీగా నిర్వహించే మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయకులు వర్ధంతి సభను ఈనెల 22న పరిమితంగా నిర్వహించనున్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఆ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం లేకపోవడంతో వర్ధంతి సభను గ్రామస్థులు, దామచర్ల కుటుంబ సన్నిహితులతోనే నిర్వహించాలని నిర్ణయించారు. దానికి అనుగుణంగానే ముందురోజైన ఆదివారం నియోజకవర్గంలో ముగ్గురు మంత్రుల పర్యటనను ఏర్పాటు చేశారు.

ఎంపీడీవోలొచ్చారు!

- ఉద్యోగోన్నతి పొందిన 14 మందికి పోస్టింగ్
- జడ్పీ సీఈవో చిరంజీవి ఉత్తర్వులు

6

కీలక సమయం.. విప్పాలి గళం

శాసనసభ వర్షాకాల సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమయంలో జిల్లాకు చెందిన కీలక ప్రజాప్రతినిధులు అందరూ ఒకచోట ఉంటారు. ముఖ్యమంత్రితో సహా మొత్తం రాష్ట్ర మంత్రివర్గం, ఉన్నత స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారు. దీంతో జిల్లాకు సంబంధించిన ప్రధాన అభివృద్ధి అంశాలు, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుంది. అటు సభ లోపల చర్చకు పెట్టడంతో పాటు, ఇటు బయట ప్రభుత్వ పెద్దలను కలిసి వారి దృష్టికి ప్రత్యక్షంగా తీసుకెళ్లవచ్చు. ఎమ్మెల్యేలు ఎవరికి వారు తమ నియోజకవర్గంలోని కీలక అంశాలను వ్యక్తిగతంగా, అలాగే జిల్లా ఉమ్మడి ప్రయోజనాలకు ఉపకరించే వాటిపై కలిసికట్టుగా గళం విప్పాలని ప్రజానీకం కోరుతోంది.

పలు ప్రధాన అంశాలపై సానుకూలంగా ప్రభుత్వం

పశ్చిమంపై ప్రత్యేక ఫోకస్

- వెలిగొండ, మార్కాపురం జిల్లా, మెడికల్ కాలేజీ, డెయిరీకి ప్రాధాన్యం
- శాసనసభ్యులు ఉమ్మడిగా దృష్టి సారిస్తే మరింత మేలు
- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు



ఒంగోలు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : శాసనసభ సమావేశాలు గురువారం నుంచి మొదలవుతున్నాయి. ప్రభుత్వం పలు కీలక బిల్లులను సభలో ప్రవేశపెట్టనుంది. సమావేశాలు కనీసం వారం రోజులు గరిష్ఠంగా పది రోజులు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు అభివృద్ధికి సంబంధించిన ప్రధాన అంశాలపై దృష్టి సారించాల్సి ఉంది.

పశ్చిమ ప్రాంతంపై సానుకూలం

ప్రస్తుతం జిల్లాకు సంబంధించి అనేక కీలక అభివృద్ధి అంశాలపై ప్రధానంగా పశ్చిమప్రాంతంపై ప్రభుత్వం సానుకూలంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 మాసాలు పూర్తయ్యింది. గత ఎన్నికల సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ఆయా వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేపట్టామన్న భావనలో ప్రభుత్వ పెద్దలు ఉన్నారు. ప్రత్యేకించి సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలు అమలులోకి వచ్చాయి. జిల్లాలోని లక్షలాది మంది వివిధ వర్గాల వారికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. వాటిపై ప్రజల్లో సానుకూలత కూడా వ్యక్తమవుతోంది. ఈ తరుణంలో జిల్లాల వారీ ఇచ్చిన ప్రధాన హామీలపై ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో జిల్లాకు సంబంధించి చూస్తే ప్రధానంగా వెలిగొండ ప్రాజెక్టు, మార్కాపురం జిల్లా ఏర్పాటు, ఒంగోలు డెయిరీ పునరుద్ధరణ, మార్కాపురంలో మెడికల్ కాలేజీ నిర్మాణం, దొనకొండ ప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధి, కనిగిరి

మిగతా 6వ పేజీలో

తగు చొరవ అవసరం

అనేక శాశ్వత అభివృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగునకు ఉపకరించే వాటిపై ప్రభుత్వ స్థాయిలో దృష్టిసారించగా వాటిని వీలైనంత త్వరగా పూర్తిచేసే విధంగా వివిధ రూపాలలో ఒత్తిడి తెచ్చే బాధ్యత జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులపై ఉంది. జిల్లాలో పాలనా విభాగంలో మార్పులు, చేర్పులు.. రోడ్లు, సాగు, తాగునీరు, విద్య, వైద్యం విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల మెరుగునకు నిధులు రాబట్టడం వంటి ప్రధాన అంశాలపై ప్రభుత్వంతో మాట్లాడేందుకు శాసనసభా సమావేశాల సమయం కీలకమైంది. అందుకు తగు చొరవను కీలక ప్రజాప్రతినిధులు వ్యక్తిగతంగా, ఉమ్మడిగా చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉచ్చు బిగుస్తోంది!

మద్యం స్కాం 3వ చార్జిషీట్‌లో దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి పేరు ప్రస్తావన

పొదిలి కేంద్రంగా నగదు పంపిణీ అయినట్లు గుర్తింపు

రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్న మద్యం ముడుపుల కేసు వ్యవహారం జిల్లాలోని వైసీపీ నేతల్లోనూ గుబులు రేపుతోంది. కోర్టుకు సిట్ సమర్పించిన 3వ చార్జిషీట్‌లో వైసీపీకి చెందిన దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పేరును ప్రస్తావించింది. అందులోనే పొదిలి కేంద్రంగా నగదు పంపిణీ జరిగినట్లు, ఆమొత్తం ఒంగోలులో వైసీపీ వలంటీర్లకు అందినట్లు పేర్కొనడం ఆందోళన పెరగటానికి కారణమైంది. ప్రధానంగా మద్యం ముడుపుల డబ్బు పంపిణీలో కీలకంగా ఉన్న ఏ38 చెవిరెడ్డి గత ఎన్నికల్లో ఒంగోలు లోక్‌సభ నుంచి పోటీచేసి ఉన్నారు. దీంతో ఈ వ్యవహారం జిల్లాలోని నాటి వైసీపీ అభ్యర్థుల మెడకు కూడా చుట్టుకునే అవకాశం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

గత వైసీపీ హయాంలో జరిగిన లిక్కర్ ముడుపుల కేసు దర్యాప్తు చేపట్టిన సిట్ అధికారులు 3వ చార్జిషీట్‌ను రెండురోజుల క్రితం విజయవాడ ఏసీబీ కోర్టులో సమర్పించారు. అందులో ఈ అక్రమ సంపాదనను గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు అనుకూలంగా ఓట్ల కొనుగోలుకు వెచ్చించారన్న అంశాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి తాడేపల్లికి అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు డబ్బు పంపిణీ జరిగినట్లు గుర్తించారు. అందులో 38వ నిందితునిగా ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పాత్ర కీలకమని కూడా పేర్కొన్నారు. గత ఎన్నికల్లో చెవిరెడ్డి ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీచేసి క్యాంపెయిన్‌లో కీలకపాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో గత ఎన్నికల ప్రచార సమయంలో



మిగతా 6వ పేజీలో



చెరువును తలపిస్తున్న ఒంగోలులోని కర్నూల్‌రోడ్డు



పిడుగుపాటుకు ఒంగోలులో దెబ్బతిన్న ఇల్లు

జోరు వాన

జిల్లాలో ఒక మోస్తరు వర్షం

- ఉదయాన్నే ఉరుములు, మెరుపులతో మొదలు
- ఒంగోలు జలమయం
- ఇబ్బందులు పడ్డ ప్రజానీకం
- పంటలకు మేలు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఒక మోస్తరు వర్షం కురిసింది. బుధవారం తెల్లవారు జాము నుంచి ఉరుములు, మెరుపులతో మొదలైంది. పిడుగుల శబ్దాలతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. జిల్లాకేంద్రమైన ఒంగోలులో భారీవర్షం కురిసింది. రోడ్లన్నీ నీటితో నిండి చెరువులను తలపించాయి. గంటపాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బుధవారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో 14.3 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పుల్లలచెరువు మండలంలో 118.4 మి.మీ కురిసింది. అత్యల్పంగా కురిచేడు మండలంలో 4.2 మి.మీ నమోదైంది. పొదిలి మండలంలో 68.6, పొన్నలూరులో 50.6, పామూరులో 41.4, దర్శిలో 38.4, కొనకనమిట్లలో 36.0, ఒంగోలు రూరల్‌లో 25.4, ఒంగోలు అర్బన్‌లో 25.4, మద్దిపాడులో 23.2 మి.మీ కురిసింది. హనుమంతునిపాడు మండలంలో 23.0, తాళ్లూరులో 22.2, సీఎస్‌పురంలో 21.6, చీమకుర్తిలో 18.4, సంతనూతలపాడులో 12.4, బేస్తవారపేటలో

మిగతా 6వ పేజీలో

భార్యను హింసించిన భర్త కోసం గాలింపు

- మూడు పోలీసు బృందాల ఏర్పాటు
- 24 గంటల్లో పట్టుకుంటాం : సీఐ
- నిందితుడికి సహకరించిన ఇద్దరు అదుపులోకి..
- బాధితురాలి ఇంటికి వెళ్లి విచారించిన దర్శి డీఎస్పీ




బాధితురాలిని విచారిస్తున్న దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, పొదిలి సీఐ వెంకటేశ్వర్లు

తర్లుపాడు/పొదిలి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడు మండలం కలుజువ్వలపాడులో భార్యను కట్టేసి బెల్ట్‌తో బాదుతూ, కాళ్లతో తన్నుతూ క్రూరంగా హింసించిన భర్త కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. మూడు బృందాలను రంగంలోకి దించారు. నిందితుడిని 24 గంటల్లో పట్టుకుంటామని పొదిలి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన పొదిలిలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. నిందితుడికి సహకరించిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ బ్రహ్మానాయుడు మంగళవారం రాత్రి బాధితురాలు భాగ్యలక్ష్మి ఇంటికి వెళ్లి విచారించారు. దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలను ఓదార్చారు. భాగ్యలక్ష్మి భర్త బాలాజీ, ఆయన రెండో భార్య పద్మావతి పరారీలో ఉన్నారు. వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. బాధితురాలు ప్రస్తుతం మార్కాపురం జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతోంది.

కాలక్షేపం.. తూతూమంత్రం

- రెండో రోజు డీసీసీబీలో విచారణ తీరు ఇదీ
- కీలకమైన రికార్డులు ఇంకా తీసుకోని వైనం
- సంబంధం లేని ఆడిట్‌పై విచారణాధికారి సమీక్ష



ఒంగోలు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో 51 విచారణ రెండో రోజైన బుధవారం కూడా తూతూమంత్రంగానే సాగినట్లు సమాచారం. విచారణాధికారైన సహకార శాఖ అదనపు కమిషనర్ గౌరీశంకర్ రెండో రోజు ఉదయాన్నే బ్యాంకు ప్రధాన కార్యాలయానికి వెళ్లి సాయంత్రం వరకు అక్కడే గడిపినప్పటికీ విచారణ పెద్దగా సాగలేదని సమాచారం. కీలకమైన రికార్డులను బ్యాంకు అధికారుల నుంచి ఆయన పొందలేకపోయినట్లు తెలుస్తోంది. మరోవైపు విచారణపై

మిగతా 6వ పేజీలో

ఉపాధిలో గూడుపుఠాణి

- అక్రమాలను వెల్లడించేందుకు నిరాసక్తత
- ఉన్నతాధికారుల సూచనలతో తప్పుడు నివేదికలు సిద్ధం

పెద్దారవీడు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెద్దారవీడు మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై గూడుపుఠాణీ జరుగుతోంది. ప్రజలకు, ప్రజాప్రతినిధులకు తెలియకుండానే సామాజిక తనిఖీలు చేసిన వారికి, ఆయా పనులను పర్యవేక్షించిన సిబ్బందికి మధ్య జరిగిన చీకటి ఒప్పందాల మేరకు నివేదికలను తారుమారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇవన్నీ కూడా ఉపాధి పనుల్లో చోటుచేసుకున్న అక్రమాల సొమ్ముతో జేబులు నింపుకున్న జిల్లా అధికారుల సూచన మేరకు జరుగుతున్నట్లు సమాచారం. పెద్దారవీడు మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 19 పంచాయతీలలో 637 పనులు చేశారు. మొత్తం రూ.19,53,61,418 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రకటించారు. ఆయా పనులకు



ప్రజావేదికలో పాల్గొన్న జిల్లా ఉన్నతాధికారులు (ఫైల్)

మిగతా 6వ పేజీలో

మహిళ ఆరోగ్యంతోనే కుటుంబానికి బలం

- ఘనంగా 'స్వస్థ నారీ.. స్వశక్తి పరివార్' ప్రారంభం
- హాజరైన కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీ

7

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా పనిచేయాలి

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఎంపీడీవో తేళ్ల రవికుమార్ సూచించారు.స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో మండల పరిధిలోని పంచాయితీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులతో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల నిర్వహణపై బుధవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అక్టోబరు 2 వరకు గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాలను విధిగా నిర్వహించాలని సూచించారు. 20న గ్రీన్‌ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో విరివిగా మొక్కలను నాటాలని చెప్పారు. అన్ని గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్‌లకు తక్షణమే జీతాలు చెల్లింపులు జరిపి చెత్తసేకరణ వాహనాలు అందుబాటులోకి తీసుకొచ్చి రోజూ విధిగా చెత్త సేకరణ జరిగాలని సూచించారు. సీజనల్,అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకొనేలా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. అలాగే పీఎం ఆవాస్ యోజన కింద మంజూరైన గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేలా కృషి చేయాలన్నారు.

పశుక్షేత్ర భూముల పరిశీలన

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చదలవాడ గ్రామంలోని పశుఉత్పత్తి క్షేత్రం భూములను డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. 216 జాతీయ రహదారికి పడమర వైపున ఉన్న బి బ్లాక్ భూములకు వెళ్లే రోడ్డు కిరువైపులా ఉపాది పథకం కింద చింత,వేప, నేరేడు తదితర మొక్కలను పెంచేందుకు పీడీ జోసఫ్‌కుమార్ క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ప్రతిపాదనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట క్షేత్ర డీడీ,మండల ప్రత్యేకాధికారి బి.రవి, ఎంపీడీవో తేళ్ల రవికుమార్, ఏపీవో రవిబాబు పాల్గొన్నారు.

ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2 షెడ్యూలు

ఒంగోలు(రూరల్),సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2లో ఈనెల 19న జరిగే పొగాకు వేలంకు ప్రాసంగలపాడు, అను బ్రోలు వారిపాలెం, ఉప్పుగుండూరు, కేశినేనివారిపాలెం, ఒంగోలు, కొప్పోలు, చదలవాడ, సూరారెడ్డిపాలెం, గుత్తికొండవారిపాలెం గ్రామాల రైతులు పొగాకు బేళ్లను వేలంకు తీసుకురావాలని నిర్వహణాధికారి జె.తులసి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బేలు 150కేజీలకు మించరాదని తెలిపారు.

నేటి నుంచి మండలస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు

సంతనూతలపాడు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు జడ్పీ హైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18, 19న మండల స్థాయి స్కూల్‌గేమ్స్ ప్రారంభం అవుతాయని ఎంఈవోలు చంద్రమౌళీశ్వర్, వెంకారెడ్డిలు బుధవారం ఓప్రకటనలో తెలిపారు. 18న వాలీబాల్, బాడ్మింటన్, చెస్, యోగా , 19న కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీలకు అండర్-14, అండర్-17 బాలురు, బాలికలు అర్హులని తెలిపారు.



ఎండోమెంట్ భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ బృందం

ఆక్రమిత ఎండోమెంట్ భూమి పరిశీలన

సంతనూతలపాడు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పేర్నమిట్ట లింగారెడ్డి కాలనీ సమీపంలో స్థానిక చెన్నకేశవస్వామి, రంగనాథస్వామి ఆలయాలకు సంబంధించి ఎండోమెంట్ భూముల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, మండల సర్వేయరు రాజేష్‌ల బృందం బుధవారం పరిశీలించింది. సర్వే నెంబరు 212/3ఎ,2ఎ,1లలో చెన్నకేశవస్వామి, రంగనాథస్వామి ఆలయాలకు సంబంధించి ఎ.1-56 సెంట్లు భూమి ఉందన్నారు. దీనిలో కొంత భూమి ఆక్రమణకు గురికావడంతో ఎండోమెంట్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలించారు. వర్షం కారణంగా భూమి తేమగా ఉందని, సర్వేచేయడం వీలుకాదని, వర్షం తెరిపిచ్చిన తర్వాత డ్రోన్ ద్వారా సర్వేచేయిస్తామని తహసీల్దార్ తెలిపారు.

పన్నులు చెల్లించకుంటే కేసులు

బల్లికురవ, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై తిరిగే వాహనాలకు సకాలంలో పన్నులు చెల్లించకుంటే కేసులు నమోదు చేస్తామని బాపట్ల ఆర్‌టీవో ప్రసన్నకుమారి తెలిపారు. బుధవారం సాయంత్రం మండలంలోని మల్లాయపాలెం, వేమవరం గ్రామాల వద్ద టాక్స్ చెల్లించని ట్రాలీ లారీపై కేసు నమోదు చేసి పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. అనంతరం ఇటీవల సుబాబుల్ ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన గ్రానైట్ లారీని స్టేషన్ నుంచి విడుదల చేయించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే

ఎస్పీగా హర్షవర్ధన్‌రాజు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బుధవారం రాత్రి ఆయన కార్యాలయంలో ఎస్పీని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

టెట్‌లో మినహాయింపు ఇవ్వాలి

ఒంగోలు విద్య, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులుగా 2010కి ముందు ఉపాధ్యాయ వృత్తిలో చేరిన వారందరికి టెట్ నుంచిమినహాయింపు ఇవ్వాలని ఆపస్ నాయకులు కోరారు. బుధవారం డీఆర్వో ఓబులేషును కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ వినతిపత్రాన్ని పీఎంకు పంపాలని కోరారు. లేనిపక్షంలో 20 లక్షల మంది ఉపాధ్యాయులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వస్తుందని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆపస రాష్ట్ర సంఘటనా కార్యదర్శి సీహెచ్ శ్రావణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కే మల్లికార్జునరావు, కే నరసింహం, హజీరాబేగం తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పెయింటింగ్‌పై అవగాహన సదస్సు

ఒంగోలు కలెక్టరేట్,సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వికసిత భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాయువజన సంక్షేమశాఖ, జిల్లా విద్యాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు పెయింటింగ్ పోటీలు, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెట్ప్ సీఈవో శ్రీమన్నారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారి కిరణ్‌కుమార్‌లు ఈ పోటీలను ప్రారంభించి విద్యార్థినులకు వికసిత భారత్‌పై అవగాహన కల్పించారు. ఈ నెల 23వతేదీ వరకు ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సెట్ప్ సీఈవో శ్రీమన్నారాయణ తెలిపారు.

పొన్నలూరులో వర్షం

పొన్నలూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం 7 నుంచి 8 గంటల వరకూ పడింది. 50.6 మి.మీ వర్షపాతం నమోదైంది. రోడ్లకు ఇరువైపులా నీరు నిలిచింది. భూగర్భ జలాలు అడుగుంటుతున్నాయన్న ఆందోళనలో ఉన్న ప్రజలకు తాజా వర్షం ఉపశమనం కలిగించింది.

పచ్చిరొట్ట ద్వారా భూసారాన్ని పెంపొందించుకోవాలి

పొన్నలూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైతులు పచ్చిరొట్ట ఎరువులను ఉపయోగించి భూసారాన్ని పెంపొందించుకోవాలని వ్యవసాయాధికారి వి.రాము సూచించారు. మండలంలోని రావులకొల్లు, ఉప్పలదిన్నె గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడాలన్నారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని కోరారు. పశువైద్యాధికారి పి.శివరామకృష్ణ మాట్లాడుతూ పశు కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రైతులకు 7శాతం వడ్డీతో రెండు లక్షల వరకు బ్యాంకు రుణాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

ఆరోగ్యంపై విద్యార్థినులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులతో పాటు మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసర ఉందని ప్రముఖ డాక్టర్ చాపల శాంతికుమారి తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినోత్సవాన్నిపురష్కరించుకొని బుధవారం రాత్రి స్థానిక అంబేద్కర్ వద్ద ఉన్న బాలికల వసతిగృహంలో సేవా పక్షోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లెళ్ళమూడి రమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ శాంతకుమారి శరీర ఆరోగ్యం, స్త్రీల నెలసరి సంబంధిత సమస్యలు, పోషకాహారం ప్రాముఖ్యత, శుభ్రతవంటి అంశాలపై అవగాహన కల్పించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లు పోలీసులకు పట్టు బడ్డాయి. అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించిన పోలీసులు ట్రాక్టర్‌లను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కీలక సమయం.. విప్పాలి గళం

(5వ పేజీ తరువాయి)

ప్రాంతంలో సీబీజీ ప్లాంట్‌లు వంటి ఇతరత్రా పలు అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు అంశాలు ప్రభుత్వ ప్రాధాన్యతలుగా కనిపిస్తున్నాయి.

వచ్చే జూన్‌కు వెలిగొండ..

పశ్చిమ ప్రజల చిరకాల కోరిక అయిన వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను వచ్చే జూన్‌కు ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని సీఎం చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. అవసరమైన నిధులకు హామీ ఇచ్చారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు ప్రక్రియ ఉన్నతస్థాయిలో నడుస్తోంది. పీపీపీ పద్ధతిలో మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణం ఈ విధానంలో చేపట్టాలని నిర్ణయించింది. అందులో తొలి జాబితాలోనే మార్కాపురం మెడికల్ కాలేజీని చేర్చింది. ఇక జిల్లాకు తలమానికంగా, పాడి రైతులకు బాసటగా నిలిచే ఒంగోలు డెయిరీ పునరుద్ధరణపైనా ఆశలు రేకెత్తుతున్నాయి. జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి చొరవతో ఇందుకు సంబంధించి ప్రాథమిక ప్రక్రియ ప్రారంభమై ముఖ్యమంత్రి దృష్టి వరకూ వెళ్లింది. దొనకొండ పారిశ్రామిక అభివృద్ధిపై సంబంధిత శాఖల ద్వారా పలు ప్రయత్నాలు సాగుతున్నాయి. రాష్ట్రంలో డిఫెన్స్ క్లస్టర్ల ఏర్పాటులో భాగంగా ఒకటి దొనకొండ వద్ద తాజాగా జరిగిన కలెక్టర్ల సదస్సులో ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే కనిగిరి ప్రాంతంలో రిలయన్స్ సీబీజీ ప్లాంట్‌కు పునాది పడింది. మరికొన్నిచోట్ల వాటి ఏర్పాటు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

కాలక్షేపం.. తూతూమంత్రం

(5వ పేజీ తరువాయి)

దృష్టి సారించకుండా బుధవారం ఉదయం సహకారశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి అందులో తనకు సంబంధం లేని ఆడిట్‌పై సమీక్ష చేసినట్లు తెలుస్తోంది. ఇదంతా కాలక్షేప వ్యవహారంగా విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే విచారణ ప్రక్రియ కొనసాగిస్తున్నట్లు చూపే ప్రయత్నంలో భాగంగా రుణాలు పొందిన లబ్ధిదారుల వివరాలను సమర్పించాలని విచారణాధికారి కోరడం, తదనుగుణంగా కంప్యూటర్లలో ఉండే ఆ వివరాల జాబితాలను బ్యాంకు సిబ్బంది తీసి ఇవ్వడానికే సమయం అంతా సరిపోయినట్లు సమాచారం. నిజానికి ఈ తరహా విచారణల సమయంలో విచారణాధికారి కోరిన విధంగా బ్యాంకు అధికారులు అన్నిరకాల రికార్డులను అందజేసి ధ్రువీకరణ పొందాలి. ఫిర్యాదుల్లో పేర్కొన్న అంశాలు, ప్రాథమికంగా గతంలో త్రిసభ్య కమిటీ చేసిన విచారణలో గుర్తించిన అంశాలను రికార్డులలో పరిశీలించి తప్పులను విచారణాధికారి నిగ్గు తేల్చాలి. అదేసమయంలో విచారణకు ఆటంకం కలగకుండా ఉండేందుకు ప్రారంభ సమయంలోనే ఫిర్యాదులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్యాంకు ఉద్యోగులను ప్రస్తుతం వారు పనిచేసే స్థానాల నుంచి పక్కన పెట్టాలి. అలాంటి చర్యలు ఏవీ ఇప్పటివరకు విచారణాధికారి తీసుకోకపోవడం, ఆయన సూచనలకు అనుగుణంగా బ్యాంకు అధికారులు వ్యవహరించడం వంటివి లేవని తెలుస్తోంది.

అంతా మొక్కుబడిగానే..

విచారణాధికారి గౌరీశంకర్ కూడా మొక్కుబడిగా బ్యాంకుకు రావడం మినహా విచారణ సక్రమంగా చేసే యోచనలో లేరన్న చర్చ సహకారశాఖ వర్గాల్లో నడుస్తోంది. అందుకు ఆయన వ్యవహరిస్తున్న తీరును ఉదహరిస్తున్నారు. తొలివిడత విచారణను టూచ్ అనిపించిన ఆయన రెండవ విడత వచ్చినప్పటికీ విచారణపై తగురీతిలో దృష్టి పెట్టలేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. సహాయకులుగా కమిషనర్ నియమించిన అధికారులను తీసుకరాకపోవడమే కాక రహస్యంగా విచారణ సాగించే ప్రయత్నం, అంతకు మించి బ్యాంకులో అవినీతి, అక్రమాలలో భాగస్వామ్యులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి కనుసన్నల్లో మొత్తం ప్రక్రియ సాగుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా రెండో విడత విచారణలో రెండో రోజైన బుధవారం ఉదయం బ్యాంకులో విచారణ పక్కనపెట్టి సహకారశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించడం, అది కూడా తనకు సంబంధించిన మార్కెటింగ్ వ్యవహారాలు కాకుండా సొసైటీలు, ఇతర సంస్థల ఆడిట్‌పై సమీక్ష చేయడం వంటివి విచారణ పేరుతో వచ్చి కాలక్షేపం చేయడమేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

'ఉపాధి'లో గూడుపుఠాణి

(5వ పేజీ తరువాయి)

సంబంధించి పది రోజులుగా సామాజిన తనిఖీ బృందం విచారణ చేపట్టింది. సుమారు రూ.6 కోట్ల మేర అక్రమాలు జరిగినట్లు తనిఖీ సిబ్బంది నిర్ధారించినట్లు సమాచారం. అయితే వాటిని కప్పిపుచ్చుకోవడానికి అప్పుడు పనిచేసిన ఉపాధి హామీ సిబ్బంది గూడుపుఠానీ చేసి తనిఖీ చేసిన సిబ్బందికి భారీగా ముడుపులు సమర్పించినట్లు ప్రచారం జరుగుతోంది.

తప్పుడు నివేదికలకు సిద్ధం

మండలంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తప్పుడు నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి రాజకీయ నేపథ్యాలు ఉండడంతో వారు సైతం అక్రమాలను ప్రోత్సహించినట్లు సమాచారం. వారి అండదండలతోనే ఉపాధి సిబ్బంది అక్రమాలకు పాల్పడినట్లు ప్రచారం జరుగుతోంది. అందుకే మండల స్థాయి అధికారులు సామాజిక తనిఖీలకు సంబంధించిన సమాచారం రాజకీయ నాయకులకు, ప్రజలకు, పత్రికా ప్రతినిధులకు సమాచారం ఇవ్వలేదు. తూతూ మంత్రంగా ప్రజా వేదిక నిర్వహించి మమ అనిపించే ప్రయత్నం చేశారు. కానీ పత్రికలలో కథనాలు రావడంతో ఉపాధి పనులలో జరుగుతున్న అక్రమాలు వెలుగుచూసాయి.

నివేదికలు సిద్ధం చేస్తున్నాం

\- సాంబశివుడు, ఏపీవో

పెద్దారవీడు మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పనులలో జరిగిన అక్రమాలపై తనిఖీ సిబ్బంది నివేదికలు తయారు చేస్తున్నారు. అవి పూర్తయిన వెంటనే ఉన్నతాధికారులకు పంపిస్తాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

ఉచ్చు బిగుస్తోంది!

(5వ పేజీ తరువాయి)

ఎన్టీఆర్ జిల్లాలో పోలీసులకు దొరికిన డబ్బు ఎన్నికల అనంతరం తమవేనని ఒంగోలు ప్రాంతానికి చెందిన వ్యాపారి ప్రద్యుమ్న అధికారులకు తెలిపారు. ఆయన చెవిరెడ్డి అనుచరుడన్న విషయాన్ని తదనంతరం సిట్ అధికారులు బయటపెట్టారు. ఆ విషయంతో ఈ కేసులో జిల్లాకు సంబంధించి ఎలాంటి అంశాలు వెలుగు చూస్తాయోనన్న ఆందోళన వైసీపీ నేతల్లో గతంలోనే ఆరంభమైంది.

బూచేపల్లి పేరు ప్రస్తావనతో గుబులు

సిట్ అధికారులు కోర్టుకు సమర్పించిన 3వ చార్జిషీట్‌లో దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి పేరును ప్రస్తావించారు. అంతేగాక పొదిలి కేంద్రంగా మద్యం ముడుపుల డబ్బు ఓట్ల కొనుగోలుకు సరఫరా అయినట్లు కూడా పేర్కొన్నారు. అప్పట్లో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పొదిలి సమీపంలో తన క్యాంపు ఆఫీసును ప్రారంభించి అక్కడి నుంచే ఒంగోలు లోక్‌సభలో తన ఎన్నికల వ్యూహాన్ని నడిపిన విషయం విదితమే. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కృష్ణ వ్యాలీ అపార్ట్‌మెంట్ నివాసి, ఈ కేసులో 34వ నిందితునిగా ఉన్న వెంకటేష్‌నాయుడు నివాసం నుంచి నగదు తాడేపల్లికి చేరి అక్కడి నుంచి జిల్లాకు వచ్చినట్లుగా చార్జిషీట్‌లో పేర్కొన్నారు. అలా వచ్చిన కొంత నగదును ఒంగోలులో వైసీపీ వలంటీర్లకు అందజేసినట్లు కూడా సిట్ స్పష్టం చేసింది. అలాగే పొదిలి కేంద్రంగా వ్యవహారం సాగినట్లు కూడా పేర్కొనటం విశేషం. 2024 ఏప్రిల్ 21, 22 తేదీలలో కేసులో 35వ నిందితునిగా ఉన్న చెవిరెడ్డి అనుచరుడు బాలాజీకుమార్ యాదవ్, చెవిరెడ్డి పొదిలిలో కలుసుకున్నట్లు పేర్కొన్నారు. అక్కడి నుంచే వివిధ నియోజకవర్గాలలో ఓటర్లను మభ్యపెట్టేందుకు ఈ మద్యం ముడుపుల డబ్బు సరఫరా జరిగిందన్న అనుమానాన్ని చార్జిషీట్‌లో వ్యక్తం చేశారు. సదరు బాలాజీకుమార్ యాదవ్ అక్కడి నుంచే దర్శి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రంగంలో ఉన్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డితో మాట్లాడినట్లు స్పష్టంగా పేర్కొన్నారు. మద్యం ముడుపుల డబ్బును ఓటర్లకు చేర్చే అంశాన్నే బూచేపల్లితో ఆయన చర్చించినట్లు పేర్కొన్నారు. అయితే ఏ నియోజకవర్గానికి డబ్బు పంపే అంశాన్ని మాట్లాడారనేది ఈ చార్జిషీట్‌లో స్పష్టం చేయలేదు. ఒంగోలు వచ్చిన డబ్బును వైసీపీ వలంటీర్లకు అందజేసినట్లు మాత్రమే పేర్కొన్న సిట్ అధికారులు పొదిలిలో తిష్టవేసి ఓటర్లకు అందజేసేందుకు డబ్బును పంపారని పేర్కొంటూ ఆ సమయంలో బూచేపల్లితో మాత్రమే మాట్లాడారని పేర్కొనడం విశేషం.

దృష్టిపెంచిన సిట్

ముడుపుల డబ్బు ఓట్ల కొనుగోలుకు వినియోగించడం, సరఫరా చేయడంలో కీలకంగా అనుమానిస్తున్న చెవిరెడ్డి చుట్టే దర్యాప్తు సాగుతోంది. ఆ సమయంలో ఆయన ఒంగోలు లోక్‌సభ నుంచి పోటీలో ఉండటం, ఇక్కడికే ఈ డబ్బు ఎక్కువగా వచ్చినట్లు వారు గుర్తించడం, పొదిలి నుంచి పంపిణీ జరిగినట్లుగా ప్రాథమిక ఆధారాలు లభించటంతో ఈ కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులు జిల్లా వ్యవహారాలపై మరింత దృష్టి సారించినట్లు తెలిసింది. దీంతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ముఖ్యంగా ఒంగోలు లోక్‌సభ పరిధిలో చెవిరెడ్డి ద్వారా ఈ ముడుపులు ఏయే నియోజకవర్గాలకు అందాయన్న అంశంపై సిట్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిసింది. అంతేగాక అందులో ప్రత్యక్ష పాత్ర ఎవరెవరికి ఉందన్న అంశంపై కూడా దర్యాప్తు చేపట్టారు. పొదిలి కేంద్రంగా డబ్బు పంపిణీ జరిగిందని, ఆ సందర్భంలో బూచేపల్లితో వారు సంభాషించినట్లు 3వ చార్జిషీట్‌లో పేర్కొనడంతో మున్ముందు దర్యాప్తులో మరెన్ని అంశాలు వెలుగులోకి వస్తాయనేది చర్చనీయాంశంగా మారింది. అప్పట్లో చెవిరెడ్డి ఒంగోలు లోక్‌సభ పరిధిలోని కొన్ని నియోజకవర్గాల ఎన్నికల వ్యవహారాలపై పూర్తి ఆధిపత్యాన్ని చెలాయించారు. వైపాలెంలాంటి నియోజకవర్గంలో అనేక అంశాలపై వివాదాస్పదంగా వ్యవహరించి పోలీసు కేసుల్లో కూడా ఉన్నారు. దీంతో రానున్న రోజుల్లో బూచేపల్లి వ్యవహారం ఏ మలుపు తిరుగుతుంది? అప్పట్లో పోటీచేసిన మరికొందరు వైసీపీ అభ్యర్థుల వ్యవహారం కూడా చార్జిషీట్‌లోకి ఎక్కుతుందా? అన్న అనుమానాలు వైసీపీ నేతల్లోనే కాక యావత్తు ప్రజానీకంలోనూ వ్యక్తమవుతున్నాయి.

జోరువాన

(5వ పేజీ తరువాయి)

11.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మరో నాలుగైదు మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి. తాజా వర్షంతో పంటలకు మేలు చేకూరనుంది. గత వారం పది రోజులుగా ఎండ తీవ్రతతోపాటు ఉక్కపోతతో ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత వర్షంతో కొంత ఉపశమనం కలిగింది.



తహసీల్దార్‌ల సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వెంకట రామిరెడ్డి

బూత్‌ల పరిధిలో ఓటర్లను పరిశీలించాలి

కంభం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పోలింగ్ స్టేషన్ పరిధిలో 2002లో ఉన్న ఓటర్లు అక్కడే ఉన్నారా లేరా పరిశీలించాలని గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకటరామిరెడ్డి తహసీల్దార్‌లకు సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో జరిగిన గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల తహసీల్దార్లు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్, ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు సంబంధించి పలు సూచనలు ఇచ్చారు. సమావేశంలో గిద్దలూరు మున్సిపల్ కమినర్ రమణబాబు, కంభం, బేస్తవారిపేట, అర్థవీడు, రాచర్ల, కొమరోలు, గిద్దలూరు మండలాల తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

రూ.3.34కోట్ల విద్యుత్ బకాయిలు

- ఏడీఈ శ్రీనివాస రెడ్డి వెల్లడి

కంభం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కంభం విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో రూ.3.34కోట్ల విద్యుత్ బకాయిలు ఉన్నట్లు కంభం విద్యుత్ ఏడీఈ శ్రీనివాసరెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలోని కంభం మండలంలో గృహ వినియోగదారులు రూ.72లక్షలు, పంచాయతీ తాగునీటి సరఫరా ఇతరాలు రూ.కోటి, బేస్తవారపేట మండలంలో గృహ వినియోగదారులు రూ.1.58కోట్లు, ఇతరవి రూ.27లక్షలు, అర్థవీడు మండలంలో గృహవినియోగదారులు రూ.64లక్షలు, ఇతరవి రూ.36లక్షలు మొత్తం మూడు మండలాలకు సంబంధించి రూ.3.34కోట్లు గత నెల వరకు బకాయిలు ఉన్నట్లు తెలిపారు.

ఇటుక రాయితో దాడి చేసిన నిందితుడికి రిమాండ్

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): మద్యంమత్తులో ఇటుకరాయితో దాడి చేసిన వ్యక్తికి సింగరాయకొండ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ న్యాయాధికారి శ్యాంసుందరి బుధవారం 14 రోజులు రిమాండ్ విధించారు. ఈనెల 3వ తేదీన మధ్యాహ్నం 3 గంటల సమయంలో టంగుటూరులోని అంబేద్కర్ నగర్‌కు చెందిన కారుమంచి రమేష్ మద్యం తాగి రోడ్డుపై వచ్చేవారిని దుర్భాషలాడుతూ భయభ్రాంతులకు గురిచేశాడు. అదే ప్రాంతానికి చెందిన మద్దిరాల కార్తీక్ రమేష్‌ను ఎందుకు తాగి గోలచేస్తావని అడిగి వారించి ఇంటికి వెళ్లాడు. తాగిన మైకంలో కోపంతో ఉన్న రమేష్.. కార్తీక్ ఇంటికి వెళ్లి ఇటుకరాయితో తలపై కొట్టడంతో బాధితుడు రమేష్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు బుధవారం కేసు నమోదు చేసి రమేష్‌ను అరెస్ట్ చేసి సింగరాయకొండ కోర్టులో హాజరుపరచగా కోర్టు నిందితుడికి రిమాండ్ విధించింది.

14 మంది ఎంపీడీవోలకు పోస్టింగ్‌లు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవో)గా ఇటీవల పదోన్నతులు పొందిన జిల్లాపరిషత్ పరిపాలనాధికారులు (ఏవోలు), డిప్యూటీ ఎంపీడీవోలకు పోస్టింగ్‌లు ఇస్తూ జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. 20 మంది ఉద్యోగోన్నతులు పొందగా వారిలో 14 మందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఈ పోస్టింగ్‌లు ఇచ్చారు. కే సీతారామయ్య (గిద్దలూరు), ఎస్‌కు ఖాసీం పీరా (అర్ధవీడు), జీవీ కృష్ణారావు (పీసీపల్లి), జే జాన్ సుందరం (పెద్దారవీడు), ఎస్.సత్యం (కోమరోలు), డి.అబ్దుల్ ఖాదర్ (కనిగిరి), వి.ప్రతాప్‌రెడ్డి (సీఎస్‌పురం)లను ఎంపీడీవోలుగా నియమించారు. అన్నమ్మ (తర్లుబాడు), ఎ.బాలచెన్నయ్య (మార్కాపురం), కేఎస్.మల్లికార్జునరావు (గుడ్లూరు), వై.శంకరరావు (వీవీపాలెం), డి.జయరాం నాయక్ (లింగ సముద్రం), బి.వర్ధిణి (అద్దంకి); కే ధనలక్ష్మి(చినగంజాం) ఎంపీడీవోలుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పొగాకు ధర కేజీ రూ.343

ఒంగోలు(రూరల్),సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలంకేంద్రంలో రెండులో బుధవారం జరిగిన వేలంలో పొగాకు కేజీ గరిష్ఠ ధర 343 రూపాయలకు వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈ వేలంలో లోగ్రేడ్ పొగాకు కేజీ 105 రూపాయలకు కొనుగోలు చేశారు. వేలానికి మొత్తం 1,227 బేళ్లు రాగా 1,044 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు.79 బేళ్లు నోబిడ్ అయ్యాయి.

ఐటీఐ అభ్యర్థులకు ఆర్టీసీలో అప్రంటీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులకు ఏపీఎస్ ఆర్టీసీలో అప్రంటీషిప్ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెల్లూరు జోనల్ సిబ్బంది కళాశాల కే.రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబరు 4వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రకాశం జిల్లాలో డీజిల్ మెకానిక్ 37, మోటారు మెకానిక్ 2, ఎలక్ట్రీషియన్ 9, వెల్డర్ 1, ఫిట్టర్ 3, డ్రాఫ్ట్‌మెన్ (సివిల్) 1, మొత్తం 54 ఖాళీలు ఉన్నాయన్నారు. అప్రంటీస్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో వివరాలతో రెజ్యూమ్, ఎస్ఎస్‌సీ మార్కుల లిస్ట్, ఐటీఐ మార్కుల మెమో, ఎన్‌సీవీటీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు పర్మినెంట్ సర్టిఫికెట్ లేనిఎడల ఆరు నెలలోపు జారీ చేయబడిన తాత్కాలిక ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. దివ్యాంగులైనవారు ప్రభుత్వం జారీ చేసిన ధ్రువీకరణ పత్రం, మాజీ సైనిక ఉద్యోగులు పిల్లలు వారి కుటుంబ ధ్రువీకరణ పత్రం, ఎన్‌సీసీ, క్రీడా సర్టిఫికెట్‌లు ఉంటే వాటిని పొందుపరచాలని, ఆధార్ కార్డును జతపరచాలని తెలిపారు. ఇతర పూర్తి వివరాలకు 91542 91408 ద్వారా ఆఫీసు పనివేళల్లో సంప్రదించాలని తెలిపారు.

టూవీలర్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

● ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల



ఎంపీ, ఎమ్మెల్యేలకు వినతిపత్రం ఇస్తున్న టూవీలర్ అసోసియేషన్ ప్రతినిధులు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని టూ వీలర్స్ కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ పేర్కొన్నారు. ఏపీ టూ వీలర్స్ మెకానిక్‌ల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం బుధవారం స్థానిక షాదీఖానాలో నిర్వహించారు. కార్యక్రమానికి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దాయనేని ధర్మ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ఎంపీ, ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. మాగుంట మాట్లాడుతూ దసరా నుంచి ఆటోడ్రైవర్లకు దసరా కానుకగా ప్రభుత్వం రూ.15వేలు ఇస్తుందన్నారు. టూ వీలర్స్ మెకానిక్‌ల సంక్షేమానికి కూడా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ టూ వీలర్స్ సమస్యలపై మంత్రి నారా లోకేష్ దృష్టిసారించారన్నారు. నాడు ఎన్నికలకు ముందు యువగళంలో భాగంగా ఒంగోలు పర్యటనలో టూ వీలర్స్ సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు అధికారంలోకి వచ్చిన తర్వాత వారి అభివృద్ధి సంక్షేమాన్ని పట్టించుకుంటామని తెలిపారన్నారు. త్వరలోనే తాను, ఎంపీ మాగుంట కలిసి ముఖ్యమంత్రిని కలుస్తామన్నారు. మెకానిక్‌ల కార్పొరేషన్ ఆవశ్యకత, కల్యాణ మండపాల ఏర్పాటు, ఇండ్ల స్థలాల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని తెలిపారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి శీతారామయ్య, కమ్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండవ మురళీకృష్ణతోపాటు జనసేన జిల్లా నాయకులు కంది రవిశంకర్, 26 జిల్లాలకు చెందిన టూ వీలర్స్ మెకానిక్‌ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్



పొన్నలూరులో చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా బుధవారం పారిశుధ్యం నిర్వహణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కలెక్టర్ రాజాబాబు ఆదేశాలతో ఆ శాఖ అధికారులు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లాలో ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండటంతో ఆ వ్యాధులను నివారించేందుకు ముందుగా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ప్రజల నుంచి సేకరించిన చెత్తను చెత్తసంపద కేంద్రాలకు తరలించే విధంగా చర్యలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టగా జిల్లా పంచాయతీ అధికారి ఎం. వెంకటేశ్వరరావు పొన్నలూరులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ కార్మికులు సేకరిస్తున్న చెత్తను పరిశీలించడంతో పాటు చెత్త నిల్వ చేయడం వల్ల జరిగే దుష్పరిణామాలను డీపీవో ప్రజలకు వివరించారు. జిల్లా వ్యాప్తంగా డివిజనల్ పంచాయతీ అధికారులు, డిప్యూటీ ఎంపీడీవోల ఆధ్వర్యంలో వారి పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమాలను చేపట్టారు. డివిజనల్ పంచాయతీ అధికారులతో పాటు, డిప్యూటీ ఎంపీడీవోలు ఆయా గ్రామాల్లో జరుగుతున్న స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు పారిశుధ్యం అవగాహన కల్పించారు. గ్రామాల్లో పేరుకొని పోయిన చెత్త తొలగింపుతో పాటు కాలువల్లోని చెత్తాచెదారాన్ని తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు.

పలు మెడికల్ షాపుల లైసెన్సులు రద్దు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు ఉల్లంఘించిన పలు మెడికల్ షాపుల లైసెన్సులు రద్దు చేసినట్లు జిల్లా డ్రగ్స్ కంట్రోల్ అథారిటీ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. తనిఖీల్లో డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ 1940 ప్రకారం నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించామన్నారు. కొనకనమిట్ల, దర్శి, పొదిలి, మార్కాపురం, కనిగిరి, అలాగే ఒంగోలులో ఒకటి కలిపి మొత్తం పది షాపుల లైసెన్సులు రద్దు చేశామని అధికారులు తెలిపారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఒంగోలు విద్య, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రకేసరి యూనివర్శిటీ పరిధిలోని లా కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఒకటి, మూడవ సెమిస్టర్ ఫలితాలను ఏకేయూ వైస్ ఛాన్సలర్ డీవీఆర్ మూర్తి బుధవారం సాయంత్రం విడుదల చేశారు. మొదటి సెమిస్టర్ విద్యార్థులు ఎల్ఎల్‌బీ 3వై కోర్సుల్లో 383 మంది హాజరు కాగా 313 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎల్ఎల్‌బీ 5వై కోర్సులో 88 మంది హాజరు కాగా 66మంది ఉత్తీర్ణులయ్యారు. ఎల్ఎల్ఎం కోర్సులో 44 మంది హాజరుకాగా 38 మంది ఉత్తీర్ణులయ్యారు. మూడవ సెమిస్టర్‌లో ఎల్ఎల్‌బీ 5వై కోర్సులో 55 మందికి 50 మంది ఉత్తీర్ణులు కాగా ఎల్ఎల్ఎం కోర్సులో 42 మందికి 40 మంది ఉత్తీర్ణులయ్యారు.

జార్జికి ఘనంగా నివాళి

మార్కాపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జార్జి విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఆదిమూలపు శామ్యూల్ జార్జికి బుధవారం ఘనంగా నివాళులర్పించారు. జార్జి ఇంజనీరింగ్ కాలేజీలోని ఆయన సమాధి వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాలేజీలో జార్జి స్మారక ఉపన్యాస కార్యక్రమం జరిగింది. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ కాళహస్తి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజబాబు, డీన్ డాక్టర్ మస్తానయ్య, ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసన్నకుమార్, డాక్టర్ డేనియల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్టాండ్ వద్ద రహదారి

నగరం.. చెరువైంది!



కొత్తపట్నం బస్టాండ్ వద్ద శివాలయంలోకి చేరిన వర్షపు నీరు

● ఒంగోలులో కుండపోత వాన ● బెంబేలెత్తించిన ఉరుములు.. మెరుపులు



బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ ఎదురు రహదారి ఇలా..



కర్నూలు రోడ్డులో వర్షపు నీటిలో నిలిచిన ట్రాఫిక్

ఒంగోలులో ఎడతెరిపి లేకుండా కురిసిన కుండపోత వానకు నగరం చెరువైంది. బుధవారం ఉదయం ఏకధాటిగా గంటన్నరసేపు కురిసిన వర్షానికి ఒగోలులోని ప్రధాన వీధుల్లో వర్షం నీరు ఏరులా పారింది. ఒకవైపు ఉరుములు మెరుపులు.. పిడుగుల శబ్దాలతో నగరం హడలెత్తింది. మరోవైపు భారీగా ఈదురు గాలులు వణికించాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వానతోపాటు నగరంలోని తాతా కల్యాణమండపం ఎదురు దండూరి రంగారావు మేడపైన పిడుగు పడింది. దాని ప్రభావంతో పక్కన ఉన్న దండూరి నాగయ్యకు చెందిన ఇంటిపై రేకులు పగిలిపోయాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి భాగ్యనగర్‌లో, జీజీహెచ్ ఎదురు, కర్నూలు రోడ్, పలు వీధుల్లో నీరు నిలిచి ఆ ప్రాంత ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ధారావారి తోట, దేవుడు చెరువు, సీఎస్ఆర్ శర్మాకళాశాల, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్, ఆర్టీసీ డిపో ఆవరణం, ఏకలవ్య నగర్, మసాన్ దర్గా సెంటర్, భాగ్యనగర్‌లో నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందుల పడ్డారు. పిడుగుల పడటంతో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి పలు గృహోపకరణాలు కాలిపోయాయి.

\- ఆంధ్రజ్యోతి, ఒంగోలు కార్పొరేషన్



పిడుగుపాటుకు దెబ్బతిన్న భవనం పైభాగం



సాగర్ లాడ్జి ఎదురు రహదారి ఇలా..

మహిళ ఆరోగ్యంతోనే కుటుంబానికి బలం

● ఘనంగా 'స్వస్థ్ నారీ.. స్వశక్తి పరివార్' ప్రారంభం ● హాజరైన కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీ



ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే జనార్దన్, కలెక్టర్ రాజాబాబు, మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కుటుంబంలోని మహిళ ఆరోగ్యవంతంగా ఉంటేనే ఆ కుటుంబం, సమాజం మరింత బలంగా ఉంటుందని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదినం పురస్కరించుకుని, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దేశవ్యాప్తంగా అన్నీ ప్రభుత్వ ఆసుపత్రులలో ఏర్పాటు చేయనున్న 'స్వస్థ్ నారీ- స్వశక్తి పరివార్' కార్యక్రమాన్ని బుధవారం ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా, కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన మహిళ, బలమైన కుటుంబం అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయడం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్య రంగానికి ముఖ్యంగా మహిళ ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. ఎంపీ మాగుంట మాట్లాడుతూ నేడు మహిళలు తమ ఆరోగ్యం కోసం ఆసుపత్రులకు వెళ్ళి పరీక్షలు చేయించుకుని, వైద్యం చేయించుకోవడం ఖర్చుతోకూడుకొని ఉందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమం ద్వారా ప్రతి మహిళ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అన్నీ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో, ప్రభుత్వ ఆసుపత్రుల్లో, స్వస్థ నారీ, స్వశక్తి పరివార్ అభియాన్ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం చేపట్టిన ఈ పథకాన్ని ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందుగా డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు స్వస్థ నారీ, స్వశక్తి పరివార్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించగా, కార్యక్రమంలో నోడల్ అధికారి శ్యామల, జీజీహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్, రిమ్స్ మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ అశోక్ కుమార్, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్ నాయక్, ఐసీపీడీఎస్ పీడీ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీకి పాల్పడిన మహిళ అరెస్టు

● రూ 7.5 లక్షల విలువైన సొత్తు స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ విజయకృష్ణ

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇల్లు అద్దెకు కావాలని వచ్చి వృద్ధురాలి వద్ద ఉన్న బంగారం దోపిడీ చేసిన మహిళను అరెస్టు చేసి రూ.7.5లక్షల విలువైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు ఒంగోలు తాలుకా సీఐ విజయకృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక తాలుక పోలీసు స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. ఈనెల 9న స్థానిక సుజాతనగర్ 3వలైన్‌లో వంటరిగా నివాసం ఉంటున్న రిటైర్డ్ ఉద్యోగి నేతి పుష్పవతి ఇల్లు అద్దెకు ఇవ్వబడును అనే బోర్డును చూసి వచ్చిన మహిళ ఆమెపై దాడి చేసి బంగారం గాజులు, మెడలో గొలుసును దోచుకుని వెళ్లింది. సీసీ ఫుటేజీ ఆధారంగా నగరంలోని వెంకటేశ్వరకాలనీలో నివాసం ఉంటున్న కొణిదెల విజయరాణిగా గుర్తించి ఆమెను అదుపులోకి తీసుకొని విచారించారు. ఆమె నేరం అంగీకరించడంతో పాటుగా అపహరించిన బంగారం ఆభరణాలను ఇచ్చింది. దీంతో విజయరాణిని పోలీసులు అరెస్టు చేశారు.

కేసును ఛేదించిన సిబ్బందకి అభినందనలు

ఈకేసును ఛేదించిన క్రైం టీం ఎస్సై శ్రీనివాసరావు, ఏఎస్సై కే.సురేష్, హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ, శాంతకుమార్, కానిస్టేబుల్ రవి, సీసీ ఫుటేజీ టెక్నీషియన్ వెంకీలను సీఐ అభినందించారు.

విజయవాడకు రైట్‌రైట్

● డీఎస్సీ ఎంపిక అభ్యర్థుల తరలింపునకు అధికారుల చర్యలు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మోగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవాడకు తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ రాజాబాబు తెలిపారు. విజయవాడ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఈనెల 19న నిర్వహించే నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాల నుంచి వస్తున్న అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. కలెక్టర్ రాజాబాబు పలు అంశాలను సీఎస్ దృష్టికి తీసుకెళ్ళారు. జిల్లా నుంచి ఎంపికైన 661 మంది అభ్యర్థులను జోనల్ స్థాయిలో ఎంపికైన ప్రిన్సిపాల్, పీజీటీలు, టీజీటీలు 188 మందిని అమరావతికి తరలించేందుకు అన్ని ఏర్పాట్లూ చేసినట్లు తెలిపారు. ఒంగోలులోని సెయింట్ జేవియర్స్ హైస్కూలు, మంగమూరు రోడ్డులోని రామచంద్రమిషన్, క్విస్ ఇంజనీరింగ్ కాలేజీలకు అభ్యర్థులను ఈనెల 18వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు తరలించి 19వ తేదీ ఉదయం 9గంటల వరకు వసతి కల్పించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అభ్యర్థులను తరలించేందుకు 38 బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఆర్టీసీ ఆర్ఎం సత్యనారాయణ, డీఈవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అడవి పందిని ఢీకొట్టి వాహనదారుడు మృతి

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అడవి పంది ఢీకొట్టిన ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన మండలంలోని పెద్ద మంతనాల వద్ద బుధవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పెద్ద మంతనాలకు చెందిన కుడుముల రామన్న(45) మృతి చెందారు. రామన్న ఎర్రగొండపాలెంలో నివాసముంటున్నారు. ఆయన తన స్వగ్రామం పెద్ద మంతనాలకు తెల్లవారుజామున బైకుపై వెళ్తుండగా ఉన్నట్టుండి అడవి పంది రోడ్డుపైకి రావడంతో దానిని ఢీకొట్టి బైకుపై నుంచి కింద పడిపోయాడు. తలకు గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

మహిళల సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ● 'సూపర్ సిక్స్ సూపర్ హిట్' భారీ ర్యాలీ



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళ సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సూపర్ సిక్స్ పథకాల అమలు సూపర్‌హిట్ కావడంతో బుధవారం గిద్దలూరు పట్టణంలో మహిళలు సంబరాలు నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి విఠా సుబ్బరత్నం కల్యాణ మండపం వరకు భారీగా మహిళలు, శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సూపర్ సిక్స్.. సూపర్ హిట్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి చిత్రపటాలకు మహిళలు పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లా ప్రజా ప్రభుత్వం మహిళల సాధికారతే లక్ష్యంగా పాలన సాగిస్తుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో ఉచిత గ్యాస్, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలు సూపర్ హిట్ అయ్యాయన్నారు. త్వరలో ఆటోడ్రైవర్లకు దసరా కానుకగా రూ.15వేలు అందజేయనున్నట్లు తెలిపారు. చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీ నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి చూపారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, పట్టణ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ షానేషావలి, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, మార్కెట్‌యార్డు చైర్మన్ బైలడుగు బాలయ్య, వైస్ చైర్మన్లు గోడి ఓబులరెడ్డి, తోట మహాలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు మార్త్రాల సుబ్బారెడ్డి, బండ్లమూడి అంజనేయులు, బోనేని వెంకటేశ్వర్లు, సొసైటీ బ్యాంక్ చైర్మన్లు దుత్తాబాలీశ్వరయ్య, గోపిరెడ్డి జీవన్‌రెడ్డి, కొనతం రంగారెడ్డి, బిజెపి నాయకులు పిడతల రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

యువకుడిని కాపాడిన కానిస్టేబుల్ పీరయ్య

కంభం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని కానిస్టేబుల్ కాపాడిన ఘటన బుధవారం జరిగింది. మండలం కందులాపురానికి చెందిన బ్రహ్మయ్య కుటుంబ సభ్యులతో గొడవపడి జీవితంపై విరక్తితో కందులాపురం కొండపై ఉన్న శివాలయం సమీపంలో పురుగు మందు తాగి ఆత్మహత్యా ప్రయత్నం చేశారు. డయల్ 100 ద్వారా విషయం తెలుసుకున్న కానిస్టేబుల్ పీరయ్య కొండపైకి వెళ్లి అపస్మారకస్థితిలో ఉన్న బ్రహ్మయ్యను కిందికి మోసుకొచ్చి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించగా ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. కానిస్టేబుల్ పీరయ్యను పలువురు అభినందించారు.



రంగాయపాలెంలో ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న తమిళనాడు బృందం

ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడు రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్‌కు చెందిన 33 మంది సభ్యులబృందం జిల్లాలో ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలించేందుకు జిల్లాకు వచ్చింది. ఈ బృందం మూడు రోజుల పాటు పర్యటించనుంది. రాష్ట్ర రైతు సాధికార సంస్థ అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి ఆధ్వర్యంలో బుధవారం కొత్తపట్నం మండలం రంగాయపాలెంలో ఆరోగ్యఅండ్ పోషణ కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం కాటా సురేంద్రకు చెందిన ఏటీఎం, ఏ గ్రేడ్‌వేరుశనగ మోడల్, నాగరాజుకు చెందిన ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్, రామారావుకు చెందిన బయో రిసోర్స్‌సెంటర్‌లో విత్తన గుళికలు, ఘన, ద్రవ జీవామృత తయారీ ప్రదర్శనలను తిలకించారు. ఈతముక్కల, వజ్జిరెడ్డి పాలెం,కొత్తపట్నం గ్రామాల్లో పర్యటించారు. ఈ పర్యటనలో తమిళనాడు బృందంతో పాటు ఆర్‌వైఎస్ఎస్ రాష్ట్ర కార్యాలయం నుంచి హుమయూన్, కృష్ణారావు, దాదాపీర్, శ్రీలేఖ తదితరులు ఉన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తదియారాధన సంఘ ప్రతినిధులు

22 నుంచి వాసవి అమ్మవారి శరన్నవరాత్రులు

ఒంగోలు కల్చరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):ఒంగోలు అమలనాధుని వారివీధిలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలను ఈ నెల 22వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు వాసవి తదియారాధన సంఘం, వాసవి కోలాట భజన సంఘం ప్రతినిధులు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం దేవస్థాన ప్రాంగణంలో ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు అమ్మవారికి వివిధ అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజూ శ్రీసూక్త సహితంగా నవరసాభిషేకాలు, సహస్రనామార్చన, సాయంత్రం 7 గంటలకు భజన, 8 గంటలకు కుంకుమార్చన, 9 గంటలకు లక్ష్మీడిప్ కార్యక్రమం నిర్వహించి అమ్మవారి పసుపు కుంకుమలతో పాటు చీరను ప్రసాదంగా అందిస్తామన్నారు. అదేవిధంగా బాలికలతో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి వేషధారణ పోటీలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.



కలెక్టర్ రాజాబాబుకు వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

బీసీల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన తరగతులకు చెందిన బీసీల ఐదు ప్రధాన సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని బుధవారం ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ రాజాబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు- బీసీ రిజర్వేషన్లు, బీసీ కులగణనతో పాటు బీసీలకు ప్రత్యేక రక్షణ, జనాభాప్రాతిపదికన ఓబీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖ, ఓబీసీ సబ్ ప్లాన్ ఈమేరకు ప్రత్యేకబడ్జెట్ కేటాయింపు, రాజధానిలో మహాత్మాజ్యోతిభాపూలే, సావిత్రిబాయిపూలేల స్మృతి వనం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకు ముందు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజాబాబును వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బలగాని ఆంజనేయులు, ఎస్కే హజీజ్, నాగరాజు, రాజేష్‌కుమార్, వై. వీరయ్య, బి. వెంకటేశ్వర్లు, ఎం. దానయ్య, ఎన్, సుబ్బారావు, జే రాజు, లక్ష్మీనారాయణ, శివనాగేశ్వరరావు, బాలకృష్ణ, బ్రహ్మయ్య, సూర్య తదితరులు ఉన్నారు.



సమావేశంలో పాల్గొన్న పాలకవర్గం,రైతులు

రైతులకు మెరుగైన సేవలు

పల్లామల్లి సొసైటీ చైర్‌పర్సన్ పారా చంద్రశేఖర్

చీమకుర్తి,సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): పల్లామల్లి సొసైటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలందిస్తామని చైర్‌పర్సన్ పారా చంద్రశేఖర్ తెలిపారు. సొసైటీ సభ్యుల మహాజనసభ బుధవారం సొసైటీ ప్రాంగణంలో నిర్వహించారు. చైర్మన్ చంద్రశేఖర్ మాట్లాడుతూ సొసైటీకి పునర్జీవం అందించే చర్యలకు శ్రీకారం చుట్టామన్నారు. తదుపరి సీఈవో గుంజి రమణయ్య ఆరు తీర్మానాలను ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా సభ ఆమోదించింది. గత పాలకవర్గం హయాంలో సొసైటీ పరిధిలో చోటుచేసుకున్న అక్రమాలు, బాధ్యులపై చర్యలు తీసుకోవటానికి అవసరమైన చర్యలు, కార్యాలయంలో మరమ్మతులు, కాంట్రాక్ట్ సిబ్బంది నియామకం తదితర తీర్మానాలు ఆమోదించారు. ఈ సమావేశంలో సభ్యులు పత్తి అంజయ్య, సారెకొక్కు, జాన్సన్, టీడీపీ నాయకులు కరిచేటి వెంకటేశ్వరరావు, అన్నంనేని రాఘవయ్య, రామయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిరోధానికి కృషి చేయాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం

ఒంగోలు కల్చరల్, సెప్టెంబర్ 17(ఆంధ్రజ్యోతి):బాల్య వివాహం చట్ట ప్రకారం నేరమే కాకుండా మానసిక శారీరక ఎదుగుదల కూడా ఆటంకమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయాధికారి షేక్ ఇబ్రహీం అన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సూచనలతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి ఆదేశాలతో బుధవారం ఆయన స్థానిక జిల్లా కోర్టులోని న్యాయసేవాధికార సంస్థలో నగరంలోని వివిధ మత పెద్దలతో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనలో పురోహితులు, క్రైస్తవ, ముస్లిం తదితర మత పెద్దలు సైతం సహకరించాలన్నారు. బాల్యవివాహం చేయటమే కాకుండా చేయించడం కూడా చట్ట ప్రకారం నేరమని, ఎవరైనా 18 సంవత్సరాల లోపు బాలికలు, 21 సంవత్సరాల లోపు బాలురకు వివాహం జరిపిస్తున్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇందుకోసం 1098 టోల్ ఫ్రీ నెంబరును సైతంఉపయోగించుకోవచ్చని అన్నారు. జువైనల్ బోర్డు లీగల్ ఆఫీసర్ రత్నప్రసాద్ మాట్లాడుతూ స్త్రీ శిశు సంక్షేమ శాఖ తరఫున ప్రతి అంగన్వాడీ కార్యకర్త క్షేత్రస్థాయిలో బాల్య వివాహాల గురించి వివరాలు సేకరించి సంబంధిత వర్గాలకు అందజేస్తున్నారని అన్నారు. బాల్య వివాహాల సంఖ్య ప్రకాశం జిల్లాలో అత్యధికంగా ఉందని దీనికి నిరక్షరాస్యత, ఆర్థిక వెనుకబాటుతనం కూడా కారణమని అన్నారు. కార్యక్రమంలో పలువురు పురోహితులు, వివిధ మత పెద్దలు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం

మొక్కలు పెంచే బాధ్యతను ప్రతి ఒక్కరు స్వీకరించాలి

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నగర సుందరీకరణ కోసం, నగరంలో పచ్చదనం పెంపు కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి స్వచ్ఛతా హీ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నగర కమిషనరు కే. వెంకటేశ్వరరావు కోరారు.. స్వచ్ఛతా హీ సేవా ప్రారంభోత్సవ ర్యాలీని బుధవారం ఒంగోలులో నిర్వహించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయం నుంచి నగర వీధుల్లో నిర్వహించిన ర్యాలీలో కార్పొరేషన్, మెప్మా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కమిషనరు మాట్లాడుతూ నగరంలో 5వేల మొక్కలు నాటడమే లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు తెలిపారు. అందుకోసం ఒకొక్కరికి ఒక్కో మొక్కను అందిస్తామని, ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి వాటి సంరక్షణ బాధ్యతలు స్వీకరించాలన్నారు. తద్వారా భవిష్యత్‌లో నగరం మరింత సుందరంగా మారుతుందని వివరించారు. అనంతరం మెప్మా ఆర్పీలు, సిబ్బంది, కార్పొరేషన్ సిబ్బందికి మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ పి. శ్రీహరి, మెప్మా సీఎంఎం బి.ఫణికుమారి, కార్పొరేషన్ శానిటరీ సూపర్ వైజర్లు షేక్ బాబ్జి, ఎస్.పిచ్చయ్యతోపాటు ఆర్పీలు, సచివాలయ సెక్రటరీలు, కార్పొరేషన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కార్పొరేషన్, మెప్మా అధికారులు, సిబ్బంది

కలెక్టర్‌ను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పీ రాజాబాబును ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలిసి కలెక్టర్ రాజాబాబును శాలువతో సత్కరించి బొకే ఇచ్చి అభినందించారు. అనంతరం వివిధ అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. ఈకార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత ఉన్నారు. అలాగే జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బొకేలు ఇచ్చి అభినందించారు కాగా వివిధ స్థాయిల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల నాయకులు కూడా కలెక్టర్‌ను కలిసి అభినందించారు.



కలెక్టర్ రాజాబాబును సత్కరిస్తున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల

కలెక్టర్‌కు అభినందనలు

కలెక్టర్ పీ రాజాబాబును ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు బొకే ఇచ్చి అభినందించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం మహిళా విభాగం ప్రతినిధులు కలెక్టర్‌కు బొకే ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో సుమతి, ప్రసన్న, గౌరి, శ్రీదేవి, సుజాత, ఎం. శ్రీనివాసులు, చెంచారావు, వంశీ, చంద్ర, సందీప్, రమణారావు, రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌ను అభినందించిన ఎన్‌జీవో సంఘం నాయకులు

నూతనంగా జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పీ రాజాబాబును ఏపీ ఎన్‌జీవో సంఘం నాయకులు కలిసి అభినందించారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం రాత్రి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనకు బొకే ఇచ్చారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కూచిపూడి శరత్ బాబు, ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి, శివకుమార్, ఏడుకొండలు, చిరంజీవి,రామాంజనేయులు, కొత్తపల్లి మంజేష్, సీహెచ్ శిరీషా, తులసీ,మల్లిక, సుజాత, కవిత, శైలజ, మగ్దుం షరీఫ్, హరిబాబు, అంజయ్య తదితరులు ఉన్నారు.

20న అక్కినేని జయంతి వేడుకలు

ఒంగోలు కల్చరల్, సెప్టెంబర్ 17(ఆంధ్రజ్యోతి):ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు జయంతి వేడుకలను ఈనెల 20వ తేదీ నిర్వహిస్తున్నట్లు అక్కినేని కళాపరిషత్ అధ్యక్షుడు కళ్లగుంట కృష్ణయ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వర రావు తెలుగు చిత్రసీమకు రెండు కళ్లు వంటి వారని, అక్కినేని నాగేశ్వర రావు, ఘంటసాల వెంకటేశ్వర రావు సారథ్యంలో వచ్చిన పాటలు ఆపాత మధురాలుగా నిలిచిపోతాయని అన్నారు. కళ్లగుంట కృష్ణయ్య మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి సీవీఎన్ రీడింగ్ రూము ఆవరణలో ప్రముఖ గాయనీగాయకులతో సంగీత విభావరి నిర్వహిస్తున్నామన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు సీహెచ్ లక్ష్మీనారాయణ, ప్రరసం అధ్యక్షుడు పొన్నూరి వెంకట శ్రీనివాసులు, సింగరాజు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులు ఇవ్వాలి

ఒంగోలు విద్య, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ పోస్టింగ్‌లుఇచ్చే ముందే హైస్కూలు ప్లస్‌లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను శాశ్వత ప్రాతిపదికన స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలని స్కూలు అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతల సుబ్బారావు, పి. నరోత్తమరెడ్డిలు ఒకసంయుక్త ప్రకటనలో కోరారు. ఇటీవల ఉద్యోగవిరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు, స్కూలు అసిస్టెంట్ల ఖాళీలను ఉద్యోగోన్నతి ద్వారా భర్తీ చేయాలన్నారు. అలాగే కరువు భత్యం వెంటనే విడుదల చేయాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఒంగోలు విద్య, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మంగమూరు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో బుధవారం సైమర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ వై.సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టి. హేమంత్, ఎస్కే రియాజ్‌లు పాల్గొని విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు టి. రాజేంద్రబాబు, పీ నీలిమ, రవితేజ, అధ్యాపకులు ఆర్ జోసఫ్, పూర్ణచంద్రరావు, కే చిరంజీవి, టి. రాజశేఖరరెడ్డి తదితరులు ఉన్నారు.

పోలేరమ్మ ఆలయ హుండీ కానుకల లెక్కింపు

జరుగుమల్లి (కొండపి), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కామేపల్లిలోని పోలేరమ్మ ఆలయ హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. ఈఏడాది జూన్1వ తేదీ నుంచి బుధవారం వరకు 109 రోజులకు రూ.22,14,935 నగదు వచ్చింది. దీంతోపాటు 100 యూఎస్ డాలర్లు, 19 గ్రాముల 800 మిల్లీ గ్రాముల బంగారం, 357 గ్రాముల వెండి కానుకగా లభించింది. కార్యక్రమాన్ని వల్లూరమ్మ దేవస్థానం కార్యనిర్వహణాధికారి బి.రమేష్ పర్యవేక్షించారు. పోలేరమ్మ ఆలయ ఈవో బైరాగి చౌదరి, కామేపల్లి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

స్వస్థ్ నారీ స్వశక్తి పథకం ప్రారంభం

కొండపి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ పథకాన్ని బుధవారం స్థానిక సీహెచ్‌సీ ఆవరణలో కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి ప్రారంభించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ ఇన్‌చార్జి అధికారి కె.నాగమణి, సర్పంచ్ కొమ్ము సుశీల, టీడీపీ మండల అధ్యక్షుడు కొర్రపాటి వసంతరాయుడు, డాక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు

- వికసిత భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు సాయం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను జిల్లా కేంద్ర మైన ఒంగోలులో బుధవారం ఘనంగా జరిగాయి. డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ్‌చక్రవర్తి వికసిత భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈకార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఉమా మనోవికాస కేంద్రంలో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు,అమరసింహం, రాయపాటి అజయ్, వంశీకృష్ణ, జే కొండల స్వామి, ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు, రమణమ్మ ఉన్నారు.



కొండపిలో మోదీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బ్రహ్మయ్య, బీజేపీ నాయకులు

అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

స్థానిక గానుగపాలెంలో బుధవారం జరిగిన కార్యక్రమానికి జిల్లాలోని అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. ముందుగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బచ్చల శివప్రసాద్, వెంకటేశ్వర్లు, చిట్టెంశెట్టి వెంకటకృష్ణారావు, శ్రీనివాసులు, రోషన్‌బాబు ఉన్నారు.

సమర్థనాయకుడు మోదీ

కొండపి : దేశాన్ని ప్రపంచంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలపగల సమర్థ నాయకుడు ప్రధాని మోదీ అని పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య అన్నారు. మోదీ జన్మదిన వేడుకలను స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. నాయకులు హరిబాబు, దొడ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

జయవరంలో..

జయ వరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బెల్లం కోటేశ్వరరావు, నాయకులు మల్లవరపు కృష్ణారెడ్డి, చిల్లర సురేష్‌బాబు, ముప్పల వెంకట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొండపి సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యుడిగా బ్రహ్మయ్య

కొండపి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కొండపి సహకార సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యుడిగా దాసరెడ్డిపాలెం గ్రామానికి చెందిన దేవరాల బ్రహ్మయ్య నియమితులయ్యారు. ఈమేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. కమిటీలో సభ్యుడిగా పెరిదేపి గ్రామానికి చెందిన మార్పూరి వెంకటేశ్వరరావును గతంలో నియమించారు. ఆయన ఇటీవల కొండపి ఏఎంసీ వైస్‌చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. దీంతోవెంకటేశ్వరరావును తొలగిస్తూ దేవరాల బ్రహ్మయ్యను టీడీపీ నాయకులు ప్రతిపాదించి పంపారు. ఆమేరకు తాజాగా ఉత్తర్వులు వచ్చాయి.

120 మందికి వైద్య పరీక్షలు

సంతనూతలపాడు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రవరం గ్రామంలో మాజీ ఎంపీపీ కూకట్లకోటయ్య ఫౌండేషన్ పర్యవేక్షణలో విజయవాడకు చెందిన హెల్ప్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచితమెగా వైద్యశిబిరం నిర్వహించారు. 120మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

డీపీవో వెంకటేశ్వరరావు

పొన్నలూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఇన్‌చార్జి డీపీవో వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం ఆయన మండల కేంద్రమైన పొన్నలూరులోని ఉప్పలదిన్నె రోడ్డులోని ఎస్సీ, బీసీ కాలనీలలో పర్యటించారు. అక్కడ చెత్తసేకరణను పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్, మెప్మా పీడీ, ఇతర అధికారులు

పేదల సొంతింటి కోసం 'అంగీకార్'

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0తో పేదల సొంతింటి కల నెరవేరుతుందని నగర కమిషనరు. కే. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో 'అంగీకార్' పథకంపై అవగాహన సదస్సు నిర్వహించి, బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా అర్హులైన పేదలకు సొంతింటి కల నిజం చేసుకునే అవకాశం ఇవ్వడమే లక్ష్యం అన్నారు. సొంత స్థలం ఉన్నవారు, రేషన్ కార్డు కలిగినవారికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్ష రూపాయాలు, కేంద్ర ప్రభుత్వం రూ. 1లక్ష 50వేలు విడతలవారీగా మంజూరు చేస్తుందని తెలిపారు. ఈకార్యక్రమాన్ని డిల్లీలో సెప్టెంబరు 4న కేంద్ర ప్రభుత్వం ప్రారంభించినట్లు ఆయన వివరించారు. మెప్మా పీడీ పి. శ్రీహరి మాట్లాడుతూ పీఎం సూర్యఘర్, పీఎం స్వానిధి, పీఎం ఆవాస్ యోజన, ఇతర కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించి ప్రతి ఒక్కరికీ సొంతింటి కలను నిజం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ వైష్ణవి, శానిటరీ సూపర్‌వైజర్ పిచ్చయ్య, సీఎల్‌టీసీలు ఆనంద్, శ్రీనివాస్, కిషోర్, మెప్మా ఆర్పీలు, సీవోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కూనంనేనివారిపాలెంలో చెక్కులు అందజేస్తున్న విజయ్‌కుమార్

చీమకుర్తిలో ఎమ్మెల్యే బీఎన్ సుడిగాలి పర్యటన

- బాధితుల ఇంటికి వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చీమకుర్తి,సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని 25 గ్రామాలు.. 67మంది లబ్ధిదారులకు రూ.42.90 లక్షలు విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం ఒక్కరోజులోనే అదీ లబ్ధిదారుని ఇంటికి వెళ్లి స్వయానా ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ అందజేయటంతో లబ్ధిదారుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. తాము అభిమానించే నాయకుడు తమ ఇంటికే రావటంతో ఆనందంతో అఖండ స్వాగతం పలికారు.ఉదయం మండలంలోని ఈశాన్య దిక్కు మొదలుకొని విజయ్‌కుమార్ సాగించిన పర్యటన సుడిగాలిని తలపించింది.కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పూర్తిస్థాయిలో భరోసాని కల్పిస్తుందని విజయ్‌కుమార్ ఈ సందర్భంగా తెలిపారు. ఆయా కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, ఎన్ఆర్ఐ తక్కెళ్లపాటి రమేష్, గొట్టిపాటి రాఘవరావు, కూనంనేని లోకేష్, ఇన్నర్ల ఏడుకొండలు, గొల్లపూడి సుబ్బారావు, రావిపాటి రాంబాబు, మన్నం శేషయ్య, దొడ్డా వెంకట్రావు, పుట్టా బ్రహ్మయ్య, అన్నంనేని రాఘవయ్య, పారా చంద్రశేఖర్, కరిచేటి వెంకటేశ్వర్లు, వేల్పుల శ్రీనివాసరావు, గమిని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పుగుండూరులో విశ్వకర్మ జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

ఘనంగా విశ్వకర్మ జయంతి

ఒంగోలు కల్చరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):విశ్వకర్మ జయంతి వేడుకలు బుధవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా జరిగాయి. గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జ్ డిప్యూటీ లైబ్రేరియన్ సంపూర్ణ కాళహస్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి సిబ్బంది, పాఠకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశ్వకర్మ రాష్ట్ర కార్యదర్శి కొత్తపల్లి సోని, సంపూర్ణ కాళహస్తి మాట్లాడారు. అనంతరం ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కూడా పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాటల రచయిత డాక్టర్ మధురశ్రీ, జి.శాంసన్, సిబ్బంది కృష్ణవేణి, మృదుల కుమార్, టి.గోవిందమ్మ, ఎస్.అనిల్ బాబు, ఎం.శివకుమారి, పాఠకులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు :ఉప్పుగుండూరు గ్రామంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయం వద్ద విశ్వకర్మ 31 వార్షిక జయంతి వేడుకలను విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో విశ్వకర్మ జెండాను గొర్రెపాటి బ్రహ్మానందం, పంచాక్షరి దుర్గాప్రసాద్ దంపతులు ఆవిష్కరించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

చీమకుర్తిలో ..

చీమకుర్తి : చీమకుర్తి పట్టణంలో ఇసుకవాగు సెంటర్ వద్ద ఉన్న కామక్షమ్మ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం ప్రాంగణంలో విశ్వకర్మ జయంతి వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సానల మల్లికార్జునరావు, వీరబ్రహ్మం, పోతకమూరి మల్లిఖార్జున, నాగబ్రహ్మం,దుర్గా ప్రసాద్, తదితరులు పాలొన్నారు.

మర్రిపూడిలో..

మర్రిపూడి : మండలంలోని సన్నమూరులో విశ్వకర్మ పతాకాన్ని మేళతాళాలతో గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. విశ్వకర్మ మహాయజ్ఞంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

కొండపి : విశ్వకర్మ జయంతిని విశ్వబ్రాహ్మణులు బుధవారం కొండపిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జీజేసీ, జీహెచ్ఎస్‌లో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

ఎస్ఎస్ఎన్‌లో రక్తదాన శిబిరం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానికమంగమూరు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో బుధవారం రక్తదాన్ అమృత మహోత్సవం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. నవ్యబ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ వై. సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈకార్యక్రమాన్ని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ డీవీఆర్ మూర్తి ప్రారంభించారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

ఒంగోలు(రూరల్),సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి) :రైతులు తప్పక పశువులకు గాలికుంటువ్యాధి నివారణా టీకాలు వేయించాలని పశుసంవర్థక శాఖ జిల్లా అధికారి బి.రవి అన్నారు. ఒంగోలు మం డలం యరజర్ల గ్రామంలో బుధవారం పశువులకు గాలికుంటువ్యాధి నివారణా టీకాల కార్య క్రమం నిర్వహించారు. నల్ల పశువులకు 155,తెల్లపశువులు 25కి గాలికుంటు నివారణా టీకాలు వేశారు.

నేటి నుంచి వైద్య శిబిరాలు

రాచర్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో నేటి నుంచి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అనుములవీడు ప్రాథమిక వైద్యశాల డాక్టర్ కే రమేష్ తెలిపారు. స్థానిక వైద్యశాలలో బుధవారం ఆయన వైద్య శిబిరాల ఏర్పాటుపై సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు ఈ శిబిరాలు నిర్వహిస్తామని అన్నారు. 18వ తేదీ అనుములవీడు పీహెచ్‌సీలో ప్రత్యేక వైద్య సేవలు ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌వో, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

త్రిపురాంతకం : త్రిపురాంతకంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి విజయభాస్కరరెడ్డి తెలిపారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్రిపురాంతకం, దూపాడు, అన్నసముద్రం అన్ని పీహెచ్‌సీల్లో ప్రత్యేక శిబిరాలు జరుగుతాయని మహిళలు వినియోగించుకోవాలని కోరారు.

విద్యార్థులు క్రీడల్లో ప్రతిభను కనబర్చాలి

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రీడల్లో ప్రతిభను కనబర్చాలని ఎంఈవో మస్తాన్ నాయక్ అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా పోటీలను బుధవారం ఎంఈవో మస్తాన్ నాయక్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా భాగం కావాలన్నారు. అన్ని పాఠశాలల నుంచి 450 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్యామ్ ప్రసన్నతాంజలి, బట్టు విద్యా సంస్థల ఛైర్మన్ బట్టు రమణా రెడ్డి,పీడీలు రామానాయక్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రాచర్ల : విద్యార్థుల ఆటల పోటీలు ఆహ్లాదకరంగా ఉండాలని విద్యాశాఖ అధికారి గిరిధర్ శర్మ అన్నారు. రాచర్ల జడ్‌పిహెచ్ పాఠశాలలో బుధవారం ఆయన మడల స్థాయి పాఠశాల పోటీలను అట్టహాసంగా ప్రారంభించారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు కూడా స్నేహపూర్వకంగా పోటీపడాలన్నారు. ప్రారంభం రోజు లాంగ్ జంప్, హై జంప్, చెస్, యోగాసనాలు, కబడ్డీ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో రాచర్ల హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బీఎల్ రామానాయక్, స్కూల్ గేమ్స్ కోఆర్డినేటర్ కె రాము పాల్గొన్నారు.

36 మంది రక్తదానం

గిద్దలూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జీవన జ్యోతి డిగ్రీ కళాశాల ఆవరణలో కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 36 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ మమత, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి హబీబ్‌ఖాన్, జీవనజ్యోతి కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.జీవనజ్యోతిరెడ్డి, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి నిరంజన్‌బాబు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : ఎర్రగొండపాలెం డిగ్రీ కాలేజీలో ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ సంయుక్తంగా మార్కాపురం వైద్యుల పర్యవేక్షణ బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ శిబరంలో 13 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ జి శ్రీధరనాయుడు, ఉప ప్రిన్సిపాల్ ప్రదీఫ్, ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్టినేటర్లు రామకోటయ్య, పుష్పరాజు అభినందించారు.

పశువుల రోగాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎర్రగొండపాలెం రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో వచ్చిన మార్పులతో మూగ జీవాలు రోగాలబారిన పడకుండా టీకాలు వేయించాలని ఎర్రగొండపాలెం అసిస్టెంట్ డైరక్టర్ పశు సంరక్షణ శాఖ అధికారి చిన్నబాలు నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని అమానిగుడిపాడు గ్రామంలో ఆయన పర్యటించారు. పశువులను పరీక్షించి వాటికి అవసరమైన టీకాలు (గాలికుంటు) వేశారు. కార్యక్రమంలో వైద్యులు మంత్రునాయక్, సిబ్బంది రవి, బాజీ షరీఫ్, మజీద్, షబ్బీర్, ఖాసీం వలి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

ఎమ్మెల్యే కందుల

మార్కాపురం రూరల్, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. సర్వజన వైద్యశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులలో తిరిగి రోగులతో మాట్లాడి అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ప్రస్తుతం పెరిగిన ఓపీల సంఖ్యకు తగినట్లుగా సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలన్నారు. అంబులెన్స్‌కు మరమ్మతులు చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. ఆసుపత్రిలో అల్ట్రా సౌండ్ మిషన్, సిటీ స్కాన్, ఎంఆర్‌ఐని త్వరలో ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. ఆర్వో ప్లాంట్ ద్వారా తాగు నీటిని అందిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రామచంద్రారావు, సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


శిశువులకు అందుతున్న వైద్య సేవలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కందుల

కలుజువ్వలపాడులో భర్త హింసించిన బాధితురాలిని ఎమ్మెల్యే కందుల పరామర్శించారు. కలుజువ్వలపాడులో భర్త కట్టేసి కొట్టి హింసించిన ఆమె సర్వజన ఆసుపత్రిలో చేరింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆమెను పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కార్యక్రమంలో పాల్గొని బీజేపీ శ్రేణులు ఏర్పాటు చేసిన కేక్‌ను ఆయన కట్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ రాజకీయాలపైనే కాకుండా ప్రజల మనోభావాలపై కూడా ముద్ర వేసిన మోదీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మోర్చా కార్యవర్గ సభ్యుడు పిడతల రమేషరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బాదుల్లా, నాయకులు నరసింహులు, ఆంజనేయులు పాల్గొన్నారు.


మోదీ ఫొటోను ఎమ్మెల్యేకు అందజేస్తున్న నేతలు

గిద్దలూరు : ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పట్టణంలోని పీఆర్ కాలనీలోని సంజీవని అనాథ ఆశ్రమంలో బీజేపీ నాయకులు నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. వృద్ధులు, విద్యార్థులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జేవీ నారాయణ, నాయకులు బీవీ రామాంజనేయులు, గుమ్మా రాముడు, కె.వి.చంద్రమోహన్, మట్టిమల్లె పుల్లయ్య, కాసులు, రామక్రిష్ణ పాల్గొన్నారు. అనంతరం జీఎస్టీని సవరించిన ప్రధాని చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం చేశారు.

కంభం : మోదీ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. మెయిన్ బజార్‌లో కేక్ కటింగ్ అనంతరం కంభం, కందులాపురం పంచాయతీ కార్మికులకు దుప్పట్లు, స్వీట్లు, భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీ నారాయణ, జిల్లా మాజీ ఇన్‌చార్జి పళ్లెం శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు బాదం కిషోర్ కుమార్, జిల్లా కోశాధికారి బాదం మనోహర్, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : అభివృద్ధిలో భారత్‌ను అగ్రభాగాన నిలబెట్టిన మార్గదర్శకులు ప్రధాని మోదీ అని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. పార్టీ కార్యాలయంలో బుధవారం మోదీ పుట్టిన రోజు సందర్భంగా ఆయన కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మ న్ చేకూరి సుబ్బారావు, సాగునీటి సం ఘం అధ్యక్షుడు దేవినేని చలమయ్య, వేగినాటి శ్రీను, ఆళ్ల నాసరరెడ్డి, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : శివ సదనులో పీఎం మోదీ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు సురవరం గండి వీరారెడ్డి అధ్యక్షతన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బట్టు సుధాకర్ రెడ్డి, టీడీపీ నాయకులు షేక్ మాబు, ఈదర మల్లయ్య, సుబ్బారెడ్డి, షేక్ మౌలాలి, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కేతి మురళి పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : భారత ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు వేడుకలు బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో పాతబస్టాండ్‌లోని గడియార స్తంభం వద్ద బీజేపీ నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధులకు, దివ్యాంగులకు భోజనం ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎస్.శ్రీనివాసులు, ఎస్.సరోజిని, పీవీ కృష్ణారావు, ఆంజనేయులు, సతీష్ కుమార్, డా. కిరణ్, షబానా పాల్గొన్నారు.


మోదీ పుట్టినరోజు వేడుకలో పాల్గొన్న ఎరిక్షన్‌బాబు

నరసింహ స్వామి ఆలయ ఈవోగా శ్రీనివాసరెడ్డి


ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ నదీతీరానా వెలసిన కపిలకగిరి యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ నూతన ఈవోగా గొలమారి శ్రీనివాసరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన చెన్నకేశవస్వామి ఆలయ ఈవోగా కూడా పనిచేస్తున్నారు. దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బాధ్యతలు చేపట్టారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

ఎర్రగొండపాలెం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విశ్వకర్మ భగవాన్ సేవలు గొప్పవని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. టీడీపీ కార్యాలయంలో శ్రీ విరాట్ విశ్వకర్త భగవాన్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.మల్లికార్జునాచారి, టీడీపీ నాయకులు వేగినాటి శ్రీను, మంత్రునాయక్, పోట్ల గోవింద్, మండల విశ్వబ్రాహ్మణ అధ్యక్షుడు వెంకటేశ్వరచారి పాల్గొన్నారు.

గిద్దలూరు : పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం ఆవరణలో విరాట్ విశ్వకర్మ భగవానుని జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా పూజలు చేశారు. కోలాట ప్రదర్శన అందరినీ అలరించింది. కార్యక్రమంలో విరాట్ విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు దత్తాచారి, రంగాచారి, వీరబ్రహ్మం, చంద్రశేఖర ఆచారి, పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

ఎర్రగొండపాలెం రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అవసరమైన యూరియా రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉందని ఏవో కే నీరజ అన్నారు. బుధవారం మండలంలోని వెంకటాద్రిపాలెం, గంజివారిపల్లి ఆర్‌సీకేలలో రైతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పొగాకు, మిరప, పత్తి తదితర పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌సీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సైనిక కాలనీకి సహకరించాలి


ఎంపీ మాగుంటకు వినతిపత్రం ఇస్తున్న మాజీ సైనికులు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలో మాజీ సైనికుల కోసం సైనిక కాలనీ ఏర్పాటు చేసేందుకు సహకరించాలని ఎంపీ మాగుంట్ల శ్రీనివాసరెడ్డికి మాజీ సైనికులు కలిసి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ సైనికుల హౌసింగ్ బోర్డు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చిన్నయ్య, జై జవాన్ యూనియన్ నాయకులు హరినారాయణరెడ్డి, శేషసాయి, నారాయణరెడ్డి, తిరుమలయ్య, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు చెల్లించాలి

బేస్తవారపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేట గ్రామ పంచాయతీ పరిధిలోని ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలని పంచాయతీ కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి కోరారు. పాత పద్ధతిలో కాకుండా స్వర్ణ గ్రామ పంచాయతీ డిజిటల్ పేమెంట్‌లో ఇంటి పన్నులు చెల్లించాలని, యజమానులు గ్రామ పంచాయతీలో మీ డిమాండ్ నోటీస్ తీసుకుని వస్తే సెల్ ద్వారా నగదు చెల్లింపులు చేస్తారని తెలిపారు. ఈనెల 30వ తేదీ లోగా పన్నులు చెల్లించాలని గ్రామస్థులకు సూచించారు.

ర్యాగింగ్‌తో జీవితాలను పాడు చేసుకోవద్దు

డీఎస్పీ డాక్టర్ నాగరాజు


మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

మార్కాపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ర్యాగింగ్‌తో జీవితాలను పాడు చేసుకోవద్దని డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు సూచించారు. తర్లుపాడు రోడ్డులోని జార్జి ఫార్మసీ కాలేజీలో బుధవారం విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. డీఎస్పీ నాగరాజు మాట్లాడుతూ ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. చట్టాలపై డీఎస్పీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ పి.సుబ్బారావు, టౌన్ ఎస్సై డాక్టర్ ఎమ్. రాజమోహన్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలికలు చదువుతో పాటు ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీదేవి అన్నారు. పాఠశాలకు చెందిన కౌశల్య కర్నూల్‌లో నిర్వహించిన 12వ జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో కటా విభాగంలో ప్రథమ, కుమితే విభాగంలో ద్వితీయ స్థానం పొందిన సందర్భంగా బుధవారం బాలికను అభినందించారు. ఒంగోలులో జరిగిన కరాటే పోటీల్లో సౌజన్య, కౌశల్య పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, 8వ తరగతి విద్యార్థిని కల్యాణి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

కాటాల్లో తేడాలొస్తే కఠిన చర్యలు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వివిధ వ్యాపారాల్లో వినియోగదారులకు అందించే కాటాల్లో తేడాలు వస్తే చర్యలు తప్పవని తూనికల, కొలతల ఇన్‌స్పెక్టర్ షేక్ మెహిసిన్ అన్నారు. స్థానిక పంచాయతీ రాజ్ అతిథి గృహంలో బుధవారం పట్టణంలోని చికెన్ వ్యాపారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెహిసిన్ మాట్లాడుతూ.. ప్రతి ఏడాది ఎలక్ట్రానిక్ కాటాలను తూనికల, కొలతల కార్యాలయంలో తీసుకొచ్చి తనిఖీలు చేయించి ముద్రలు వేయించాలన్నారు. కాటాలు సరిగ్గా లేకపోతే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. టెక్నికల్ అసిస్టెంట్ కోటిరెడ్డి, నారాయణ, రమేష్, చికెన్ వ్యాపారులు షేక్ షామహమ్మద్, జైనులాబద్దీన్, నాసర్, సుబ్బారావు, షరీఫ్, పఠాన్ హమిద్ ఖాన్, హఫీస్ ఖాన్ పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు పొందవచ్చని ఎర్రగొండపాలెం సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటరమణ అన్నారు. మండలంలోని నల్లగుంట్ల, కొర్రప్రోలు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని ఏవో జవహర్ లాల్ నాయక్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. మొక్క జొన్న, కంది పంటలను పరిశీలించారు. వీఏఏ మాధురి, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

పొదిలి, సెప్టంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాల్లో రైతులు పాల్గొనాలని పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్ అన్నారు. బోర్డులో బుధవారం అధికారులు, సిబ్బంది, రైతులతో కలిసి స్వచ్ఛతాహీ సేవా ప్రతిజ్ఞ చేశారు. ప్రతి సోమవారం స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

సమావేశానికి సరదాగా వస్తారా..!

అధికారుల తీరుపై ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అసహనం

కనిగిరి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశానికి సరదాగా వస్తారా అంటూ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ దంతులూరి ప్రకాశం అధ్యక్షతన జరిగిన మండల సర్వ సభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తమ తమ శాఖల పూర్తి నివేదికలు, ప్రణాళికలు, చేపట్టిన పనుల వివరాలు, అవసరమైన సదుపాయాలు వంటి వాటిపై సమగ్ర నివేదిక లేకుండా సమావేశానికి హాజరైన అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ ఏఈ తిరుపాలయ్య మాట్లాడుతూ పాతపాడు గ్రామంలోని హైస్కూల్‌లో చేపట్టిన అదనపు గదుల నిర్మాణం ఏజెన్సీ పూర్తి చేయకుండా కాలయాపన చేస్తున్నట్లు చెప్పగా, సంబంధిత ఏజెన్సీ కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో శ్మశాన వాటికలకు స్థలాలు అవసరంగా గ్రామస్థులు కోరినట్లు డాక్టర్ ఉగ్ర తెలిపారు. వారికి ఆయా గ్రామాల్లో ప్రభుత్వ, పోరంబోకు భూముల్లో ఇప్పించాలని తహసీల్దార్ రవిశంకర్‌కు సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో హాజరు కాకపోవటంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో ఏడీపీ జైనులాబ్దీన్, ఎంఈవో సుబ్బారావు డీఎల్‌డీవో శ్రీనివాసరావు, ఎంపీడీవో ప్రభాకరశర్మ, జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, వివిధశాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


కనిగిరి: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం


తాళ్లూరు: మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు

తాళ్లూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రజాప్రతినిదులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగితేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్‌ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో రోజులతరబడి తాగునీటి సరఫరా జరగడంలేదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై మండిపడ్డారు. మండలంలో సాగర్ మంచినీటి సరఫరా సక్రమంగా లేదన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నందున తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

గత వైసీపీ ప్రభుత్వంలో తురకపాలెం గ్రామ ప్రధాన వీధిలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి 1100 సిమెంట్ బస్తాలను అందజేశారని రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ బి.ఓబుల్‌రెడ్డి అన్నారు. గ్రామ వైసీపీ నేత వాటిని స్వాహా చేసినా రికవరీ చేయటంలో పంచాయతీరాజ్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ భవననిర్మాణ నిధులు చెల్లించలేదని సచివాలయానికి తాళం వేసిన ఆవైసీపీ నేత ప్రభుత్వానికి చెందిన 1100 సిమెంట్ బస్తాలను స్వాహా చేసినా ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని పంచాయతీరాజ్ ఏఈని నిలదీశారు. 15 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

సమావేశంలో తహసీల్దార్ బచ్చల వెంకటరమణారావు, ఎంపీడీవో సానికొమ్ము సత్యం, నాగంబొట్లపాలెం, మన్నేపల్లి సొసైటీ అధ్యక్షులు సుబ్బయ్య, రమణారెడ్డి, వైద్యాధికారులు ప్రవీణ్, మౌనిక, పశువైద్యులు ప్రతాప్‌రెడ్డి, వంశి, వివిధశాఖల అధికారులు వలి, హనుమంతరావు, వెంకటేశ్వర్లు, రామకృష్ణారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో నాగమల్లేశ్వరి, వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ప్రసంగాలకే పరిమితమైన మండల సమావేశం

దొనకొండ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం అధికారుల ప్రసంగాలకే పరిమితమైంది. ఎంపీపీ ఉషామురళి అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో తమ శాఖలకు సంబందించిన సమాచారాన్ని అధికారులు వివరించారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఆయా శాఖల పరిధిలో గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఒక్కరూ చర్చించలేదు. వైస్‌ఎంపీపీ మిట్టా కోటిరెడ్డి మాట్లాడుతూ చందవరం నుంచి కొచ్చెర్లకోట మీదుగా బస్ సౌకర్యం కల్పించాలని పోదిలి ఆర్టీసీ అధికారికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో దావూద్, జడ్పీటీసీ సుధాకర్, కోఆప్షన్ సభ్యుడు గఫార్ తదితరులు పాల్గొన్నారు.

మోదేపల్లి మేజరుకు పెరిగిన సాగర్ జలాలు


మోదేపల్లి మేజరులో ప్రవహిస్తున్న సాగర్ జలాలు

ముండ్లమూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదేపల్లి మేజరుకు మంగళవారం రాత్రి నుంచి సాగర్ జలాలు పెరిగాయి. దీంతో ఆయకట్టు పరిధిలోని చివరి భూముల వరకు నీరు చేరుతున్నాయి. ప్రస్తుతం 238 క్యూసెక్కుల మేర నీరు సరఫరా అవుతుంది. గతంలో మేజరు పరిధిలో సరిపడినంత నీరురాక రైతులు ఇబ్బందులు పడ్డారు. మోదేపల్లి మేజరుకు రావాల్సిన పూర్తి స్థాయి నీటి మట్టం 398 క్యూసెక్కుల నీరు రావాల్సి ఉంది. వంద క్యూసెక్కులు కూడా రాక పోవటంతో రైతులు ఆందోళన చెందారు. డీసీ ఛైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావుతో పాటు పలుగ్రామాల రైతులు తాము పడుతున్న ఇబ్బందులను ఇటీవల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని కలిసి వివరించారు. ఆమె వెంటనే ఎస్ఈ వరలక్ష్మితో మాట్లాడి మోదేపల్లి మేజరుకు నీటి సామర్థ్యం పెంచి పంటలు ఎండిపోకుండా చూడాలని కోరారు. దీంతో మంగళవారం రాత్రి నుంచి 238 క్యూసెక్కులు నీటిని సరఫరా చేస్తున్నారు. ఈనీరు ఉమా మహేశ్వర అగ్రహారం వరకు చేరటంతో పంటలు సాగు చేసిన రైతులు తమ పొలాలకు నీరు పెట్టుకుంటున్నారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఓటర్ల రివిజన్‌ను పారదర్శకంగా నిర్వహించాలి

దర్శి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఓటర్ల రివిజన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని దర్శి నియోజకవర్గ ఎలక్ట్రోరల్ అధికారి ఎస్.జాన్సన్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని రెవెన్యూ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపులకు సంబంధించి బూత్‌లెవల్ అధికారులకు స్పష్టమైన సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో దర్శి తహసీల్దార్ ఎం. శ్రావణ్‌కుమార్, రెవెన్యూ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంపీ మాగుంటను సత్కరించిన టీడీపీ నాయకులు


మాగుంటను సత్కరిస్తున్న ఆంజనేయులు, నాగసుబ్బారెడ్డి

దొనకొండ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): దొనకొండ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ సౌకర్యం కల్పనకు కృషిచేసిన ఎంపీ శ్రీనివాసులురెడ్డిని టీడీపీ నాయకులు బుధవారం సత్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు మోడి అంజనేయులు, ఏఎంసీ డైరెక్టర్ శృంగారపు నాగసుబ్బారెడ్డి, తదితరులు ఒంగోలులో మాగుంటకు శాలువా కప్పి సన్మానించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ముండ్లమూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఏ.తిరుమలరావు అన్నారు. బుధవారం మండలంలోని పులిపాడు పంచాయతీ పరిధిలోని బృందావనం తండాలో ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వీపీ శేషమ్మ తదితరులు మాట్లాడారు.

ఎంఈవో కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు

దర్శి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): దర్శి ఎంఈవో కార్యాలయ భవన నిర్మాణానికి రూ.53 లక్షలు విడుదలయ్యాయి. ఈనేపథ్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నూతన భవనం నిర్మాణం కోసం స్థలాన్ని సర్వశిక్షా అభియాన్ ఈఈ వెంకటరత్నంరావు, డీఈ రమణయ్య పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవోలు కె.రఘురామయ్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

దర్శి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో విశ్వకర్మ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక బ్రహ్మంగారి ఆలయం వద్ద విశ్వశాంతి హోమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను నిర్వహించారు కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాడపాకుల శ్రీనివాసులు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కంచెర్ల శ్రీనుబాబు, జి.శ్రీనివాసాచారి, అరికట్ల కనకరత్నాచారి, ఎస్.చంద్రశేఖరాచారి తదితరులు పాల్గొన్నారు.

పామూరు: స్థానిక విరాట్ నగర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో గాయత్రి సమేత విశ్వకర్మ మహాయజ్ఞ వేడుకలు బుధవారం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, బొల్లా నరసింహారావు, సయ్యద్ అమీర్‌బాబు, డి.కొండబాబు, పందిటి హరీష్, ఉడుముల ప్రభాకర్‌రెడ్డి, ఎస్.నాగేంద్రచారి, ఎం.దొరసానయ్యాచారి, డైండే శివశంకర్, జి. వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లిలో భారీ వర్షం

పీసీపల్లి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పీసీపల్లిలో బుధవారం భారీ వర్షం కురిసింది. తెల్లవారు జామున 5గంటల నుంచి ఉరుములు మెరుపులతో మొదలైన వర్షం 8గంటల వరకు ఎడతెరపి లేకుండా కురిసింది. మండలంలో 118.4 మి.మీ వర్షపాతం నమోదైంది. కొండవాగు ఉధృతంగా ప్రవహించింది. కమ్మవారిపల్లి - చౌటుపల్లి గ్రామాల మధ్య ఉన్న నేల చప్టాపై నీరు ప్రవహించింది. దీంతో ఆమార్గం గుండా పీసీపల్లికి వెళ్లే ప్రజలకు అరగంట పాటు రాకపోకలు నిలిచిపోయాయి. కమ్మవారిపల్లిలోకి వర్షపునీరు రావడంతో వాగును తలపించింది.


పీసీపల్లి: పడమటిపల్లి పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపునీరు


పామూరులోని పాత ఎస్‌బీఐ మార్గంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

పడమటిపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మోకాలు లోతు నీరు నిలిచింది. కమ్మవారిపల్లి, మలినేనివారిపల్లి, పీసీపల్లి ప్రాంతాల్లోని చెక్‌డ్యాంలు వర్షపు నీటితో నిండాయి. ఈ వర్షం తాకిడికి కనిగిరి నుంచి పీసీపల్లికి సరఫరా అయ్యే 33/11కేవి లైన్ బ్రేక్‌డౌన్ అయింది .దీంతో 5గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

కొద్దిరోజులుగా వర్షాభావంతో బెట్టకు వచ్చిన కంది, దోస వంటి మెట్ట పైర్లు ఈవర్షంతో జీవం పోసుకుంటాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పామూరులో..

పామూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పామూరు, సీఎస్‌పురం మండలాల్లో బుధవారం వేకువజామున భారీ వర్షం కురిసింది. రెండు గంటలపాటు కురిసిన వర్షానికి పామూరులోని లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. పాత ఎస్‌బీఐ మార్గంలో మురుగునీరు రోడ్డుపై ప్రవహించింది. కరెంటు ఆఫీసు కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఇళ్లలోకి నీరు చేరింది. ఈవర్షం సాగులోఉన్న పంటలకు మేలు చేసిందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

భైరవకోన హుండీ ఆదాయం రూ.5 లక్షలు

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం భైరవకోనలోని శ్రీ భైరవేశ్వర దేవస్థానం ఆవరణలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ సమక్షంలో ఈవో డి.వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం హుండీని లెక్కించారు. ఆరు నెలల పది రోజులకు గాను రూ.5,39,521 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు.

మోదీ పాలనలో దేశం సుభిక్షం

కనిగిరి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో దేశం సుభిక్షంగా ఉందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మోదీ 75వ పుట్టినరోజు సందర్భంగా బుధవారం కనిగిరిలో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం పామూరు బస్టాండు సెంటరులో బీజేపీ శ్రేణులు కేకు కట్ చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ దేశాభివృద్ధి, భద్రతే లక్ష్యంగా మోదీ పాలన సాగిస్తున్నారన్నారు. అన్నివర్గాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎన్నో పథకాలను అమలుచేస్తూ రాష్ట్రాలకు మేలు చేకూరుస్తున్నారన్నారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరాల శ్రీనివాసులురెడ్డి, వెంకట్, కొండిశెట్టి రమణయ్య, తిప్పలూరి శ్రీనివాసులు, సోమిశెట్టి శ్రీనివాసులు, నారాయణరెడ్డి, మునగా మాలకొండయ్య, మస్తానయ్య, సుబ్బారాయుడు, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీచేయాలి

వెలిగండ్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ కార్డుల్లో క్యూఆర్ కోడ్ ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని విజిలెన్స్ కమిటీ ఛైర్మన్, తహసీల్దార్ ఎస్.వాసు డీలర్లకు సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో సివిల్ సప్లయిస్ విజిలెన్స్ కమిటీ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో డీటీ భూపతి, సీడీపీవో ఆశాబేగం, తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాను వినియోగించాలి

పామూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు నానో యూరియాను వినియోగించాలని ఏవో టి.అబ్రహాంలింకన్ అన్నారు. బుధవారం మండలంలోని నుచ్చుపొద, దూబగుంట గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

పిల్లల్లో స్థూలకాయంతో ఇబ్బందులు

పామూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జంక్ ఫుడ్‌తో పిల్లల్లో స్థూలకాయం పెరుగుతుందని సీడీపీవో పి.లావణ్య అన్నారు. 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాన్ని బుధవారం గోపాలపురం ఎస్సీ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, హెచ్‌ఎం నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

పామూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్ డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం సీఎం, ముఖ్యకార్యదర్శికి ఈ మెయిల్ సందేశాలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో టి.శ్రీనివాసులు, జేఎస్ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి పనులు చేపట్టాలి

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అములులో అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రగతి సాధించాలని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య అన్నారు. సీఎస్‌పురం మండల పరిషత్ కార్యాయలయంలో మండల స్థాయి అధికారులతో బుధవారం కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వెలిగండ్ల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కనిగిరిలోని అమరావతి గ్రౌండ్స్‌లో శనివారం జరిగే కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి అన్నారు. బుధవారం వెలిగండ్లలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

నేడు తాళ్లూరులో వైద్యశిబిరం

తాళ్లూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్వస్తినారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా గురువారం తాళ్లూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి ప్రవీణ్ తెలిపారు. మహిళలకు స్కానింగ్, రక్తపోటు, మధుమేహం, కాన్సర్ వ్యాధులను గుర్తించటంతో పాటు 9రకాల పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈఅవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



అమ్మో.. బార్లా..

- రీ నోటిఫికేషన్‌కూ స్పందన అరకొరే
- గుంటూరులో 26, పల్నాడులో 8, బాపట్లలో 6 బార్లకు నేడు లాటరీ
- మిగిలిన బార్ల విషయంలో ప్రభుత్వ నిర్ణయంపై ఉత్కంఠ

112 బార్లలో 72 బార్లకు దరఖాస్తులు నిల్

ఒకప్పుడు మద్యం బార్ల లైసెన్సుల కోసం వ్యాపారులు పోటీపడేవారు. ఎంత మొత్తం అయినా చెల్లించేందుకు కూడా సిద్ధమయ్యేవారు. అయితే నూతన మద్యం పాలసీ ప్రకారం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో బార్ల లైసెన్సుల కోసం వ్యాపారులు ముందుకు రావడంలేదు. ఇప్పటికి రెండు సార్లు నోటిఫికేషన్ ఇవ్వగా వ్యాపారుల నుంచి స్పందన రాలేదు. దీంతో ఎలాగైనా బార్లకు వ్యాపారుల నుంచి దరఖాస్తులు చేయించాలని ఎక్సైజ్ విభాగం రెండు సార్లు గడువు కూడా పెంచింది. అయినా బార్లు తీసుకునేందుకు వ్యాపారులు వెనుకంజ వేస్తున్నారు. తొలి విడత నోటిఫికేషన్ లాటరీ ప్రక్రియ అనంతరం మిగిలిన(గుంటూరు జిల్లాలో 67, పల్నాడు జిల్లాలో 30, బాపట్ల జిల్లాలో 15) బార్లకు ఈ నెల 3న ఎక్సైజ్ శాఖ రీ నోటిఫికేషన్ ఇచ్చింది. మూడు జిల్లాల పరిధిలో 112 బార్లకు రీ నోటిఫికేషన్ జారీ చేసి ఒకసారి గడువు పెంచినా కేవలం 72 బార్లకు నిబంధనల ప్రకారం దరఖాస్తులు వచ్చాయి. అంటే మూడు జిల్లాల పరిధిలో 40 బార్లకు ఎవరూ ముందుకు రాలేదు.

(బాపట్ల , ఆంధ్రజ్యోతి)

ఏం చేస్తారో తెలియదు.. ఎట్టి పరిస్థితుల్లోనూ జిల్లా పరి ధిలోని అన్ని బార్ల ఏర్పాటుకు సంబంధించి దరఖాస్తులు రావాల్సిందేనని ఈ నెల 3న బార్ల రీ నోటిఫికేషన్ జారీ సమయంలో ఎక్సైజ్ యంత్రాంగానికి ఉన్నతాధికారుల నుంచి అందిన అనధికారిక ఆదేశాలు. తొలివిడత నోటిఫికేషన్‌లో ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో ఉన్నతాధికారులు బాపట్ల జిల్లా యంత్రాంగంపై కన్నెర్ర చేసిన సంగతి తెలిసిందే. మొత్తం బార్లకు దరఖాస్తులు రావాల్సిందేనని లేకపోతే సిబ్బంది వైఫల్యంగా పరిగణించి చర్యలకు సైతం వెనకాడబోమనే అనధికారిక ఆదేశాలను ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు రీ నోటిఫికేషన్ జారీ సమయంలో పంపినట్లు జోరుగా ప్రచారం జరిగింది. ఈ పరిస్థితుల్లో వ్యాపారులతో ఎలాగైనా దరఖాస్తులు చేయించేందుకు శత విధాలా ప్రయత్నాలు చేశారు. ఎక్కడికక్కడ వ్యాపారులతో సమావేశాలు నిర్వహించారు. లైసెన్స్ పొందిన వారి ద్వారా కూడా దరఖాస్తులు చేయించేందుకు ప్రయత్నించారు. చివరకు రాజకీయ నేతలతో వ్యాపారులపై ఒత్తిడి కూడా చేశారు. అప్పటి నుంచి ఎక్సైజ్ శాఖ అధికారులు దరఖాస్తులు వేయించడానికి చేయని ప్రయత్నం లేదు. మలి నోటిఫికేషన్ ఈ నెల 3న జారీ చేయగా తొలుత ఇచ్చిన గడువు 14 కాగా దానిని 17 వరకు పొడిగిస్తూ ఎక్సైజ్‌శాఖ నిర్ణయం తీసుకోగా బుధవారంతో ఆ గడువూ ముగిసింది. అయినా రీ నోటిఫికేషన్ ద్వారా కూడా మొత్తం బార్లకు వ్యాపారుల నుంచి దరఖాస్తులు రాలేదు.

బాపట్ల జిల్లాలో మొత్తం 19 బార్లకు తొలి నోటిఫికేషన్‌లో 4 బార్ల ఏర్పాటు ప్రక్రియను ఎక్సైజ్ విభాగం ముగించింది. మిగిలిన 15 బార్లకు రీ నోటిఫికేషన్ జారీ చేయగా బుధవారం సాయంత్రం గడువు ముగిసేప్పటికి ఆరు బార్లకు 24 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.నిబంధనల ప్రకారం

(మిగతా 6వ పేజీలో)

రాష్ట్ర పండుగగా బీచ్ ఫెస్టివల్

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ఏర్పాట్లపై సచివాలయంలో మంత్రుల సమీక్ష



సూర్యలంక బీచ్ ఫెస్టివల్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రులు, కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు

బాపట్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26, 27, 28 తేదీల్లో బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరంలో నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్‌ను రాష్ట్ర పండుగగా నిర్వహించాలని మంత్రులు నిర్ణయించారు. బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లపై బుధవారం అమరావతి సచివాలయంలో మంత్రులు కొలుసు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్, కొల్లు రవీంద్ర, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, నక్కా ఆనందబాబు, ఏలూరి సాంబశివరావు, ఎం.మాలకొండయ్య, కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, సమగ్రశిక్ష ఏపీసీ నాగిరెడ్డిలతో మంత్రి అనగాని సత్యప్రసాద్ సమీక్షించారు. బీచ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అనగాని తెలిపారు. తీరంలోని ఇసుకలో రాళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పర్యాటకులకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని జాగ్రత్తలు పాటిస్తూ బీచ్ ఫెస్టివల్‌ను వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేయాలని నిర్ణయించారు.

రాష్ట్రానికి 1,050 ఎలక్ట్రికల్ బస్సులు

1500 వివిధ రకాల నూతన బస్సులతో స్త్రీశక్తి పథకం విజయవంతం: ఎండీ ద్వారకా తిరుమలరావు

రేపల్లె, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్టీసీని ఉన్నతస్థితికి తీసుకుని వెళ్లేందుకు 1,050 ఎలక్ట్రికల్ బస్సులు, వివిధ రకాల నూతన బస్సులు 1,500 తీసుకువస్తున్నామని ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. బాపట్ల జిల్లా రేపల్లె ఆర్టీసీ డిపోలో బుధవారం స్త్రీశక్తి విజయోత్సవ సభ, ఉత్తమ ఉద్యోగులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 'స్త్రీశక్తి ఉచిత పథకం కోసం ఆరు నెలల ముందుగానే తీసుకోవాల్సిన చర్యలు, ప్రణాళికలను సిద్ధం చేశాం. స్త్రీశక్తి పథకం ఇతర రాష్ట్రాల్లో కంటే మన రాష్ట్రంలోనే సజావుగా సాగుతుంది. 90 శాతం ఆక్యుపెన్సీ పెరిగింది. రేపల్లె డిపోతో సహా ఇప్పటి వరకూ 115 డిపోలు పరిశీలించా. స్త్రీశక్తి పథకంలో ఏర్పడిన ఇబ్బందులు ఏమైనా ఉంటే అడిగి తెలుసుకున్నా. ప్రయాణికుల పట్ల డ్రైవర్లు, కండక్టర్లు స్నేహపూర్వకంగా మెలగాలి. ఆర్టీసీని మరింత బలోపేతం చేసే దిశగా సీఎం చంద్రబాబు సహకారంతో ముందుకు వెళుతున్నాం. కొత్త సర్వీస్‌లు రావటంతో ఆర్టీసీ మరింత బలోపేతమవుతుంది. రాష్ట్రంలో అన్ని డిపోలు ఆర్థికంగా బలపడేందుకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నాం. ఆర్టీసీలో పనిచేసే ఉద్యోగులందరికీ మెరుగైన సౌకర్యాలు అందిస్తాం' అని ద్వారకా తిరుమలరావు తెలిపారు. అనంతరం డిపో ఆవరణలో పర్యావరణ పరక్షణలో భాగంగా మొక్కలను నాటారు.



మొక్కలను నాటుతున్న సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు, ఉద్యోగులు



పిచ్చి కుక్క కోసం కర్రలు పట్టుకుని గాలిస్తున్న యువత

పిచ్చి కుక్క స్వైర విహారం.. ప్రజలు బెంబేలు

పర్చూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పర్చూరులో పిచ్చికుక్కలతో పాటు, వీధి కుక్కలు గుంపులుగా తయారై ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఎటు నుంచి ఎటు వచ్చి దాడులు చేస్తాయోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పిల్లలను పాఠశాలలకు తీసుకుపోయేందుకు తల్లిదండ్రులు కర్రలను చేతపట్టుకుని వెళుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మంగళవారం పిచ్చికుక్క దాడిచేసి పదిమందిని గాయపరిచింది. ఇంతటితో ఆగకుండా మంగళవారం అర్ధరాత్రి నిద్రిస్తున్న మరో ఇద్దరిని కూడా గాయపరిచింది. పిచ్చి కుక్క దాడిలో గాయపడిన వారు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. రెండేళ్ల చిన్నారిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. ఈ దాడిలో ఎక్కువశాతం చిన్నారులే ఉండటంతో తల్లిదండ్రులు మరింత ఆందోళన చెందుతున్నారు. దీంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటే ప్రజలు భయపడుతున్నారు. పిచ్చికుక్కను పట్టుకునేందుకు యువత, పారిశుధ్య కార్మికులు రాత్రి నుంచి వేట కొనసాగిస్తున్నా ఫలితం లేకుండా పోయింది. బుధవారం పర్చూరు మండల పరిధిలోని నాగులపాలెంకాలనీలో పలువురిపై కుక్క దాడిలో గాయపడ్డారు. అధికారులు స్పందించి కుక్కల బారి నుంచి తమను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.



పిచ్చికుక్క దాడిలో గాయపడి పర్చూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులు

వ్యవసాయంలో డ్రోన్‌ల శకం

80 శాతం రాయితీతో కూటమి ప్రోత్సాహం ● జిల్లాలో ఇప్పటికే 35 యంత్రాల పంపిణీ

చీరాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంలో డ్రోన్‌ల శకం మొదలైంది. రైతులకు శ్రమ తగ్గించి దిగుబడులు పెంచే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 80 శాతం రాయితీతో డ్రోన్‌ల పంపిణీ చేస్తోంది. ఈ క్రమంలో రైతులు కూడా డ్రోన్‌లపై ఆసక్తి కనబరుస్తున్నారు. పంటల సాగులో చీడపీడల నివారణకు పలు రకాల పురుగు మందులను పిచికారీ చేస్తుంటారు. ప్రస్తుతం నానో యూరియా, డీఏపీలను సైతం నేరుగా మొక్కలకే అందించాల్సి ఉంటుంది. అయితే ఈ విధంగా పైర్లపై నేరుగా మందులను పిచికారీ చేయడంలో డ్రోన్‌ల ప్రాధాన్యం పెరుగుతోంది.



రైతుకు రాయితీ డ్రోన్ అందిస్తున్న అధికారులు

పిచికారీ చేసే సాధనాలు ఎన్నో...

గతంలో చేతితో వ్యాక్యూం స్ప్రెజర్‌తో స్ప్రే చేసే ట్యాంకులున్నారు. వీటితో పిచికారీ చేయడం శ్రమతో కూడుకున్న కారణంగా పవర్ స్ప్రేయర్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఆ తరువాత ట్రైవాస్ స్ప్రేయర్, ట్రాక్టర్‌లకు బిగించి పిచికారీ చేసే వైజర్లు అందుబాటులోకి వచ్చాయి. వీటి వల్ల నీటి తుంపరలు మొక్కంతా విస్తారంగా పడే అవకాశం ఉంది. గత దశాబ్ద కాలంగా వీటి వినియోగం అధికంగా ఉంది. ఇక ప్రత్యేకంగా పురుగు మందును పిచికారీ చేసే వాహనాలను కూడా మిరప, వేరుశనగ తదితర పంటల్లో వినియోగించారు. అయితే వీటన్నింటినీ తలదన్నే రీతిలో డ్రోన్ స్ప్రేయర్‌లు తాజాగా వ్యవసాయం రంగంలోకి అడుగు పెట్టాయి.

ప్రభుత్వం ప్రోత్సాహం..

ప్రస్తుతం ప్రభుత్వం రైతులకు 80 శాతం రాయితీతో డ్రోన్‌లను అందిస్తోంది. మార్కెట్‌లో వీటి ధర ప్రస్తుతం రూ.9.80 లక్షలు ఉంది. అందులో సుమారు రూ.2 లక్షలు మాత్రమే రైతు భరించాల్సి ఉంటుంది. అందులోనూ కొంత రైతు, కొంత బ్యాంకు విల్లింగ్‌తో యంత్రం అందిస్తోంది. పొదుపు సంఘాల మహిళలకు డ్రోన్‌లు అందించే వెసులుబాటు ఇప్పటికే కల్పించారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 35 యంత్రాలు అందజేశారు. రాబోవు కాలంలో వీటి వినియోగం పెరిగి రైతుల సంఖ్య కూడా పెరిగే అవకాశం లేకపోలేదు.

మహిళలకు ముందస్తు పరీక్షలు తప్పనిసరి

- కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్
- ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు: ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అసంక్రమిత వ్యాధుల బారినపడకుండా మహిళలు ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ కోరారు. బాపట్ల ఏరియా వైద్యశాలలో బుధవారం స్వస్త్‌నారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన మహిళలందరు తప్పనిసరిగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. మహిళల ఆరోగ్య రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్టోబరు 2వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ వైద్యశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికెళ్లి క్యాన్సర్ పరీక్షలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధగా ఉండాలని, వైద్యుల సూచనల మేరకు మందులు వాడుకోవాలన్నారు. మహిళలు అవసరం లేకపోయిన క్యాన్సర్ వైద్య పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బాపట్ల జిల్లాలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. డెంగీ జ్వరం బారిన పడితే.. బ్లడ్ శాంపిల్స్ కోసం నగదు చెల్లించాల్సిన అవసరం లేదని జిల్లా వైద్యశాలలో అందుబాటులో ఉంటాయని చెప్పారు. అనంతరం ఏరియావైద్యశాలలో ఓపీ విభాగాన్ని పరిశీలించి రోగులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన మహిళల కోసం అన్ని స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. జిల్లాలో మెడికల్ కాలేజి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, ఐసీడీఎస్ పీడీ రాధామాధవి, సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ పాల్గొన్నారు.



కార్డులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎమ్మెల్యే నరేంద్రవర్మ

ఉపాధి అక్రమాలపై..ఉదాసీనత!

- బల్లికురువ మండలంలో పెద్ద ఎత్తున అవకతవకలు
- సామాజిక తనిఖీల్లో రూ.3 కోట్ల అవకతవకల నిర్ధారణ
- ప్రజావేదిక ముగిసి 40 రోజులు..
- ముందుకు కదలని రికవరీ ఫైల్



బల్లికురవలో జరిగిన సామాజిక ప్రజా వేదికలో పాల్గొన్న జిల్లా పీడీ విజయలక్ష్మీ (పాతచిత్రం)

బల్లికురవ, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోనే కూలీలకు ఉపాధి కల్పించేందుకు సంకల్పించిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పక్కదారి పడుతోంది. ఈ పథకం కింద చేపట్టే పనులపై ఏటా చేపడుతున్న సామాజిక తనిఖీల్లో కోట్ల రూపాయల అవకతవకలు బయటపడుతున్నాయి. కానీ, తుది దశకు వచ్చే సరికి ఉన్నతస్థాయి అధికారులు మాత్రం అసలు ఏమీ జరగలేదు అన్నట్లు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. ఇలా అయితే రూ.లక్షలు వెచ్చించి లైవ్ ఆడిట్‌లు చేసి ఉపయోగం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజా వేదికలపై నమ్మకం ఎలా ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ఎత్తున బోగస్ మస్టర్లు , కొలతల్లో తేడాలు బట్టబయలు అయినా.. అందుకు బాధ్యులపై చర్యలు చేపట్టక పోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.


చర్యలు ఏవీ..?

బల్లికురవ మండలంలో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపట్టిన 645 పనులకు రూ. 12 కోట్ల నిధుల వినియోగంపై సామాజిక తనిఖీలు జూలై, ఆగస్టులో చేపట్టారు. పనులకు పోకుండా మస్టర్లు వేశారని, ప్రభుత్వ, సాఫ్ట్ వేర్ ఉద్యోగులకు సైతం మస్టర్లు వేయడంతో పాటు.. కుంటలు తవ్వకుండానే తవ్వినట్లు రూ.కోట్ల నిధులు ప్రక్కదారి పట్టాయని తనిఖీల్లో వెల్లడైంది. బల్లికురవ ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా వేదిక సభకు వచ్చిన జిల్లా డ్వామా పీడీ విజయలక్ష్మి పరిశీలన చేసి రూ2. 30 కోట్ల పనులు అసలు చేయలేదని గుర్తించారు. అలానే మరో కోటి రుపాయల నిధులకు మళ్లీ పనులు చేయించాలని మొత్తం మూడు కోట్ల రూపాయల మేర అవకతవకలు ఉన్నట్లు ప్రజావేదికలలో చదివి వినిపించారు. మల్లాయపాలెం గ్రామ మాజీ సర్పంచ్ గ్రామంలో జరిగిన లోపాలను పూర్తి ఆధారాలతో ప్రజా వేదిక ముందు ఉంచారు. కానీ, ఇంత వరకు ఎలాంటి రికవరీలు, సంబందిత ఉద్యోగులపై చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. అసలు సామాజిక తనిఖీల వివరాలను 40 రోజులు దాటినా అధికారులు బయట పెట్టలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతస్థాయి అధికారులు బల్లికురవ మండలంలో జరిగిన ఉపాధి పనుల అవకతవకలపై పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టి.. మున్ముందు పనులు నాణ్యతగా జరిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బర్లీ పొగాకు నిధులు జమ

- రెండు విడతల్లో రూ.100 కోట్లు..
- ఒక్క బాపట్ల జిల్లాలోనే రూ.74 కోట్లు
- పొగాకు రైతుల్లో ఆనందం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)



గతంలో ఎన్నడూ లేని విధంగా బర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం మూడు నెలలుగా కొనుగోలు చేస్తుంది. ఇప్పటికే బాపట్ల జిల్లాలో 1,20,000 క్విం టాళ్లు, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లా లను కూడా కలుపుకుంటే మొత్తం 1,60,000 క్వింటాళ్ల వరకు మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది. వీటి తాలూకా నగదు ను ఈ నెల 1న తొలి విడతగా ప్రభుత్వం అన్నదాతల ఖాతాల్లో జమ చేసింది. బాపట్ల జిల్లాలో రూ.22 కోట్లను మొదటి దశలో నిధులు విడుదల చేసింది. దశల వారీగా ఇప్పటి వరకు మొత్తం రూ.100 కోట్లను రైతుల ఖాతాల్లో నగదు జమ అయినట్లు మార్క్‌ఫెడ్ అధికారులు చెబు తున్నారు. ఇందులో బాపట్ల జిల్లా రైతుల వాటా రూ.74 కోట్లు కాగా, మిగిలిన మూడు జిల్లాల రైతులకు రూ.26 కోట్లు జమ చేసినట్లు యంత్రాంగం వెల్లడించింది.

అవీ..ఇవీ..

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

● సీడీపీవో ఎలిజబెత్‌రాణి

పంగులూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవడంద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని కోరిశపాడు సీడీపీవో ఎలిజిబెత్ రాణి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవంలో భాగంగా బుధవారం రామకూరు గ్రామంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. తద్వారా ఆరోగ్యకరమైన శిశువులు జన్మిస్తారన్నారు. బాలింతలు, గర్భిణీలు ఆహారంలో కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు అధికంగా తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మజ, అంగన్‌వాడీలు అరుణ, అనూరాధ, తులసి, తల్లులు, బాలింతలు,గర్భవతులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డలకు ఆరోగ్యం

● రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమంలో సీడీపీవో సుధ

బల్లికురవ : పుట్టిన బిడ్డలు ఆరోగ్య వంతులుగా ఉండాలంటే ఆరుమాసాల పాటు తల్లిపాలు ఇవ్వాలని సంతమాగులూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో సుధా పేర్కొన్నారు. బుధవారం బల్లికురవ అంగన్ వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా తల్లులకు మరియు గర్భవతులకు పౌష్టికామార కిట్‌లను అందజేసి వాటి వలన కలిగే ప్రయెజనాల గురించి వివరించారు. ప్రతిబిడ్డకు రెండేళ్ల వయస్సు వచ్చే వరకు ఎలాంటి అహారాన్ని ఇవ్వాలన్న దానిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు విజయనిర్మలా, మీరాబీ, అంగన్ వాగీ కార్యకర్త శ్రీదేవి తదతరులు పాల్గొన్నారు.

సమగ్ర మహిళా పోషణకు అడుగులు

వేటపాలెం : కుటుంబంలో సమగ్ర మహిళ పోషణకు ప్రతి ఒక్కరు అడుగులు వేయాలని ఎంపీడీవో రాజేష్‌బాబు, సీడీపీవో ఝాన్సీ పేర్కొన్నారు. బుధవారం వేటపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసంను ఘనంగా నిర్వహించారు. బుధవారం నుండి అక్టోబరు 16 వరకు మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. స్థూలకాయం నివారణ, బాల్య దశ సంరక్షణ, ఆహార అలవాట్లుపై అధికారులు మాట్లాడారు. సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎమ్ఈవో జెవి సుబ్బయ్య, డా.స్వాతీ కిరణ్, డా.హర్షవర్ధన్, సిహెచ్‌వో దయామణి, ఎస్‌టియుపి పాఠశాల ప్రధానోపాధ్యాయినీ అరుణ, అంగన్వాడీలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలపై అవగాహన

ఇంకొల్లు, సెప్టెంబరు 17,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ అంజలి, డా.జి భానుప్రకాశ్‌ల ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం ప్రారంభించారు. మాతా శిశు సంరక్షణ, వ్యాధినిరోధక టీకాలు ఇవ్వడం ఆహారం తీసుకోవడంపై అవగాహన కల్పించారు.

రోగులకు పండ్లు పంపిణీ

అద్దంకి,సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మోదీ 75వ జన్మదినం సందర్భంగా అద్దంకి పట్టణంలో బీజేపీ నేతలు బుధవారం కేక్ కట్ చేశారు. మోదీ చిత్ర పటానికి పాలాభిషేకము చేశారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. బీజేపీ కార్యాలయం వద్ద అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ జాగర్లమూడి యలమందరావు, పరుచూరి శ్రీనివాసరావు,షేక్ కాలేషాబాబు విరాట్, ఈదా చిన శ్రీనివాసరెడ్డి, మంగమూరి సతీష్, గాలం ప్రభాకర్, కొండ్రగుంట శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, తమ్మన శ్రీనివాసరావు, కొత్తమాసు నాగరాజు, రూపాంజలి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

చుక్కలభూమి సమస్యకు త్వరలో పరిష్కారం



ఆర్డీఓ చంద్రశేఖరనాయుడుకు సమస్యను వివరిస్తున్న నేతలు

అద్దంకి, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని 1096 సర్వే నెంబరు భూమి చుక్కల భూమిగా రెవెన్యూ రికార్డులలో నమోదైంది. దీంతో కొంతకాలంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో సమస్యను ఇటీవల అద్దంకి వచ్చిన మం త్రి రవికుమార్ దృష్టికి స్థానికులు తీసుకుపోయారు. బుధవారం పలువురు టీడీపీ నేతలు చిలకలూరిపేట లో మంత్రి రవికుమార్ ను మరో మారు కలిసి సమస్య ను వివరించారు. వెంటనే మం త్రి రవికుమార్ ఫోన్ చేసి చీరాల ఆర్‌డీఓ చం ద్రశేఖరనాయుడుతో మాట్లాడారు. టీడీపీ నేతలు రంగిశెట్టి సాంబశివరావు(లహరి), చుండూరి మురళీసుధాకరరావు,చిన్ని వీరయ్య, చేబ్రోలు పాండు, గుంటూరు మాధవరావు లు ఆర్‌డిఓ చం ద్రశేఖరనాయుడు ను కలిసి సంబంధిత డాక్యుమెంట్‌లను అందేశారు. పరిశీలించిన ఆర్‌డీవో చుక్కల భూమి సమస్యను వెంటనే పరిష్కరిస్తామన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలి

● ఎంపీడీవో వెంకటస్వామి

పర్చూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని మురుగు నీరు ఎక్కడ నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటస్వామి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులు, ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించి, గ్రామాల వారీగా పారిశుధ్యంపై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రస్తుతం విడుదల అయిన 15వ ఆర్థిక సంఘ నిధులతో పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలన్నారు. మురుగు నీటి కాలువల్లో ఎబెట్‌తోపాటు, బ్లీచింగ్‌ను విధిగా పిచికారి చేయించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రధానంగా డ్రైనేజ్ కాలువల్లో పేరుకు పోయిన చిల్లచెట్లను సైతం తొలగించి మురుగునీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా దృష్టిసారించాలన్నారు. పర్చూరులో కుక్కల బెడద ఎక్కువగా ఉందని వాటిని పట్టించే విధంగా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మో బార్లా

(5వ పేజీ తరువాయి)

దరఖాస్తులు వచ్చిన బాపట్లలో 2, చీరాలలో 3, రేపల్లెలో 1 బార్‌కు లాటరీ ప్రక్రియ గురువారం ఉదయం 8 గంటలకు కలెక్టరేట్ వేదికగా జరుగుతుందని ఎక్సైజ్ విభాగం తెలిపింది. అయితే మిగిలిన 9 బార్ల విషయంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. తొలిసారి 4, రెండోసారి 6 బార్లకు వచ్చిన దరఖాస్తులు విషయంలోనే ఎక్సైజ్ విభాగం తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. పలుసార్లు ఆశావహులతో సంప్రదింపులతో పాటు, కొంతమందికి స్థానిక నేతలతో చెప్పించడంతోనే ఈ మాత్రం ఫలితాలు కనబడ్డాయని, ఇకపై మిగిలిన బార్ల విషయంలో నోటిఫికేషన్ ఇచ్చినా పెద్దగా ఉపయోగం ఉండకపోవచ్చనే అభిప్రాయాన్ని అంతర్గత సంభాషణల్లో ఎక్సైజ్ సిబ్బందే వ్యక్తం చేస్తున్నారు.

- గుంటూరు జిల్లాలో 67 బార్లకు 26 బార్లకు మాత్రమే నిబంధనల ప్రకారం దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో బార్‌కు నాలుగు చొప్పున 104 దరఖాస్తులు వచ్చాయి. మిగిలిన 41 బార్లకు దరఖాస్తులు రాలేదు.
- పల్నాడు జిల్లాలో 30 బార్లలో 8 బార్లకు నాలుగు దరఖాస్తుల చొప్పున 32 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.

మహిళల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత

స్వస్థ్ నారీ.. స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు,సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి):కుటుంబాలలో మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబంలోని సభ్యులు అందరూ ఆరోగ్యంగా ఉండగలుగుతారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మార్టూరులో కమ్యూనిటీ హెల్త్ సెంటరులో ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రధానమంత్రి మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడారు. వచ్చేనెల 2న వరకు అన్ని ప్రభుత్వ వైద్యశాలలో మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి 25 లక్షల వరకు వైద్యచికిత్సలకు అయ్యే ఖర్చును ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ భరించేలా ప్రణాళిక అమలుచేస్తోందన్నారు. తరువాత ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సక్రమంగా వైద్యసేవలను అందించాలని వైద్యాధికారులను కోరారు. తరువాత ఆయుష్ విభాగంలో వైద్యాధికారి అంజమ్మతో మాట్లాడారు. వైద్యశాలలో అన్ని రకాలు మందులు ఉన్నాయా అంటూ అంజమ్మను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులతో పాటు,పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంతరావూరు వైద్యాధికారి కీర్తి సరోజ్

స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ

మండలంలోని వలపర్ల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మహిళలకు స్మార్ట్‌రైస్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషను షాపుల ద్వారా ప్రతి కుటుంబానికి సక్రమంగా రేషను సరుకులను పంపిణీ చేసేందుకు స్మార్ట్‌రైస్ కార్డులను ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలన్నారు. అదేవిధంగా వలపర్ల గ్రామంలో 2992 మందికి రైస్‌కార్డులను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి ప్రశాంతి, సొసైటీ చైర్మన్ కంభంపాటి హనుమంతరావు, సర్పంచ్ తాళ్లూరి బ్రహ్మయ్య, పర్చూరు మార్కెట్ యార్డు డైరెక్టర్ వెలగా రామాంజనేయులు, జంజనం సుబ్బారావు, గుంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ పరిదిలోని 180 మందికి రూ.1.03 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పర్చూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుంజి వెంకట్రావు,షేక్ రజాక్, కామినేని జనార్దన్, తేలప్రోలు సాంబశి వరావు, కమ్మ శివనాగేశ్వరరావు,కోటపాటి సురేష్, కామేపల్లి హరిబాబు, మిన్నెకంటి రవికుమార్, తొండెపు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



వలపర్లలో స్మార్టుకార్డులు అందుకున్న మహిళలతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

బల్లికురవ : కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాలలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ ద్వారా మహిళకు ఉచితంగా పరీక్షలు చేసి మందులను అందజేస్తామని గుంటుపల్లి ప్రాథమిక అరోగ్య కేంద్రం వైద్యాధికారి రవితేజ తెలిపారు. బుధవారం ప్రాథమిక అరోగ్య కేంద్రంలో సుమారు వందమందిని పరీక్షించారు. మహిళలకు బలవర్ధకమైన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అక్టోబరు 2 వరకు అన్ని గ్రామాలలో ఈ క్యాంపులు చేపడతామన్నారు. రక్తపోటు, ముధమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ తదితర పరీక్షలు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రమీజ్ అహ్మద్, భారతీ, మమత, సిబ్బంది పాల్గొన్నారు.

చినగంజాం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రవేశ పెట్టిన స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎన్.విజయ, సంతరావూరు పీహెచ్‌సీ వైద్యాధికారి కే.కీర్తిసరోజ్‌లు అన్నారు. మండలంలోని సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన మహిళలు, బలమైన కుటుంబాల కోసం వైద్య శిబిరాలు బుధవారం నుండి అక్టోబరు 2వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో సంతరావూరు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ యార్లగడ్డ లక్ష్మి, గ్రామ కార్యదర్శి కె.కృపారావు, పీ.హెచ్.సీ ఎంపీహెచ్‌ఈవో యూ.వెంకటరమణ, హెచ్ఎస్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, పొట్టేళ్లను అపహరించే దొంగల ముఠా అరెస్ట్

వివరాలను వెల్లడించిన డీఎస్పీ మొయిన్



వివరాలను వెల్లడిస్తున్న చీరాల డీఎస్పీ మొయిన్

అద్దంకి, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): గొర్రెలు, పొట్టేళ్ల అపహరించుకు పోయే దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రూ.3.72 లక్షల విలువైన 21 గొర్రెలు, 4 పొట్టేళ్లను స్వాధీనం చేసుకున్నారు. చీరాల డిఎస్పీ మొయిన్ బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. కారంచేడు మండలం కుంకలమర్రు కు చెందిన చీదరబోయిన రాజేంద్రప్రసాద్, షేక్ మహ్మద్‌రఫీ, కారంచేడుకు చెందిన మైలా మణికంఠ, మార్టూరులోని బలరామ్ కాలనీ కి చెందిన పెన్నిబోయిన శ్రీనివాసరావు లు అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంలో 8 గొర్రెలు, అద్దంకి మండలంలోని గు ర్రంవారి పాలెంలో 4 గొర్రెలు, ఒక పొట్టేలు, మార్టూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 7గొర్రెలు, 3 పొట్టేళ్లను దొంగలించారు. దొంగలించిన గొర్రెలు, పొట్టేళ్లను రాజేంద్రప్రసాద్ తన ఇంటివద్ద గొర్రెల దొడ్డిలో ఉంచి మేపుతున్నారు. వాటిలో 2 గొర్రెలు, 1 పొటేలును అమ్మారు. మిగిలిన 21 గొర్రెలు, 4 పొట్టేళ్లను సంతనూతలపాడులో జరిగే సంతలో అమ్ముకునేందుకు బుధవారం బాడుగ ఆటోలో ఇద్దరు నిందితులు తీసుకువెళుతున్నారు. వెనుక వైపు కారులో మరో ఇద్దరు నిందితులు వస్తుండగా అద్దంకి సీఐ సుబ్బరాజు సిబ్బందితో శింగరకొండ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారు. కారును కూడా స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడేచోట పరిచయమైన నిందితులు చెడు వ్యసనాలకులోనై చోరీలకు పాల్పడ్డారు. నిందితులను అరెస్ట్ చేయడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చీరాల డీఎస్పీ మొయిన్, అద్దంకి సీఐ సుబ్బరాజు, సిబ్బంది వసంతరావు, అంకమ్మరావు, వి.బ్రహ్మయ్యలను జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ అభినందించారు. రివార్డులను డిఎస్పీ మొయిన్ అందజేశారు.

డీఎస్సీ అభ్యర్థుల వసతి కోసం ఏర్పాట్లు



హాస్టల్ గదులను పరిశీలిస్తున్న కలెక్టర్

మార్టూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాకు చెందిన డీఎస్సీ అభ్యర్థులు ఉపాధ్యాయుల పోస్టులకు ఎంపికైన 500 మంది అభ్యర్థులు గురువారం రాత్రి మార్టూరులో విశ్రాంతి తీసుకోనున్నారు. ఈ మేరకు వారి కోసం మార్టూరు లోని శ్రీహర్షిణి డిగ్రీ కళాశాల, వివేకానంద సిటిజన్స్ స్కూల్, రాయల్ పయనీర్ స్కూల్‌కు చెందిన హాస్టల్ గదులను బుధవారం రాత్రి జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, అధికారులతో కలిసి పరిశీలించారు. వారు బసచేసేందుకు ఈ మూడు స్కూళ్లలో వసతి, ఆహారం, తదితర వసతులను కలెక్టర్ పరిశీలించారు. వారంతా శుక్రవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదగా ఉద్యోగ నియామక పత్రాలను అందుకోనున్నారు. జిల్లా కలెక్టర్ వెంట ఆర్‌డీవో గ్లోరియా, డీఈవో పురుషోత్తం, తహసీల్దారు టి.ప్రశాంతి, ఎంఈవో వస్రాంనాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

బీటీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న టీడీపీనేత ఓబుల్‌రెడ్డి, స్థానిక నేతలు

పంగులూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమూరు గ్రామం నుంచి పంగులూరు, ముప్పవరం ఆర్‌అండ్‌బీ రహదారిని కలుపుతూ నిర్మాణం చేపడుతున్న బీటీ.రోడ్డు పనులకు బుధవారం భూమిపూజ చేశారు. రూ.48లక్షల పంచాయితీరాజ్ నిధులతో కొండమూరు గ్రామంలోని పోలేరమ్మగుడి నుంచి ముప్పవరం వైపువెళ్లే రోడ్డువరకు 1.2 కిలోమీటర్ల నిడివిలో బీటీ.రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. రాష్ట్ర విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో నూతనరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ భూమిపూజా కార్యక్రమంలో పీఆర్ ఏఈ హనుమంతరావు, టీడీపీ నాయకులు బొరెడ్డి ఓబుల్ రెడ్డి, కొండమూరు గ్రామసర్పంచ్ బండిశివకుమారి, గ్రామ టీడీపీ నాయకులు కాటాఅంజయ్య, పలువురు స్థానిక నేతలు గ్రామస్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



చెత్త తొలగింపును పరిశీలిస్తున్న చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు

అద్దంకి, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశు భ్రంగా ఉంచటం అందరి బాధ్యత అని స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు అన్నారు. 'స్వచ్ఛత హీ సేవ' కార్యక్రమంలో భాగంగా అద్దంకి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అద్దంకి పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలువలో పేరుకు పోయిన చెత్తా చెదారం తొలగించారు. కార్య క్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బలరామిరెడ్డి, 4వ వార్డు కౌన్సిలర్ మాగులూరి తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం



విశ్వకర్మ విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న సభ్యులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం సందర్భంగా బుధవారం అద్దంకిలో దారు శిల్పంతో తయారు చేసిన విశ్వకర్మ విగ్రహం వద్ద దారు శిల్పి ఏలూరి వీరబ్రహ్మాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసచారి మాట్లాడుతూ సృష్టికి మూల పురుషుడు విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం రోజును రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు, జిల్లా మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా వీ రాంజనేయస్వామిలకు సంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ పట్టణ అధ్యక్షుడు పొన్నపల్లి బ్రహ్మానందం, కార్పెంటర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పొన్నపల్లి మల్లికార్జున బిజెపి నాయకులు బి. వెంకటేశ్వర్లు, గోవిందు, సభ్యులు పాల్గొన్నారు.

బల్లికురవ : బల్లికురవ మండల కేంద్రంలో బుధవారం విశ్వకర్మ మహాయజ్ఞం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న విశ్వబ్రాహ్మణులు విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్వకర్మ పతాకాన్ని తహసీల్దార్ రవినాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు గుంటుపల్లి రమేశ్చంద్ర శేఖరశర్మ, వీరాచార్యులు, యామలేశ్వరాచారి పర్యవేక్షణలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



మాట్లాడుతున్న చైర్మన్ సాంబశివరావు

చీరాల : శ్రీవిరాట్ విశ్వకర్మ విశ్వశిల్పి అని, దేవతలకు ఆభరణాలు, ఆయుధాలు సైతం తయారుచేసి మన్ననలు పొందారని మున్సిపల్ ఛైర్మన్ మించాల సాంబశివరావు, ఏఎంసీ ఛైర్మన్ కౌతవరపు జనార్ధనరావు అన్నారు. బుధవారం స్థానిక బాపనమ్మ కళ్యాణ మండపంలో శ్రామికుల ఆరాధ్య దైవం విశ్వకర్మ జయంతి ది.చీరాల, పేరాల స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా హాజరయిన అతిధులు ముందుగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాగవీరభద్రాచారి, ఆనంద్, నరసింహాచారి, ప్రసాద్, శ్రీనివాసరావు, సత్యన్నారాయణ మూర్తి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

చందుకు చెన్నైలో సత్కారం

మార్టూరు: విశ్వకర్మ జయంతి సందర్భంగా బుధవారం చెన్నైలో మార్టూరు అమ్మ ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందును విశ్వకర్మ అవార్డుతో, శాలువా కప్పి సత్కరించారు. చెన్నైలోని తాదంకుప్పం బ్రహ్మంగారి గుడి ప్రాంగణంలో విశ్వకర్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చందును సత్కరించారు. ఇదిలా ఉండగా మార్టూరులోని అమ్మ ఆశ్రమంలో విశ్వకర్మ సిద్ధు సేవా ట్రస్ట్ ముప్పవరం అధ్యక్షులు సిద్ధు వెంకట సుబ్బారావు వృద్ధులకు అన్నదానం చేశారు.

యాప్‌లతో ఉపాధ్యాయులపై పనిభారం



పర్చూరులో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్రనాయకుడు హనుమంతరావు

చీరాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లతో ఉపాధ్యాయులపై పనిభారం పెరుగుతోందని యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు ఎం. హనుమంతు రావు అన్నారు. ఈనెల 17 నుండి 19 వరకు రణభేరీ ప్రచారజాత నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ప్రచారజాత బుధవారం చీరాలకు చేరుకుంది. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఐదు బృందాలు ప్రచారజాతా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పాఠశాలల్లో బోధనేతర ఇబ్బందులు తొలగించాలని, ఎఫ్ఏ-1 పరీక్ష విధానాన్ని సులభతరం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సీపీఎస్ రద్దుతో పాటు పెండింగ్ బిల్లులు అందించాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఫెడరేషన్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అదేవిధంగా పర్చూరు, ఇంకొల్లు ,పంగులూరు మండలాల్లోనూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి ప్రచారజాతా నిర్వహించారు. కొత్తప్రభుత్వం అధికారం చేపట్టి 15 నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించలేదన్నారు. 12వ పీఆర్‌సీ కమిటీని నియమించలేదని వారు నిరసన తెలిపారు. తక్షణమే యాప్‌ల బారం తగ్గించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యపై ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 25న 10వేల మంది ఉపాధ్యాయులతో గుంటూరులో బహిరంగసభ నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ రణభేరి యాత్రలో వివిధ మండలాల్లోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డులను సక్రమంగా పంపిణీ చేయాలి



స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్న తహసీల్దార్, టీడీపీ నేతలు

చినగంజాం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గ్రామాల్లో స్మార్ట్ కార్డులను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు రేషన్ డీలర్లు, గ్రామ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఆయన మండల టీడీపీ నాయకులతో కలిసి స్మార్ట్ కార్డులను పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో 12,919 స్మార్ట్ రైస్ కార్డులు మంజూరైనట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండ్రగుంట శ్రీహరి, సయ్యద్ అబ్దుల్‌కలాంఅజాద్, సందు శ్రీనివాసరావు, నక్కల వీరరాఘవులు, మోటుమర్రి రామసుబ్బారావు, కోకి ఉదయభాస్కర్‌రెడ్డి, దేవతోటి నాగరాజు, భయ్యా సతీష్‌కుమార్, ధర్మవరపు ఏసునారాయణ, గొల్లపోతు వెంకటేశ్వర్లు, షేక్ జిలాని, వాటుపల్లి ఏడుకొండలు, తొగరు దుర్గారావు, దండుప్రోలు తిరుపతిరావు, బాలరాజు, పట్టాబి వెంకటేశ్వర్లు, కే.శ్యాంబాబు, పెద్దశింగు ఏడుకొండలు, కే.రామాంజనేయులు, చౌకధరల దుకాణం డీలర్లు, వీఆర్‌వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

పందిళ్లపల్లి పాఠశాలలో అథ్లెటిక్స్ పోటీలు

పందిళ్లపల్లి(చీరాల), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలలో శుక్ర, శనివారాల్లో చీరాల డివిజనల్ స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు కో- ఆర్డినేటర్ కర్ణ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలు అండర్ -14, అండర్-17 విభాగాల్లో యోగా, చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వీటితో పాటు బ్యాడ్మింటన్, కబడ్డీ అన్ని విభాగాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మండలస్థాయి పోటీల్లో విద్యార్థుల ఘనత


ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వేటపాలెం(చీరాల) : మండలస్థాయి పోటీల్లో పందిళ్లపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం వేటపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వ్యాస రచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. అయితే పోటీల్లో పందిళ్లపల్లి విద్యార్థులు ప్రతిభతో మెరిశారు. విజేతలకు ప్రధానోపాధ్యాయురాలు సరోజని బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాలరావు, పద్మ పెండెం, పోతురాజు, సోమశేఖర్ తదితరులు పర్యవేక్షించారు.

సెయింట్ ఆన్స్‌లో చిప్ డిజైనింగ్ వర్క్‌షాపు


విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జగదీష్‌బాబు

చీరాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బుధవారం చిప్ డిజైనింగ్‌పై వర్క్‌షాపు ప్రారంభించినట్లు సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం, ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా ప్రారంభించిన కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన కల్పించి వాటిని తయారు చేయించారు. కార్యక్రమంలో ఏపీ ఎస్‌ఎస్‌డీసీ ప్రతినిధి ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపల్ జగదీష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో చర్యలు వేగవంతం


అర్జీదారులను విచారిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో అధికారులు చర్యలు వేగవంతం చేశారు. గత సోమవారం చీరాల డివిజన్ పరిధిలోని చీరాల, వేటపాలెం, కారంచేడు, ఇంకొల్లు, చినగంజాం మండలాలకు చెందిన 54 అర్జీలను అధికారులతో కలిసి ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు బుధవారం పరిశీలించారు. అలాగే అర్జీదారులతో నేరుగా మాట్లాడి 51 అర్జీలకు పరిష్కారం చూపారు. అయితే మిగిలిన మూడు అర్జీలను సుదీర్ఘంగా పరిశీలిచాల్సిన అవసరం ఉందని ఆర్డీవో తెలిపారు. ఆర్డీవో వెంట తహసీల్దార్‌లు ప్రభాకరరావు, నాగరాజు, శ్రీనివాసరావు, డీటీలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

ప్రతికుటుంబానికి స్మార్టు రేషన్ కార్డులు: తహసీల్దార్


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రవినాయక్

బల్లికురవ, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): బల్లికురవ మండల ప్రజాపరిషత్ కార్యాలయ సర్వసభ్య సమావేశం ఎంపీపీ శ్రీలక్ష్మీ అధ్యక్షతన బుధవారం సాదాసీదాగా ముగిసింది. మొత్తం 15 మంది ఎంపీటీసీ సభ్యులకుగాను ఎంపీపీతో పాటు నలుగురు మాత్రమే హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం ప్రజాప్రతినిధులు అధికారులు సకాలంలో హాజరుకాకపోవడంతో అరగంట ఆలస్యంగా ప్రారంభించారు. సమావేశానికి వచ్చిన సభ్యులు కూడా ఎలాంటి ప్రశ్నలు లేవనెత్తలేదు. దీంతో అధికారులే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కుసుమకుమారి మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి సభ్యులతో పాటు అధికారులు సమయపాలన పాటించాలన్నారు. గ్రామాలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలన్నారు. రోడ్ల వెంబడి ఎక్కడ చెత్త అనేది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. స్వమిత్వ సర్వేను వెంటనే పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ రవినాయక్ మాట్లాడుతూ విద్యార్థులందరికీ కుల ధ్రువీకరణపత్రాలు అందించే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అలానే ప్రతి కుటుంబానికి ప్రభుత్వం స్మార్టు రేషన్ కార్డు అందిస్తుందన్నారు. భూసర్వే జరిగిన గ్రామాలలో పట్టాదారు పాసుపుస్తకాలను అందజేస్తామన్నారు. రెవెన్యూ సమస్యలపై గ్రామాలలో ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. ఎంఈవో రమేష్ మాట్లాడుతు మోడల్ పాఠశాలల ఏర్పాటు వలన విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. మల్యాపాలెం పాఠశాల ఎదుట గ్రానైట్ వాహనాలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని వేగనియంత్రణలు ఏర్పాటు చేయించాలన్నా రు. వ్యవసాయశాఖ ఏవో శ్రీనివాసరావు మాట్లాడుతు రైతులకు అవసరమైన ఎరు వులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉద్యా నవనశాఖ అధికారి హన్మంత్‌నాయక్ మాట్లా డుతూ వ్యవసాయ మోటార్ల కొనుగోలుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోందన్నారు. అలానే వెదురు బొంగు సాగు చేసే రైతుకు హెక్టారు కు రూ.60 వేల సబ్సిడిని అందిస్తున్నామ న్నారు. వెలుగు ఏపీఎం రాజారావు మాట్లా డుతూ పొదుపు సంఘాలలో ఉన్న ప్రతి మహిళను లక్షాధికారిని చేసేందుకు పెద్దఎత్తున రుణాలను అందజేస్తున్నామ న్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గిరినాయక్ మాట్లాడుతు జలజీవన్ మిషన్ ద్వారా గ్రామాలలో తాగు నీటిసమస్యలు లేకుండా ఇంటింటికి కొళాయి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షులు గొట్టిపాటి లక్ష్మయ్య, పీఆర్ ఏఈ మాధవ్‌రెడ్డి, సీడీపీవో సుధా, డిప్యూటీ ఎంపీడీవో సుమతి, ఏపీవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీ, వైద్య ఆరోగ్య శాఖ, ఎస్ఎస్‌పీ, మార్కెటింగ్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు గైర్హాజరయ్యారు.

నిషేధిత బర్లీ పొగాకు సాగు చేపట్టవద్దు


రైతులకు సూచనలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు, సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): రైతులెవరూ బర్లీ పొగాకు సాగు చేపట్టవద్దని ఏవో డి.సుబ్బారెడ్డి సూచించారు. 2025-26 సంవత్సరానికి ప్రభుత్వం బర్లీ పొగాకుసాగుపై నిషేధం విధించిందన్నారు. మండలంలోని బూదవాడ, కల్లంవారిపాలెం గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. బర్లీపొగాకు సాగుకు ప్రత్యామ్నాయంగా అపరాలు, మొక్కజొన్న సాగుచేపట్టాలని కోరారు. పంటసాగు వివ రాలను ప్రతిరైతు ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షులు అంజిరెడ్డి, టీడీపీ నాయకులు కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ సహాయకులు వినయ్‌కుమార్, పవిత్ర, పలువురు రైతులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

బల్లికురవ : ప్రభుత్వం అన్ని రైతుసేవా కేంద్రాలలో యూరియాను అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతోందని, రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వం నుంచి వచ్చిన యూరియా బస్తాలను గుంటుపల్లి, అంబడిపూడి, బల్లికురవ గ్రామాలలోని రైతుసేవా కేంద్రాలలో నిల్వ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతు మండలానికి 200 టన్నుల యూరియా వస్తోందని అవసరమైన రైతులు మాత్రమే యూరియాను కొనుగోలు చేయాలన్నారు. ఎవరైన అవసరం లేకుండా బ్లాక్ చేసి నిల్వలు పెడితే చర్యలు తప్పవన్నారు. ఎంఆర్‌పీ ధరకు బస్తా రూ.266.50కు అమ్మకాలు చేపడతామన్నారు. ఈ పరిశీలనలో ఏఈవో మౌలాలి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిపంట ఈ-పంట పరిధిలోకి రావాలి

అద్దంకిటౌన్ : రైతులు సాగు చేసిన ప్రతి పంట ఈ పంట నమోదు పరిధిలోకి రావాల ని ఏవో క్రొరపాటి వెంకటకృష్ణ తెలిపారు. బుధవారం అద్దంకి పట్టణం పరిధిలోని పొలాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 30వ తేదీ వరకు ఈ పంట నమోదు ప్రకియకు అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా కంది పంటను పరిశీలించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు కోటేశ్వరరావు, రేణుక, ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు, రైతులు పాల్గొన్నారు.

నేడు గోవాడలో శాస్త్రవేతలతో కిసాన్ గోష్ఠి

మండలంలోని గోవాడ గ్రామంలో గురువారం రైతులతో కిసాన్ గోష్ఠి నిర్వహించనున్నట్లు ఏవో వెంకటకృష్ణ తెలిపారు. కార్యక్రమానికి పలువురు శాస్త్రవేత్తలు హాజరవుతారన్నారు. మండలంలోని రైతులు అందరు పాల్గొన్నాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు గాయాలు

ఒకరికి తీవ్రం..., మరొకరికి స్వల్పంగా ప్రమాదం

వేటపాలెం (చీరాల), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. వేటపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన ముగ్గురు పదవ తరగతి విద్యార్థులు బుధవారం మధ్యాహ్నం ఓ మైదానంలో ఆటలాడారు. తిరిగి ఇంటికి వెళ్లేందుకు ముగ్గురు మైనర్లు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ముందు ఒకరిని దించేందుకు గాయత్రి రెస్టారెంట్ వెనుక ఉన్న కొత్తపాలెం వెళ్లారు. అక్కడ ఒక మిత్రుడిని దించి మిగిలిన ఇద్దరు తిరిగి వస్తుండగా మలుపు వద్ద ఉన్న విద్యుత్ స్తంభానికి వాహనం అదుపుతప్పి ఢీ కొట్టారు. ప్రమాదంలో ఒకరుతీవ్రంగా, మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. వీరిలో ఒకరిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు.

చీరాల్లో సినీ హీరో నిఖిల్ సందడి

- గజమాలతో స్వాగతం పలికిన అభిమానులు
- మూడు రోజుల షూటింగ్ నిమిత్తం చీరాలకు విచ్చేసిన సినీనటుడు


నిఖిల్‌కు గజమాలతో స్వాగతం

చీరాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చీరాల్లో సినీహీరో నిఖిల్ సందడి చేశారు. మూడు రోజుల షూటింగ్ నిమిత్తం బుధవారం రాత్రి చీరాలకు చేరుకున్నారు. నిఖిల్ సినీహీరో, స్థానిక శాసనసభ్యులు కొండయ్యకు బంధువు కావడంతో సినీ అభిమానులు, టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున జాతీయ రహదారికి చేరుకొని గజమాలతో స్వాగతం పలికారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా కొద్ది రోజులు నిఖిల్ చీరాల్లోనే ఉండి ప్రచారం నిర్వహించారు. తిరిగి రెండేళ్ల తరువాత చీరాలకు రావడంతో సందడి వాతావరణం నెలకొంది.

రోడ్డుపై, తూము మధ్యలో గొయ్యి

- పొంచి ఉన్న ప్రమాదం


రహదారి మధ్యలో ఉన్న గొయ్యి

పంగులూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి తూర్పుతక్కెళ్ళపాడు వైపువెళ్లే ప్రధాన రహదారిలో ఏర్పాటుచేసిన తూముకు గొయ్యి పడింది. దీంతో ప్రమాదం పొంచి ఉంది. పంగులూరు నుంచి తక్కెళ్లపాడు వైపుగా జాతీయ రహదారిని చేరుకునేందుకు ఈ ప్రాంత ప్రజలు నిత్యం ఇటువైపు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రధాన రహదారిపై నిత్యం ప్రయాణం సాగించే ద్విచక్ర వాహన చోదకులు ఈ గోతిని గుర్తించలేక తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

హెచ్ఐవీ, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

పంగులూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హెచ్ఐవీ, డ్రగ్స్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ప్రతినిధి విజయశ్రీ మాట్లాడుతూ కలుషితమైన సూదులు, సిరంజిలు, పరీక్షించని, రక్తమార్పిడి ద్వారా హెచ్ఐవీ సంభవించే ప్రమాదం ఉందన్నారు. వ్యాధి నిర్మూలనకు అందరూ కృషిచేయాలన్నారు. గ్రామీణస్థాయి వరకు విస్తరిస్తున్న డ్రగ్స్, గంజాయిలాంటి మత్తుపదార్థాలతో ప్రమాదం పొంచి ఉందన్నారు. వాటివాడకంతో కలిగే దుష్ఫలితాలు జీవితాలను నాశనం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వీ.వేణుబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైనర్ కాలువలకు చిల్లకంపతో చిక్కులు

- డ్రాపులకు అడ్డుపడుతున్న కంప
- మరమ్మత్తులు కోరుతున్నరైతులు


చిల్లకంపతో నిండిన పంగులూరు మైనర్

పంగులూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సాగర్ పంగులూరు మైనర్ కాలువ చిల్లకంపతో నిండింది. కాలువ ఎగువ నుండి నీటిప్రవాహంలో వచ్చినా, కంప డ్రాపలువద్ద పేరుకుపోవడంతో కాలువనీరు డ్రాపులపై పొర్లిపారుతూ కిందకుసరిగా నీరుచేరని పరిస్థితి ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. కోటపాడు మేజర్‌పరిధిలోని పంగులూరు మైనర్‌కు తగిన మరమ్మతులు తక్షణమే చేపట్టాలని, దిగువకు సాగునీరు సక్రమంగా చేరేలా చర్యలచేపట్టాలని సాగర్ అధికారులను ఈ ప్రాంతరైతులు కోరుతున్నారు.

విద్యార్థులు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలి


కోలాటం శిక్షణలో పాల్గొన్న విద్యార్థినులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సామాజికహిత కార్యక్రమాల్లో నిరంతరం పాల్గొనాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు అన్నారు. కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్నేహిత అనే 5 రోజుల కార్యక్రమంలో విద్యార్థినులకు పలు కార్యక్రమాలపై శిక్షణ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం మహిళ విదార్థినులకు కోలాటం శిక్షణ కార్యక్రమాన్ని శిక్షకురాలు ఈ.మల్లేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల నుంచి కళాంకరణ, మెహందీ, కోలటం వంటి కార్యక్రమాలు నిర్వహించడం నిర్వహించారు. మరో రెండురోజుల పాటు ఆరోగ్యం -పరిశుభ్రత, వైద్య క్యాంప్, మహిళ చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు అధ్యాపకులు డాక్టర్ ఎన్. షర్మిలారాణి, డి. రాజశేఖర్‌లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లు పోలీసులకు పట్టుబడ్డాయి. అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించిన పోలీసులు ట్రాక్టర్‌లను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలో తేస్తాం


చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

బల్లికురవ, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాలలో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రాలను వెంటనే వినియోగంలోకి తీసుకు వచ్చే చర్యలు చేపడతామని ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. బుధవారం మండలంలోని కొండాయపాలెం, అంబడిపూడి గ్రామాలలో ఎంపీడీవో పారిశుధ్య పనులను పరిశీలించారు. కొండాయపాలెం గ్రామంలో ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న వ్యర్థాలను పరిశీలించారు. అంబడిపూడి గ్రామంలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి పంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు చేశారు. గ్రామాలలో ఎక్కడ చెత్త లేకుండా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వారికి పలు సూచనలు చేశారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో సుమతి పాల్గొన్నారు.

పన్నులు చెల్లించకుంటే కేసులు

- బాపట్ల ఆర్‌టీవో ప్రసన్నకుమారి

బల్లికురవ, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై తిరిగే వాహనాలకు సకాలంలో పన్నులు చెల్లించకుంటే కేసులు నమోదు చేస్తామని బాపట్ల ఆర్‌టీవో ప్రసన్నకుమారి తెలిపారు. బుధవారం సాయంత్రం మండలంలోని మల్లాయపాలెం, వేమవరం గ్రామాల వద్ద టాక్స్ చెల్లించని ట్రాలీ లారీపై కేసు నమోదు చేసి పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. అనంతరం ఇటీవల సుబాబుల్ ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన గ్రానైట్ లారీని స్టేషన్ నుంచి విడుదల చేయించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జలజీవన్ మిషన్ పనులు ప్రారంభం

- పనులను ప్రారంభించిన సర్పంచ్ విజయబాబు

సంతమాగులూరు సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాత మాగులూరు గ్రామంలో బుధవారం గ్రామ సర్పంచి జిర్రా విజయబాబు కూటమి నాయకులతో కలిసి జలజీవన్ మిషన్ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో కోటి రూపాయల పనుల ద్వారా ప్రతి ఇంటికి కుళాయి బిగించి ప్రతి ఇంటికి త్రాగునీరు అందించటమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. గ్రామంలో ఉన్న 12 వందల కుటుంబాలకు ఇంటింటి కుళాయి ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. ఈ నిధులతో నూతన పైపులైన్ల ఏర్పాటు, ఇతర మౌలిక వసతలు కల్పింస్తామన్నారు. కార్యక్రమంలో చల్లా బ్రహ్మ రావు, జనసేన పార్టీ నాయకులు చల్లా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధానిమోదీ జన్మదినం


ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నేతలు

చినగంజాం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 75వ జన్మదిన వేడుకలను చినగంజాంలో బీజేపీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని బీజేపీ మండల అధ్యక్షులు ఉలిచి రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక భూ సమేత భావనారాయణస్వామి దేవస్థానంలో నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చినగంజాం గ్రామంలోని వాల్మీకి సేవాసంఘంలోని వృద్ధులకు నాయకులు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉలిచి ఏసుబాబు, రేపాక మంగతయారు, శిఖరం కోటయ్య, మెట్టు వెంకటసుబ్బారావు, మోటుమర్రి వెంకటేశ్వర్లు , కోలా సుబ్బారావు, నూనె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంతమాగులూరు: ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా బుధవారము స్థానిక ప్రాథమిక ఉన్నత ఆరోగ్య కేంద్రంలో సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తేలపోలు రమేష్ ఆధ్వర్యంలో రోగులకు స్వీట్లు,పండ్లు పంపిణీ చేశారు డాక్టర్ కిరణ్ కుమార్ సిబ్బంది కూటమి నాయకులు పాల్గొన్నారు

చీరాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో మోదీ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు మువ్వల వెంకటరమణరావు, బండారుపల్లి హేమంత్‌కుమార్, గుద్దంటి భవానీ, వెంకటేష్, సాయిరాం, భరణి, కుమార్, అయ్యప్ప, రఘు, కృష్ణార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆ టిప్పర్ ఎవరిది!?

- ఇసుక రవాణా అధికారమా.. అనధికారమా?
- సుప్రీం కోర్టు ఆదేశాలు బేఖాతర్
- ఎక్కడి నుంచి తరలిస్తున్నారో అధికారులకే తెలియాలి



సంగం, (ఆంధ్రజ్యోతి): ఓ ఇసుక టిప్పర్ ఆ ఏడుగురి నిండు ప్రాణాలను బలిగొన్నది. అది ఒక వాహనం కాదు.. అక్రమ ఇసుక రవాణాకు చిహ్నం. గ్రీన్ ట్రిబ్యునల్, పర్యావరణ పరిరక్షణలో భాగంగా సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అక్టోబరు 15 వరకు ఇసుక తరలింపునకు అనుమతుల్లేవు. అయితే ఆత్మకూరు నుంచి సంగం వైపు వస్తూ ఏడుగురిని బలిగొన్న టిప్పర్ ఏ రీచ్ నుంచి ఇసుక తీసుకువచ్చినట్లో అధికారులకే తెలియాలి. మరోవైపు అధికార పార్టీ ముసుగులో కొందరు నేతలు పెన్నానదిలో ఇష్టారాజ్యంగా యంత్రాలతో ఇసుక తోడేస్తున్నారు. మామూళ్ల మత్తో లేదా అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల ప్రభావమో అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం పెన్నా నుంచి అక్రమంగా, అధిక బరువుతో తరలిస్తున్న ఇసుక లోడుతో ఓ టిప్పర్ మృత్యు రథంలా దూసుకొచ్చింది. ఆ వాహన నియంత్రణ కోల్పోయిన డ్రైవర్ ఎదురుగా వస్తున్న కారును ఢీకొని, ఏడుగురిని పొట్టన పెట్టుకున్నాడు.

వామ్మో ముంబాయి హైవే!

ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధికి చిహ్నాలైన రహదారులు మృత్యుమార్గాలవుతున్నాయి. నిత్యం ప్రమాదాలతో రక్తమోడుతున్నాయి. నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై తరచూ జరుగుతున్న ప్రమాదాలే ఇందుకు నిదర్శనం. ముఖ్యంగా ఆత్మకూరు, సంగం మధ్యలో హైవేపై ప్రమాదాలు అధికమయ్యాయి. రోడ్డు నిర్మాణంలో లోపాలు.. నామమాత్రపు నిర్వహణ.. కొరవడిన భద్రతా ప్రమాణాలు.. డ్రైవింగ్ నిర్లక్ష్యం.. మద్యం మత్తు.. అతివేగం తదితర అంశాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పెద్దదిక్కును కోల్పోయి ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతుంటే.. చేతికందిన బిడ్డలు అకాల మరణంతో బాధిత కుటుంబసభ్యులు కుమిలిపోతున్నారు.

● రోడ్డు భద్రతా కమిటీ ఏదీ!?

జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై నెలకొకసారి సమీక్ష సమావేశాలు నిర్వహించి, ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో రోడ్డు భద్రతా కమిటీ చెప్పాలి. అంతేగాక వరుస ఘటనలు జరిగితే.. ఘటనా స్థలాలను పరిశీలించి.. అక్కడే ఎందుకు ప్రమాదాలు జరుగుతున్నాయి? లోపం ఏమిటి? నియంత్రణకు ఏం చేయాలి? అనేవి కమిటీ సమావేశంలో చర్చించాలి. ముంబయి జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలతో నష్టం జరుగుతున్నా దిద్దుబాటు చర్యలు లేవు. చిరమన ప్రమాదంతోనైనా అధికారుల్లో చలనం వస్తుందో లేదో వేచి చూడాలి.

ఇంకెందరిని మింగాలి!?



అనుకోని ప్రమాదం జరిగిపోయింది. బంధుమిత్రులతో కారులో వెళుతున్న వారిని టిప్పర్ మృత్యువులా దూసుకొచ్చింది. ఒక్కరినీ మిగలకుండా కారులోని ఏడుగురినీ పొట్టనపెట్టుకుంది. దాదాపు నాలుగు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపిన ఈ ఘోరానికి టిప్పర్ ఓ కారణమైతే హైవేపై భద్రతా ప్రమాణాలు లేకపోవడం మరో కారణంగా తెలుస్తోంది. అంతేగాక నదుల్లో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేకపోయినా వందల సంఖ్యల్లో టిప్పర్లు, ట్రాక్టర్లు మితిమీరిన వేగంతో రోడ్లపై దూసుకుపోతున్నాయి. తెరవెనుక రాజకీయ పార్టీల నాయకులు ఉంటే కళ్లుండి కబోదిలా అధికారులూ వ్యవహరిస్తున్నారు..కారణాలు ఏవైనా రోడ్లపై ప్రయాణమంటే వాహనదారులేకాదు.. ప్రజలు వణికిపోతున్నారు. మరీ ముఖ్యంగా నెల్లూరు-ముంబయి జాతీయరహదారి (నెం.67) అంటేనే అందరి వెన్నులోనూ వణుకు పుడుతోంది. ప్రమాదం జరిగినప్పుడు హడావుడి చేస్తున్న పాలకులు, అధికారులు ఆ తర్వాత చేతులెత్తేస్తున్నారు. ఫలితంగా ప్రమాదాలు షరామామూలై ఎన్నో కుటుంబాలను శోకసంద్రంలోకి నెట్టేస్తున్నాయి.





ఆ 15 నిమిషాలు గడిచి ఉంటే..

- గమ్యస్థానానికి చేరేవారే!
- ఇంతలో మృత్యువులా దూసుకొచ్చిన టిప్పర్
- ఘటనాస్థలిలో మిన్నంటిన రోదనలు
- డ్రైవర్ తప్ప అంతా బంధువులే



సంగం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సరిగ్గా 15 నిమిషాల్లో వారి ప్రయాణం సాఫీగా సాగి ఉంటే అంతా గమ్యస్థానం చేరి ఉంటారు. ఇంతలో దూసుకొచ్చిన టిప్పర్ ఏడుగురినీ పొట్టనపెట్టుకుంది. సంగం మండలం పెరమన గ్రామం వద్ద బుధవారం మధ్యాహ్నం టిప్పర్ ఓ కారును ఢీకొనడంతో ఏడుగురు మృత్యువాతపడ్డారు. నెల్లూరులోని గుర్రాల మడుగువారి సంఘానికి చెందిన తాళ్లూరు శ్రీనివాసులు (40), భార్య రాధ (38), శేషం సారమ్మ (40), శేషం బాలవెంగయ్య (38), ఇందుకూరుపేటకు చెందిన చల్లగుండ్ల శ్రీనివాసులు (40), భార్య లక్ష్మి (35) వీరంతా బంధువులు. రాధమ్మ బంధువు మధు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఆయన్ను పరామర్శించేందుకు సొంత కారులో వీరంతా బయలుదేరారు. రాధమ్మ నిర్వహిస్తున్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లోనే పనిచేస్తున్న బ్రహ్మయ్య (24) కారు డ్రైవింగ్ చేస్తున్నాడు. కారు సంగం కొండ దిగి పెరమన సమీపంలోకి వెళ్లగా వేగంగా వస్తున్న ఇసుక టిప్పర్ రాంగ్‌రూట్‌లో వచ్చి ఢీకొట్టింది. దీంతో కారు నుజ్జునుజ్జయ్యింది. కారులో ఏడుగురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

● శ్రమించిన పోలీసులు

సమాచారం అందుకున్న సంగం సీఐ వేమారెడ్డి, ఎస్‌ఐ రాజేష్ వెంటనే ఘటనా స్థలికి చేరుకున్నారు. కారులో ఇరుక్కున్న మృతదేహాలను వెలికి తీసేందుకు శతవిధాలా ప్రయత్నించారు. కారు డోర్లు ఓపెన్ కాకపోవడంతో వీలుపడలేదు. ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, ఆత్మకూరు సీఐ, ఎస్‌ఐ, ఏఎస్‌పేట, చేజర్ల ఎస్‌ఐలు కూడా అక్కడకు చేరుకున్నారు. ఇరుక్కున వాహనాలను రెండు క్రేన్‌లు, ఒక ఎక్స్‌కవేటర్‌తో తీసేందుకు 2 గంటల సమయం పట్టింది. మృతదేహాలను ఒక్కొక్కటిగా బయటకు తీసి ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు.



ఘటనాస్థలిలో రోడ్డుపై మృతదేహాలు

● మృతుల వివరాలు తెలియక...

కారులో ఉన్న వారి వివరాలు తెలియక పోలీసులు ఇబ్బందులు పడ్డారు. కనీసం మృతుల ఫోన్లు కూడా కనిపించక ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు ఒక ఫోన్ బయటకు తీస్తే అది పని చేయలేదు. మరో మొబైల్‌లో సిమ్ వేసి మృతుల బంధువులకు సమాచారం అందజేశారు.

● మిన్నంటిన ఆర్తనాదాలు

సమాచారం అందుకున్న మృతుల బంధువులు వెంటనే సంఘటన స్థలానికి వచ్చి బోరున విలపించారు. వారిని సమాదాయించడం ఎవరితరం కాలేదు. అప్పటికే వైద్యశాలకు తరిలించిన మృతదేహాల కోసం ఆత్మకూరుకు తరలివెళ్లారు.

అయ్యో పాపం శ్యాం!

- ఏడాది క్రితం అక్క ఇప్పుడు తల్లిదండ్రుల మృతి



అనాథగా మిగిలిన తాళ్లూరు శ్యాం



మృతురాలు రాధ (ఫైల్)

ఈ బాలుడిపేరు తాళ్లూరు శ్యాం. వయసు 11 ఏళ్లు. నెల్లూరురూరల్‌లోని కొరివారి కండ్రికకు చెందిన దంపతులు తాళ్లూరు శ్రీనివాసులు, రాధలు బాలాజీనగర్‌లో టిఫిన్ దుకాణం నడుపుతున్నారు. సొంత ఇల్లు కొనుకున్న వీరు నెల రోజుల క్రితం ఓ కారు కూడా కొనుగోలు చేశారు. ఈ దంపతులుకు శ్యాంతోపాటు మెర్సీ (13) అనే కుమార్తె కూడా ఉంది. అయితే, ఏడాది క్రితం మెర్సీ మృతి చెందింది. ఉన్న ఒక్కగానొక్క కుమారుడిని ధనలక్ష్మీపురంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో 6వ తరగతి చదివిస్తున్నారు. బుధవారం ఉదయం శ్రీనివాసులు, రాధ కారులో బయలుదేరుతూ పక్కింటి వారికి తమ కుమారుడు వస్తే జాగ్రత్తగా చూసుకోమని చెప్పారు. పెరమన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులిద్దరూ మృత్యువాత పడ్డారు. తల్లిదండ్రులను, అక్కను కోల్పోయి శ్యాం అనాథగా మిగిలాడు. విషయం తెలుసుకున్న అమ్మమ్మ వాళ్లు ఆ బాలుడ్ని తీసుకెళ్లారు. అభం, శుభం తెలియని శ్యాం ఏం పాపం చేశాడని దేవుడు ఇంత పెద్ద శిక్ష వేశాడంటూ కొరివారికండ్రిక వాసులు కన్నీరుమున్నీరవుతున్నారు.

- నెల్లూరు రూరల్

ఆ ఇంట తీవ్ర విషాదం



శ్రీనివాసులు, లక్ష్మి దంపతులు (ఫైల్)

చల్లగుండ్ల శ్రీనివాసులు (48), చల్లగుండ్ల లక్ష్మి (40)లది ఇందుకూరుపేట అరుంధతివాడ. శ్రీనివాసులు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉండగా, కుమార్తె చంద్రప్రియ పదో తరగతి, కుమారుడు విశ్వంత్ ఏడో తరగతి చదువుతున్నారు. పెరమన వద్ద జరిగిన ప్రమాదంలో శ్రీనివాసులు, లక్ష్మి మృతి చెందడంతో ఆ పిల్లలు దిక్కులేని వారయ్యారు. అందరితో కలుపుగోలుగా ఉండే ఆ దంపతులు ఇక లేరని తెలియడంతో దళితవాడలో విషాదఛాయలు అలుముకున్నాయి.

- ఇందుకూరుపేట

దోశ శ్రీనివాస్ ఇక లేడా!?



శ్రీనివాస్ (ఫైల్)

నెల్లూరు(క్రైం) : నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలోని శాలివీధిలో ఓ చిన్న టిఫెన్ సెంటర్ పెద్ద ఫేమస్. ఉదయం, సాయంత్రం ఇక్కడున్న శ్యామ్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో అన్ని వర్గాలకు చెందిన వారు టిఫెన్ చేస్తుంటారు. ఇక్కడ దోశ మాస్టర్‌గా ఉండే శ్రీనివాసులు ఎంతో చలాకీగా అందరిని పేరు పెట్టి పిలుస్తూ నవ్వుతూ, నవ్విస్తూ ఉంటాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం టిఫెన్ సెంటర్ వద్దకు వర్కర్లు, కష్టమర్లు చేరుకున్నారు. అయితే, శ్రీనివాసులు, ఆయన భార్య రాధమ్మ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని తెలియడంతో అంతా బాధపడ్డారు. మన దోశ శ్రీనివాస్ ఇక లేడా అంటూ కుమిలిపోయారు.

ఆసుపత్రి వద్ద మిన్నంటిన ఆర్తనాదాలు

ఆత్మకూరు : పెరమన వద్ద జరిగిన ప్రమాదంలో మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. ఈ విషయం తెలుసుకుని బంధువులంతా ఆస్పత్రికి చేరుకుని బోరున విలపించారు. సాయంత్రం 6 గంటల తరువాత పోస్టుమార్టం చేయకూడదనే నిబంధనలు ఉన్నాయి. అయితే, కలెక్టర్ ఆదేశాలతో వైద్యశాల సూపరింటెండెంట్ శేషారత్నం మృతదేహాలను పోస్టుమార్టం చేసేందుకు హుటాహుటిన చర్యలు చేపట్టారు. మరోవైపు మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలంటూ సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేశారు. ఈ క్రమంలో ఏఎస్పీ సౌజన్య వైద్యశాలకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

'సోమశిల' సమాచారం

అనంతసాగరం : సోమశిల డ్యాంకు బుధవారం 12,649 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగింది. నీటి నిల్వ 72.690 టీఎంసీలకు చేరుకుంది. డెల్టాకు పవర్ టెన్నల్ నుంచి 1,450, ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,450 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. వచ్చే వరద తగ్గుముఖం పట్టడంతో గేట్లను కిందకు దించేశారు.



నెల్లూరులో ఐటీ అధికారులు తనిఖీ చేస్తున్నది డీపీ బంగారు దుకాణంలోనే..

నెల్లూరులో ఐటీ దాడులు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని బంగారు దుకాణాల్లో న్యూఢిల్లీ నుంచి వచ్చిన ఐటీ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించడం కలకలం రేగింది. బంగారు దుకాణాలే టార్గెట్‌గా ఐటీ అధికారులు కేంద్ర బలగాలతో తరలివచ్చి సోదాలు చేయడంపై సర్వత్రా ఉత్కంఠ రేపింది. కాపు వీధి, ఆచారివీధిలలో బంగారం, వజ్రాల వ్యాపార సంస్థలైన డీపీ గోల్డు, డీజే గోల్డు షాపులతోపాటు వారి నివాసాల్లో రాత్రి వరకు తనిఖీలు చేశారు. డీటీ గోల్డు యజమాని దిలీప్‌ను, జేటీ గోల్డు యజమాని రమేష్‌లను, వారి సిబ్బంది, కుటుంబసభ్యులను బంగారం, వజ్రాల వ్యాపారంలో లావాదేవీలపై విచారించారు. అంతేగాక వ్యాపార పుస్తకాలు, బిల్లులను విస్తృతంగా తనిఖీ చేస్తున్నట్లు తెలిసింది. వ్యాపారులిద్దరూ సోదరులుకాగా, జీరో వ్యాపారం చేస్తూ పన్నులు సక్రమంగా చెల్లించకపోవడం వల్లే ఆదాయ పన్ను అధికారులు ఈ దాడులు నిర్వహించినట్టు తెలిసింది. ఐటీ దాడుల నేపథ్యంలో మార్వాడీ వ్యాపారులు తమ దుకాణాలను మూసివేశారు.

రెండో విడతలోనూ అంతంతే!

- బార్లకు ఆదరణ కరువు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మద్యం బార్లకు దరఖాస్తు చేసుకునేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. జిల్లాలో 56 బార్లకు నోటిఫికేషన్ విడుదల చేయగా తొలి విడతలో 23 బార్లకు మాత్రమే దరఖాస్తులు అందాయి. దీంతో మిగిలిన 33 బార్లకు ప్రభుత్వం మరో నోటిఫికేషన్ విడుదల చేసింది. అయినా వ్యాపారస్తుల నుంచి ఆదరణ కనిపించలేదు. 33 బార్లకుగాను బుధవారం రాత్రి వరకు 11 బార్లకు మాత్రమే దరఖాస్తులు అందాయి. నెల్లూరులోని 6 బార్లకు 24 దరఖాస్తులు, కావలిలోని మూడు బార్లకు 12, అల్లూరు, బుచ్చి ప్రాంతాల్లోని రెండు బార్లకు 8 దరఖాస్తులు అందాయి. మొత్తం 11 బార్లకు 44 దరఖాస్తులు వచ్చాయి. వీటికి గురువారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లో లక్కీ డిప్ నిర్వహించి బార్లు కేటాయించనున్నారు.

నేడు డీఎస్సీ అభ్యర్థులు గొలగమూడిలో హాజరు కావాలి : డీఈవో

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు గురువారం సాయంత్రం 4 గంటలకు వెంకటాచలం మండలంలోని గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమం వద్ద హాజరై రిపోర్ట్ చేయాలని డీఈవో డాక్టర్ బాలాజీ రావు ఓ ప్రకటనలో సూచించారు. ప్రతీ అభ్యర్థి తప్పనిసరిగా ఆధార్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, కాల్ లెటర్, డీఎస్సీ హాల్‌టికెట్ తోపాటు తమ వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించే వస్తువులతో హాజరు కావాలన్నారు. 19వతేదీ ఉదయం 6 గంటలకు అభ్యర్థులందరూ బస్సుల్లో బయలుదేరి విజయవాడలో జరిగే ముఖ్యమంత్రి కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అక్కడ జరిగే సభలో అభ్యర్థులందరికీ ఉద్యోగ నియామక పత్రాలు అందచేస్తారని పేర్కొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	147
స్కిన్ చికెన్	260
స్కిన్‌లెస్	286

కోడిగుడ్ల ధర (100): 560

ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ

ఉలవపాడు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉలవపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీవీఈవో బీవీ కృష్ణారెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. క్వార్టర్లీ పరీక్ష నిర్వహణ, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. కళాశాలలో పరిస్థితితులను అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకుల సమావేశం నిర్వహించి బోధనాంశాలపై దిశానిర్దేశం చేశారు. ఆయన వెంట జిల్లా ఇంటర్మీడియట్ ఏజీఎంవో సుబ్బారెడ్డి ఉన్నారు.



న్యూస్ బాక్స్

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం

కావలి(టౌన్), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బుడమగుంట నివాసితుడు సుబ్రహ్మణ్యం వైద్య ఖర్చులకు బ్రాహ్మణ మహాసంఘం నేతలు ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం పాతూరులోని చైతన్య జూనియర్ కళాశాల ప్రాంగణంలో బాధితుడి సతీమణికి రూ.12,200 అందజేశారు. సంఘం అధ్యక్షుడు పీవీఎస్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి టీ.శ్రీనివాసులు, అసోసియేట్ ప్రెసిడెండ్ నందనవనం మధుసూదన్‌రావు, వైస్ ప్రెసిడెంట్ రాజేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా, పచ్చిరొట్ట విత్తనాలు

కలిగిరి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు అవసరమైన యూరియా, పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయాధికారి ఎస్‌కే జహీర్ తెలిపారు. బుధవారం మండలంలోని తెల్లపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కలిగిరి, కుడుమలదిన్నెపాడు సొసైటీలలో యూరియా అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో చిరంజీవి, వీపీఏ జ్యోత్స్న పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన

ఉలవపాడు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నవజాత శిశువులకు, గర్భిణులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉండే ఆహారంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు మండలంలోని వీరేపల్లి ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లల తల్లులకు వంటల పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో మాధవిలత, సూపర్‌వైజర్ కే రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మ, కళ్యాణి, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై...

ఉలవపాడు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై వీరేపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు బుధవారం స్థానిక ఎస్సై అంకమ్మ, కందుకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) అనిల్‌కుమార్ అవగాహన సదస్సు నిర్వహించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడుపుట వలన ప్రమాదాలు సంభవిస్తాయని, ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కారు డ్రైవింగ్ సమయంలో తప్పనిసరిగా సీట్ బెల్టు పెట్టుకోవాలన్నారు. ముఖ్యంగా మోడల్ స్కూల్ విద్యార్థులు రోడ్డు దాటే క్రమంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. సింహపురి ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ ప్రాజెక్టు అధికారి అమర్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, విద్యాకమిటీ చైర్మన్ ప్రభాకర్, ఎస్‌ఈఎల్ అధికారులు శ్రీనివాసులు, టోల్ ప్లాజా మేనేజర్ నాగేశ్వరరావు, పీఆర్‌వో నరసింగరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు స్టాఫర్ల బహూకరణ

కావలి, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ఉపయోగపడే విధంగా పోలీస్‌లకు టీడీపీ నాయకులు, మారుతీ షోరూమ్ యజమానులైన గాదంశెట్టి మారతి, సాయిలు రూ.3లక్షలు విలువ చేసే 30 స్టాపర్లను బహూకరించారు. కావలి డీఎస్పీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీధర్‌కు వాటిని అందచేశారు. ఈ కార్యక్రమంలో ఒకటో, రెండో పటణ, రూరల్ సీఐలు ఫిరోజ్‌ఖాన్, గిరిబాబు, రాజేశ్వరరావు, టీడీపీ నాయకులు గుత్తికొండ క్రిషోర్, పోతుగంటి శ్రీకాంత్, చవల రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

బోగోలులో 'స్వస్థ నారీ సశక్త్ పరివార్'

బిట్రగుంట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రవేశపెట్టిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. బోగోలు అరుంధతీవాడ సచివాలయంలో కోవూరుపల్లి ప్రాథమిక వైద్యులు రామకృష్ణ, జిహారికల ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, కావలి డివిజన్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో బ్రిజిత పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఎం.నాగేశ్వరరావు, సీహెచ్.వెంకటేశ్వర్లు, వీ.శ్రీనివాస్‌యాదవ్, ఎన్‌ఎస్‌యాదవ్, గోవిందరాజులు, సీడీపీవో సౌజన్య, సూపర్‌వైజర్లు హైమావతి, సుప్రజ. తదితరులు పాల్గొన్నారు.

● దగదర్తి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు అఖిల్ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత హాజరై మహిళలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అలేఖ్య, ఆరోగ్య సిబ్బంది ఎన్‌కొండారెడ్డి, చంద్రశేఖర్, ఆర్‌వీ.జయమ్మ, గోపి తదితరులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలో

శక్తివంతమైన దేశంగా భారత్

● ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకల్లో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



కేక్ కట్ చేస్తున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

జలదంకి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే ఒక శక్తివంతమైన దేశంగా ఎదుగుతోందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ 75వ జన్మదినం సందర్భంగా బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో బుధవారం జలదంకి బస్టాండు కూడలిలో జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి అభిమానులకు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక, సాంకేతిక, వ్యవసాయం, రక్షణ రంగాలలో ప్రధాని చేసిన కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. రాష్ట్రం ఎన్డీఏ ప్రభుత్వంలో ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి మోదీ సహాయసహకారాలు పుష్కలంగా ఉన్నాయని కొనియాడారు. అనంతరం రక్తదానం చేసిన బీజేపీ నేతలు, యువతను ఎమ్మెల్యే అభినందించి షీల్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా,రాష్ట్ర నాయకులు బ్రహ్మారెడ్డి, తిరుపతిరెడ్డి, కమల, శ్రీనాథ్‌రెడ్డి, టీడీపీ నాయకులు మధురెడ్డి, భాస్కర్‌రెడ్డి, తిరుమలరెడ్డి, జనసేన నాయకులు తోట మురళీ, నిమ్మలపల్లి రామ్‌చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎంతోకాలంగా గ్రామాల్లో పాడిపశువుల ఆరోగ్యం కోసం కృషి చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని మండలంలోని గోపాలమిత్రలు బుధవారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. జనసేన నియోజకవర్గ పీవోసీ కొట్టే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గోపాలమిత్రలు కే.శ్రీనివాసులు, టీ.శ్రీనివాసులు, బీ.ఆనందరావు తదితరులు ఎమ్మెల్యేకు వారి సమస్యలు విన్నవించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి, యువనేత నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ● ముక్తేశ్వరంలో 35 ఎస్సీ కుటుంబాలు టీడీపీలో చేరిక



ముక్తేశ్వరం ఆదిఆంధ్ర కాలనీలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీకి చెందిన దళితులు

లింగసముద్రం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వం ధ్యేయమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చెప్పారు. బుధవారం మండలంలోని మాలకొండరాయుని పాలెం పంచాయతీ పరిధిలోని ముక్తేశ్వరం ఆది ఆంధ్ర కాలనీలోని 35 ఎస్సీ కుటుంబాలకు చెందిన వారు ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీలో చేరిన వైసీపీకి చెందిన గౌడపేరు రత్నం, బాలయ్య, కొండయ్య, ఏసేబు, కోటేశు, డొక్కా ఆదాము, ఆనందరావు, ఎమినేష్, సునీత, నిర్మల, శ్రావణి తదితరులకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీ నాయకులు ఎమ్మెల్యే నాగేశ్వరరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పూరిమిట్ల గురునాథం, నాయకులు మాధవరపు వెంకట్రావు, గోచిపాతల మోషే, పొంకం బ్రహ్మయ్య, ఎం రమణయ్య, సీహెచ్ మాలకొండయ్య, ఎన్ బాలకృష్ణ, కె మనోజ్, ఎన్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

● సొసైటీ అభివృద్ధికి సహకారం

వలేటివారిపాలెం : వలేటివారిపాలెం సొసైటీ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తానని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. వలేటివారిపాలెంలో సొసైటీ అధ్యక్షుడు గుత్తా మహేశ్వరరావు ప్రమాణ స్వీకారోత్సవానికి బుధవారం ఎమ్మెల్యే నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వలేటివారిపాలెంను తమ సొంత గ్రామంగా భావించి అభివృద్ధికి తోడ్పాటునందిస్తానని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి వాటర్‌ప్లాంటు అందించేందుకు ముందుకు వచ్చిన గుత్తా వాసుబాబుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం నూతన సొసైటీ అధ్యక్షుడు గుత్తా మహేశ్వరరావును ఎమ్మెల్యే నాగేశ్వరరావు శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో టుబాకోబోర్డు ఉపాధ్యక్షుడు గుత్తా వాసుబాబు, టీడీపీ నాయకులు చాల్లా శ్రీనివాసులు, వలేటి నరసింహం, పొన్నగంటి రామయ్య, వైద్యాధికారి శివసిద్ధప్ప, పరిటాల భాస్కర్‌రావు, సాధు శ్రీలత, గుత్తా కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

● సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

● **కందుకూరు:** స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం 30 మంది లబ్ధిదారులకు రూ.16.14 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, మాదాల లక్ష్మీనరసింహం, జనిగర్ల నాగరాజు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, పూరిమిట్ల గురునాథం తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యేను కలిసిన దేవళ్ల

వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన జనసేన నాయకుడు దేవళ్ల భాస్కరరావు ఎమ్మెల్యే నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట జనసేన నాయకులు కొణిదెల శ్రీను, మూలగిరి శ్రీనివాసులు, అయ్యప్ప, ఏ.శ్రీను ఉన్నారు.

● మాలకొండ ఆలయానికి కంప్యూటర్ల బహూకరణ

పవిత్ర పుణ్యక్షేత్రమైన మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి యూనియన్ బ్యాంకు తమ సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా రెండు కంప్యూటర్లు, నగదు కౌంటింగ్ మెషీన్‌ను బహూకరించింది. యూనియన్ బ్యాంకు డీజీఎం రవికుమార్, ఏజీఎం శ్రీనివాస్, సీనియర్ మేనేజర్లు సురేష్‌రెడ్డి, హరికృష్ణ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు చేతులమీదుగా వీటిని ఆలయ అధికారులకు అందించారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి చెన్నకేశవులు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : అధికారులు ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, జిల్లాల్లోనే ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ చెన్నకేశవులు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పలువురు సభ్యులు వివిధ సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. అన్నింటిని పరిశీలించి పరిష్కరించాలని ప్రత్యేక అధికారి మండల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేంద్రదేవ్, ఏవో శేషారెడ్డి, వైద్యాధికారి శివసిద్ధప్ప, ఎంఈవో మాల్యాద్రిరెడ్డి, ఈవోఆర్డీ నారాయణరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నాయబ్‌రసూల్, డిప్యూటీ తహసీల్దారు మధుసూధన్‌రావు, సీడీపీవో ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న డాక్టర్లు అనూష, ప్రమీల, బీజేపీ నేతలు

కావలి(టౌన్), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన సేవా పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం 1వ పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో ఏరియా వైద్యశాలలో రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనూష, ఆర్ఎంవో ప్రమీల, నేతలు కంచర్ల మురళీకృష్ణ నాయుడు, బ్రహ్మానందం, అమరా సుబ్బారావు, పరుసు వెంకటేశ్వర్లు, బీ మాల్యాద్రి, సీవీసీ సత్యం, మామిడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే రెండవ పట్టణ కమిటీ అధ్యక్షుడు భాస్కర్ ఆధ్వర్యంలో వెంగళరావునగర్ గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి కందుకూరి సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ మాల్యాద్రి, పొన్నగంటి మురళి, కమల, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం

ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించుకుని విట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు రక్తదానం చేశారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ మధుకర్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ప్రత్యూషా రెడ్డిలు రక్తదాతలకు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్‌కుమార్, ఏవో రామకృష్ణ, రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, వైఎస్ చైర్మన్ హరినారపరెడ్డి, విట్స్ అధ్యాపకులు డాక్టర్ రజ్వీ, ప్రవీణ్‌కుమార్, మహేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీకి శ్రీకారం

● కొత్త మిషన్లు ప్రారంభించిన మున్సిపల్ కమిషనర్



విండ్రో కంపోస్ట్ తయారీ మిషన్లను ప్రారంభిస్తున్న కమిషనర్

కావలి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీకి విండ్రో కంపోస్ట్ తయారీ నిమిత్తం నూతనంగా చాపింగ్ మిషన్, సీవింగ్ మిషన్లను గురువారం కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్ కుమార్ ప్రారంభించారు. కావలి పట్టణం ఉత్తర శివార్లలో ఉన్న కంపోస్ట్ యార్డులో విండ్రో కంపోస్ట్ తయారీకి శ్రీకారం చుట్టినట్లు కమిషనర్ తెలిపారు. ఇక చెత్త నుంచి సంపద తయారీకి చెత్తపై సమరం కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి దానిని కంపోస్ట్ యార్డ్‌కు చేర్చి సంపద తయారీ చేస్తామన్నారు. ఇక కంపోస్ట్ యార్డులలో చెత్త నిల్వలు పేరుకుపోయేదానికి అవకాశం లేదన్నారు. తడి చెత్తను సేంద్రీయ ఎరువుగా తయారు చేసి నర్సరీలు, తోటలు పెంపకం, రైతులకు విక్రయిస్తామన్నారు. పొడి చెత్తను వేరుచేసి ఫ్యాక్టరీలకు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్, టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్, రమణయ్య, కాటా భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్టీవో



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్టీవో మురళీధర్

కావలి రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కావలి ఆర్టీవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పీ.మురళీధర్ ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డిని బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు తగు భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ సుదర్‌రావు, అసిస్టెంట్ ఎంవీఐ కరుణాకర్ పాల్గొన్నారు.

డ్రైవర్లకు అవగాహన

మంచి ప్రదాత చట్టంపై డ్రైవర్లు అవగాహనతో ఉండాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్. సుందర్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డు ఆటో స్టాండ్‌లో మంచి ప్రదాత చట్టం, రహదారి భద్రత నియమాలపై బుధవారం ఆటో డ్రైవర్లకు ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవీఐలు కరుణాకర్, లక్ష్మీ భాయ్, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి దూషిస్తున్నారని ప్రశ్నిస్తే మాపైనే కేసులా?

● పోలీసులపై దగదర్తి కొత్త దళితవాడ వాసుల ఆవేదన

కావలి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండల కేంద్రంలో ఉన్న కొత్త దళితవాడకు ఎదురుగా ఉన్న బీమాస్ దాబా హోటల్ వద్ద మద్యం సేవించి అటువైపు రాక పోకలు సాగిస్తున్న మాపై కొందరు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని దాబా హోటల్ వారిని ప్రశ్నించినందుకు మాపైనే కేసులు పెట్టారని దళితవాడ వాసులు ఆరోపించారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో భీమ్‌భారత్ సైనిక్స్ అధ్యక్షుడు పోలవరపు కార్తికేయ, దళితనేతలు జువ్విగుంట లక్ష్మణరావు, మోడి సుజాతలు మాట్లాడారు. దాబా హోటల్‌లో మద్యం సేవించిన వారు కులం పేరుతో దూషిస్తున్నారని, దాబా నిర్వాహకుడు వడ్డే వినయ్, కడియాల సురేష్‌ను అడిగేందుకు వెళ్లగా వారు తమపైకి దౌర్జన్యకి వచ్చారని దగదర్తి పోలీస్ స్టేషన్‌లో కేసులు పెట్టారన్నారు. తమను కులం పేరుతో దూషిస్తున్నారని తాము పోలీస్‌లకు చేసిన ఫిర్యాదును పోలీస్‌లు పట్టించుకోకుండా తమపైనే చదువుకునే యువకులతో సహా కేసులు పెట్టి ఎస్‌ఐ జంపాని కుమార్ వేధిస్తున్నారన్నారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీని కలవగా ఆయన కావలి డీఎస్పీకి సమస్యను పరిష్కరించాలని చెప్పారన్నారు. అయితే డీఎస్పీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దళితులకు న్యాయం చేయకపోతే తాము ఆందోళన చేయాల్సి వస్తోందని చెప్పారు.

వ్యాక్సిన్‌తో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ

కావలి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): బాలలకు వ్యాక్సిన్ వేయించడం ద్వారా ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని వెంగళరావునగర్ అర్బన్‌హెల్త్‌సెంటర్ డాక్టర్ మహేష్ తెలిపారు. వెంగళరావునగర్ అర్బన్‌హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో డాక్టర్ రామ్‌సెంటర్, విశ్వోదయ సహకారంతో పట్టణంలోని బుడంగుంట ఎస్సీకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలలకు వ్యాక్సినేషన్, ఆరోగ్య అవగాహన కార్యక్రమం జరిగింది. అనంతరం డాక్టర్ రామ్‌సెంటర్ వారు గర్భిణులకు ఐరన్, పోలిక్, కాల్సియం సిరప్‌లు, బాలలకు మల్టీవిటమిన్ల సిరప్‌లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో రామ్‌సెంటర్ బాధ్యులు మనోహర్‌రెడ్డి, కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, ఆరోగ్యకేంద్రం సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదాతలకు సబ్‌కలెక్టరు, డీఎస్పీ అభినందన



రక్తదాతకు నివాళులర్పిస్తున్న సబ్ కలెక్టరు హిమవంశీ, డీఎస్పీ, తదితరులు

కందుకూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కందుకూరు ప్రాంత రక్తదాతల సమూహం 9వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం రక్తదానశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించిన కందుకూరు సబ్ కలెక్టరు దామెర హిమవంశీ, డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యంలు రక్తదాతలను అభినందించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అరుదైన ఏ బీ నెగెటివ్ గ్రూప్ రక్తదాత నత్తా భానుకిరణ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కందుకూరు సీఐ అన్వర్ బాషా, సక్షమ్ ప్రతినిధి చెన్నా రామాంజనేయులు, సక్షమ్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు, అధికసంఖ్యలో రక్తదాతలు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థుల రక్తదానం

స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల విజయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం చేపట్టిన రక్తదాన్ అమృత్ మహోత్సవ్ 2.0 కార్యక్రమంలో భాగంగా ఈ రక్తదానశిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టరు సీహెచ్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పీ.ఏడుకొండలు, వైస్‌ప్రిన్సిపాల్ హరిబాబు, ఏరియా హాస్పిటల్ వైద్యుడు డాక్టరు పీ.విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో...

రక్తదాన్ అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా కందుకూరు ఏరియా హాస్పటల్ బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదానశిబిరం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ ఆధ్వర్యంలో 25మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన అధ్యాపకులకు ఏరియా ఆసుపత్రి డాక్టరు హరిచందన కృతజ్ఞతలు తెలిపారు.

ముర్రుపాలు బిడ్డకు అమృతం : సీడీపీవో

వలేటివారిపాలెం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : పుట్టిన బిడ్డకు ముర్రుపాలు అమృతంతో సమానమని కందుకూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఉషారాణి తెలిపారు. మండలంలోని అత్తింటివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం 8వ రాష్ట్రీయ పోషణ మహ కార్యక్రమం జరిగింది. అనంతరం తల్లులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సునీత, రబీనా పాల్గొన్నారు.

మండలంలో చిరుజల్లులు

కొండాపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో బుధవారం చిరుజల్లులతో వర్షం కురిసింది. కొద్ది రోజులుగా తీవ్రమైన ఎండల కారణంగా ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వాతావరణం చల్లబడడంతో ఊపిరి పీల్చుకున్నారు.

రక్తదాన అమృత్ మహోత్సవాలను జయప్రదం చేయండి

కావలి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రక్తదాన అమృత్ మహోత్సవాలను జయప్రదం చేయాలని కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక రెడ్‌క్రాస్ భవనంలో రక్తదాన అమృత్ మహోత్సవాలను ప్రారంభించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినంను పురస్కరించుకుని సెప్టెంబరు 17 నుంచి మహాత్మాగాంధీ జయంతి అక్టోబరు 2 వరకు రక్తదాన అమృత్‌మహోత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా టీ షర్టులనుఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు డీ. రవిప్రకాష్, కే. హరినారపరెడ్డి, డాక్టర్ పాముూరు శ్రీధర్, ఓరుగంటి వెంకటేశ్వర్లు, బెజవాడ ప్రసన్నకుమార్, గాదిరెడ్డి హరనాథ్, బీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

మండలస్థాయి క్రీడాకారుల ఎంపిక

జలదంకి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 17 ఏళ్ల లోపు మండలస్థాయి క్రీడాకారుల ఎంపికకు బాలబాలికలకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. మండలంలోని ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నారు. వాలీబాల్, షాట్‌ఫుట్, చెస్ తదితర క్రీడలను హైస్కూల్ పీడీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని మండలస్థాయి క్రీడాకారులుగా ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయిలో పోటీల్లో పాల్గొననున్నారు. పోటీలను ఎంఈవోలు పద్మనాభరావు, నాగేశ్వరరావుల పర్యవేక్షించారు.

బీజేపీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

బిట్రగుంట, సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): బోగోలు మండలంలో ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజు సందర్భంగా బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు వీరాల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బోగోలులోని విజయగణపతి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వ హించారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ముంగమూరు జాతీయ రహదారి వద్ద ఉన్న భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీలో పండ్లు, రొట్టెలు, పౌష్టికా హారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, నేతలు జీ.వెంకటేశ్వర్లు, గోపీకృష్ణయాదవ్, టీ.బాలసుబ్రహ్మణ్యం, గోవిందరాజులు, వెంకటరమణయ్య, సురేష్ పాల్గొన్నారు.

కొద్ది పాటి వర్షానికే రోడ్డెక్కిన వర్షపు నీరు

కావలి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పూడికతో మూసుకు పోతున్న కాలువలు, తూములు, ఆక్రమణలతో కుదించుకుపోతున్న రోడ్ల కారణంగా కొద్దిపాటి వర్షం పడినా కావలిలో వర్షపునీటితో పాటు డ్రైనేజీ నీరు రోడ్డెక్కి పారుతోంది. పట్టణంలో బుధవారం మధ్యాహ్నం కురిసిన కొద్ది పాటి వర్షానికే అనేక చోట్ల రోడ్లపైకి వర్షపు నీరు చేరింది. వెంగళరావునగర్‌లో రెండో పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో కావలి-దుత్తలూరు హైవే రోడ్డుపై వర్షపునీరు నిలిచి చెరువును తలపించింది. కాలువ పూర్తిగా పూడి పోవడం, రోడ్డు మార్జిన్ ఆక్రమణలకు గురికావడంతో నీరు పోయే మార్గంలేక రోడ్డుపైనే నిలిచింది.

విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలి



ఆర్డీవోకి వినతిపత్రం ఇస్తున్న బుడంగుంట దళితులు

కావలి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుడంగుంట దళితకాలనీలో అక్రమంగా తొలగించిన విద్యుత్‌ను వెంటనే పునుద్ధరించాలని దళితులు బుధవారం కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణకు విన్నవించారు. వారు మాట్లాడుతూ దళితులమనే భావంతో తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విద్యుత్ సిబ్బంది మూకుమ్మడిగా వచ్చి ఇళ్లలోని మీటర్లను స్తంభాలకు ఉన్న సర్వీస్ వైర్లను తొలగించి కాలనీ వాసులను అంధకారంలో ఉంచటంపై మానవహక్కులు, ఎస్సీ ఎస్టీ కమిషన్లకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఉచిత విద్యుత్ బిల్లుల యూనిట్లపై అవగాహన కల్పించకుండా బిల్లులు పేరుకుపోయే వరకు పట్టించుకోకుండా వేలకు వేలు బిల్లులు పెరిగిన తర్వాత ఒక్కసారి కట్టమంటే ఎలా సాధ్యపడుతోందన్నారు. వాయిదాల పద్ధతిలో బిల్లులు చెల్లించుకునే విధంగా అవకాశం కల్పించి తొలగించిన విద్యుత్ సరఫరాను వెంటనే పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకుడు కరువది భాస్కర్, దళితనేతలు అశోక్, లోకేష్, సాల్మన్, శివ, గణేష్, మనోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకంలో మెలకువలు పాటించాలి

అల్లూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : చేపల పెంపకంలో రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించి ఆదాయాన్ని గడించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శ్రీహరి సాదు, డాక్టర్ ఎస్.లోకేష్‌లు అన్నారు. బుధవారం అల్లూరులోని పలు ప్రాంతాల్లో చేపల చెరువులను పరిశీలించారు. అనంతరం వరిసాగు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



హ్యాపీ బర్త్‌డే పీఎం

ఆకుపై రూపుతో శుభాకాంక్షలు

మనుబోలు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా బుధవారం సూక్ష్మకళాకారు డు సోమా పద్మారత్నం రావి ఆకుపై ఆయన రూపాన్ని గీసి శుభాకాంక్షలు తెలియజేశారు.

'ఆంధ్ర యువ సంకల్ప్'కు పేర్లు నమోదు చేసుకోండి

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువతను భాగస్వాములను చేస్తూ నిర్వహించే ఆంధ్ర యువ సంకల్ప్-2025 రాయబారి డిజిటల్ మారథాన్ కార్యక్రమానికి యువత తమపేర్లను ఈనెల 30లోపు నమోదు చేసుకోవాలని సెట్నల్ సీఈవో నాగేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వికసిత్ భారత్-2047కు లక్ష్యాలకు అనుగుణంగా సామాజిక బాధ్యత, కుటుంబ సంబంధాలు, ఆరోగ్యకరమైన జీవనం, బాధ్యతాయుతమైన డిజిటల్ ఆవిష్కరణల విలువలను ప్రోత్సహించడానికి ఐక్యరాజ్యసమితి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల నుంచి ఈ థీమ్ తీసుకున్నారన్నారు. దీనిలో పాల్గొనే యువత 18-35 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలని తెలిపారు. www.andhrayuvasankalp.com వెబ్‌సైట్‌లో రిజిస్టర్ కావాలన్నారు. వీరు తయారు చేసిన 120 సెకన్ల నిడివి కలిగిన వీడియోలను అధికారిక హాష్‌ట్యాగ్‌లతో సొంత సోషల్ మీడియాలో మార్గదర్శకాల్లో చెప్పిన విధంగా పోస్ట్ చేయాలని సూచించారు. వాటిని జ్యూరీ పరిశీలించి విజేతలను ఎంపిక చేస్తుందని తెలిపారు. ప్రథమ బహుమతి లక్ష రూపాయలు, ద్వితీయ బహుమతి రూ.75 వేలు, తృతీయ బహుమతి 50వేలు అందిస్తారని పేర్కొన్నారు. అలాగే 9 మంది విజేతలను ఆంధ్ర యువత బ్రాండ్ అంబాసిడర్లుగా సత్కరిస్తారని, అందరికీ సర్టిఫికెట్లు అందచేస్తారని వివరించారు. జిల్లా నుంచి ఎక్కువ సంఖ్యలో యువత దీనిలో భాగస్వాములు కావాలని కోరారు.

కొనసాగిన పెన్‌డౌన్!

- సమ్మె ఆపండి : అధికారి సూచన
- డిమాండ్లు నెరవేర్చే వరకు ఆపం
- స్పష్టం చేసిన దస్తావేజు లేఖర్ల నాయకులు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వం రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో లోపాలు సరిచేయాలని డిమాండ్ చేస్తూ పెన్ డౌన్ పేరుతో దస్తావేజు లేఖరులు చేపట్టిన సమ్మె బుధవారం మూడో రోజు కొనసాగింది. బుధవారం ఏకదశి తిథి మంచి రోజు కావటంతో రిజిస్ట్రేషన్లు ఎక్కువగా జరుగుతాయని భావించారు. కానీ లేఖరుల సమ్మెతో కార్యాలయాలు వెలవెలబోయాయి. సమ్మెను విరమించి దస్తావేజుల రిజిస్ట్రేషన్లు చేయించాలని జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ ఐ విజయరాణి సూచించినా, తమ డిమాండ్లు నెరవేర్చే వరకు పెన్ డౌన్ కొనసాగిస్తామని లేఖర్ల సంఘం నాయకులు స్పష్టం చేశారు. శుక్ర, శనివారాల్లో రాష్ట్ర నాయకత్వం సమ్మెకు పిలుపునిచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా దస్తావేజుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పట్నం దుర్గేష్‌బాబు, నెల్లూరు సిటీ అధ్యక్షుడు జేవీబీ అశోక్, నాయకులు పంచాజ్ఞుల పవన్‌కుమార్, ములుమూడి సురేష్‌బాబు, ఎండీ జమీరుద్దీన్, పూనం మాలకొండయ్య, ఎండీ మజహరుద్దీన్, కలిశెట్టి మల్లికార్జున, ములుమూడి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పెన్‌డౌన్ విరమించాలని దస్తావేజు లేఖర్ల సంఘ నాయకులకు సూచిస్తున్న జాయింట్ సబ్ రిజిస్ట్రార్ విజయరాణి



సమాచార శాఖ డీడీ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పీ వేణుగోపాల్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అదే శాఖలో సత్యసాయి జిల్లా ఏడీగా పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై డీడీగా నెల్లూరుకు వచ్చారు.



చెట్లకింద భోజనం చేస్తున్న క్రీడాకారులు

ఈ ఎంపికలు ఎవరి కోసం!

- భారత్ బేస్‌బాల్ జట్టుకు నెల్లూరులో ఎంపికలు
- 2 రోజులుగా రహస్యంగా ప్రక్రియ
- గుర్తింపులేని బేస్‌బాల్ సంఘం నిర్వాకం

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : భారత ఒలంపిక్ సంఘం, ఇండియన్ బేస్‌బాల్ ఫెడరేషన్, శాయ్, శాప్ ఇలా ఎందులోనూ గుర్తింపు లేకుండా కొన్నేళ్లుగా వివాదాల్లో నడుస్తున్న బేస్‌బాల్ క్రీడా సంఘం పేరుతో జిల్లాలో వ్యాయామ ఉపాధ్యాయుడు చేస్తున్న దందాలు, అక్రమాలు చర్చనీయాంశంగా మారాయి. నవలాకుల గార్డెన్స్‌లో ప్రస్తుతం వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఉంటూనే వింజమూరు ప్రాంతంలో అనధికారి ఎంపీఈడీ, బీపీఈడీ కళాశాల నిర్వహిస్తూ గుర్తింపు లేని క్రీడా సంఘాల పేరుతో అనధికార క్రీడా ఎంపికలను నిర్వహిస్తూ లక్షలాది రూపాయలను వసూలున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలోనూ టగ్ ఆఫ్ వార్, త్రోబాల్, లెవన్ క్రికెట్‌ల పేరుతో భారత జట్టు ఎంపికలను వింజమూరులోనే నిర్వహించి ఎంతోమంది క్రీడాకారులను మోసం చేసిన ఘటనలు వెలుగు చూస్తున్నాయి. పలు దేశాల్లో ప్రైవేట్ క్లబ్స్ పోటీలకు, ప్రైవేట్ సంస్థలు నిర్వహించే పోటీలకు ఎంపిక చేసిన క్రీడాకారులను తీసుకువెళుతూ భారత జట్టుకు ఆడించినట్లు చూపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే, క్రీడాకారులకు మాత్రం ఇవేమీ తెలియకుండా జాగ్రత్తపడుతూ వారి నుంచి రూ.లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఆయా దేశాల్లో పొందిన సర్టిఫికెట్లు ఇక్కడ ఎలాంటి విద్యాప్రవేశాలకు, ఉద్యోగాలకు అర్హత లేవన్న విషయాన్ని వారు దరఖాస్తు చేసుకున్న తరువాత బయటపడిన సంఘటలు వెలుగు చూశాయి. దీంతో బాధిత క్రీడాకారులు కేసులు పెట్టడం, కోర్టులను ఆశ్రయించడంతో పలు కేసులు న్యాయస్థానాల్లో నడుస్తున్నట్లు క్రీడాకారులు తెలిపారు.

నెల్లూరులో ఎంపికలు...

నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మంగళ, బుధవారాల్లో ఎవరికీ తెలియకుండా బేస్‌బాల్ భారతజట్టు ఎంపికలను నిర్వహించారు. చైనాలో జరిగే ఏషియా పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని నమ్మబలుకుతూ పలు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులకు నెల్లూరులో ఎంపికలు నిర్వహించడం ఆశ్చర్యానికి, అనుమానాలకు తావిస్తోంది. జిల్లా, రాష్ట్రస్థాయి ఎంపికలే అన్నీ అనుమతులు తీసుకుని సందడి వాతావరణంలో నిర్వహిస్తుండగా, భారత జట్టు ఎంపికలు మాత్రం అత్యంత గోప్యంగా నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై డీఎస్‌ఏ అధికారులను ప్రశ్నించగా ఈ ఎంపికలకు తమకు ఎలాంటి సంబంధం లేదని, సాధారణంగా క్రీడల నిర్వహణకు స్టేడియంకు నగదు చెల్లించి మైదానాన్ని రెండు రోజులు లీజ్‌కు తీసుకున్నారని తెలిపారు. దీనిపై సంబంధిత వ్యక్తిని సంప్రదించేందుకు ప్రయత్నించగా తాను ఎవరికీ వివరాలు చెప్పాల్సిన అవసరం లేదని, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులే తనకు అండగా ఉన్నారని చెప్పి తప్పించుకోవడం విశేషం. ఇప్పటికైనా రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులు ఈ అక్రమాలపై విచారణ జరిపి క్రీడాకారులకు న్యాయం చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు కోరుతున్నారు..

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలు

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో బుధవారం అండర్-14, 17 బాల, బాలికల రెజ్లింగ్ క్రీడాజట్ల ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి హాజరైన క్రీడాకారులకు పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని ఆయా విభాగాలకు ఎంపిక చేసినట్లు క్రీడా సమాఖ్య కార్యదర్శులు బీవీ రమణయ్య, డాక్టర్ ఎం దేవిక తెలిపారు. అలాగే, కావలిలోని విశ్వోదయ పాఠశాలలో బాల,బాలికలకు స్విమ్మింగ్ పోటీలు నిర్వహించి జిల్లా జట్లు ఎంపిక చేశామన్నారు. గురువారం కావలిలోని పాత మనిసిపల్ ఉన్నత పాఠశాలలో మాల్‌కంబ్, సైక్లింగ్ పోటీలు నిర్వహిస్తామని, వీటి విజయవంతానికి పీఈటీలు, పీడీలు చొరవచూపాలని కోరారు.

పూర్తిస్థాయిల్లో దర్యాప్తు చేయిస్తాం : ఎస్పీ

పెరమన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తా మని ఎస్పీ అజిత వేజండ్ల పేర్కొన్నారు. విజయవాడలో ఉన్న ఆమె రోడ్డు ప్రమాదం విషయం తెలుసుకుని హుటా హుటిన పెరమనకు చేరుకున్నారు. సీఐ వేమారెడ్డి ప్రమాద జరిగిన ఘటనను ఎస్పీకి వివరించారు. అనంతరం ఆత్మ కూరు వైద్యశాలకు వెళ్లి మృతదేహాలను పరిశీలించి మృతుల బంధు వులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. (ం ఎస్పీ మాట్లాడుతూ ప్రమాదానికి కారణమైన టిప్పర్, డ్రైవర్ పోలీసుల అదుపులో ఉన్నట్లు చెప్పారు. విచారణ అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అంతేగాక ఇసుక రవాణా అనుమతులపైనా విచారి స్తామని చెప్పారు.

దుప్పిని చంపిన స్మగ్లర్ అరెస్ట్

నెల్లూరు(వెంకటేశ్వరపురం) : అడవిలో తిరుగుతున్న చుక్కల దుప్పిని వేటాడి చంపిన స్మగ్లర్‌ను నెల్లూరు అటవీశాఖ అధికారులు బుధవారం అరెస్ట్ చేశారు. నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల ఎస్టీ కాలనీకి చెందిన నంటూరి నాగయ్య మట్టెంపాడు అటవీ ప్రాంతంలో తిరుగుతున్న చుక్కల దుప్పిని చంపి దాని మాంసాన్ని పలు ప్రాంతాల్లో విక్రయించాడు. ఈ సమాచారం తెలుసుకొన్న నెల్లూరు అటవీ రేంజర్ మాల్యాద్రి ఆదేశాల మేరకు సెక్షన్ అధికారి శ్రీనివాసులు, బీట్ అధికారి మనోజ్ కలిసి నాగయ్యను అరెస్ట్ చేశారు. దుప్పి మాంసం, కొమ్ములను స్వాధీనం చేసుకున్నారు.

సాల్ట్ పథకాన్ని రద్దు చేయాలి

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ బ్యాంకు షరతులతో కూడిన సాల్ట్ పథకాన్ని రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రణభేరి ప్రచార యాత్రలో భాగంగా బుధవారం జిల్లాలోని పొదలకూరు మీదుగా నెల్లూరులోకి ప్రవేశించిన నాయకులు బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రభుత్వ బడులను కుదించి ప్రపంచ బ్యాంకు షరతులకు లోబడి రాష్ట్రంలో పాఠశాలలను నడుపుతుండటంతో పేద పిల్లలు విద్యకు దూరమవుతున్నారని చెప్పారు. ఆ పథకాన్ని రద్దు చేయాలని, ఉద్యోగులకు 12వ పీఆర్‌సీ కమిషన్ నియమించి 30శాతం ఐఆర్ ప్రకటించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతూనే ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్ నవకోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు వీవీ శేషులు, ప్రధాన కార్యదర్శి జీవీ చలపతిశర్మ, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎంసీ అచ్చయ్య, కోశాధికారి మురళీధర్‌రావు, కార్యదర్శులు ఈ బాలరాగయ్య, నాగిరెడ్డి, ఖాజావలి, సురేంద్రబాబు, మధుసూదన్‌రావు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రణభేరి యాత్రకు స్వాగతం పలుకుతున్న యూటీఎఫ్ నాయకులు

నాడి పట్టి.. గజ్జె కట్టి..!

నాట్యంలో మెరుస్తున్న యశశ్రీ వీణ

ఒకరు ఇటు చదువు, అటు నాట్యం, చిత్ర లేఖనం, సంగీతంలో రాణించడం అంటే అసాధరణం. కావలికి చెందిన యశశ్రీ వీణ ఈ నాలుగింటిలోనూ ప్రతిభ కనబరుస్తూ అందరినోట ఔరా అనిపించుకుంటోంది.

- సంగీతం, చిత్రలేఖనంలోనూ అద్భుత ప్రతిభ

కావలి (టౌన్), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సివిల్ ఇంజనీర్ అళహరి శ్రీనివాసులు, త్రివేణి దంపతుల కుమార్తె యశశ్రీ వీణ చిత్తూరులోని అపోలో వైద్య కళాశాలలో మెడిసిన్ మూడవ సంవత్సరం చదువుతోంది. డాక్టర్ కావాలనుకున్న కలను నెరవేర్చుకునేందుకు శ్రమిస్తోంది. మరో రెండు సంవత్సరాలలో వైద్యురాలిగా తన ఆశయం పూర్తి చేసుకోనున్న వీణ చిన్ననాటి నుంచి ప్రాణమైన నాట్యం, సంగీతంపై ఏమాత్రం మక్కువ తగ్గకుండా అవకాశం దొరికినప్పుడల్లా నాట్య ప్రదర్శనలు ఇస్తోంది. ఆమె ఆసక్తిని గమనించిన ఆమె తల్లితండ్రులు ప్రముఖ నాట్యాచారిణి జాహ్నవి వద్ద శిక్షణ ఇప్పించారు.

జాతీయ స్థాయి ప్రదర్శనలు

జాతీయస్థాయిలో దాదాపు 475కుపైగా యశశ్రీవీణ ప్రదర్శనలు ఇచ్చి పలు పురస్కారాలందుకుంది. అఖిల భారతీయ సాంస్కృతిక సంఘం (పూణె) దుబాయ్‌లో 2018లో నిర్వహించిన అంతర్జాతీయ సాంస్కృతిక పోటీల్లో పాల్గొన్న వీణకు తృతీయ స్థానం దక్కింది. అదే ఏడాది పూణెలో జరిగిన జాతీయ స్థాయి కూచిపూడి నృత్య పోటీల్లో ప్రథమ బహుమతి, హైదరాబాద్‌లో దూరదర్శన్ వారు 2016లో నిర్వహించిన అందెల రవళి నృత్య పోటీల్లో ప్రథమ స్థానం, హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగిన అంతర్జాతీయ బాలల దినోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రతిభా పురస్కారాలు అందుకుంది. రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ నిర్వహించిన శతరూప సాంస్కృతిక పోటీల్లో జానపద నృత్య ప్రదర్శనతో బహుమతులు, సిలికాన్ ఆంధ్ర నిర్వాహకులు హైదరాబాద్‌లో నిర్వహించిన అంతర్జాతీయ కూచిపూడి నాట్య సమ్మేళంలో పాల్గొని బహుమతులు సాధించింది.



సీఎం చంద్రబాబు ప్రశంసలందుకుంటున్న వీణ (ఫైల్)



చివరి వరకు గజ్జె ఘల్లుమనాల్సిందే

వైద్యురాలిగా పేదలకు వైద్య సేవలందించడం నా జీవితాశయం. వైద్యవృత్తిలో కొనసాగుతూనే చివరి వరకు గజ్జె ఘల్లుమనాల్సిందే. సంస్కృతి సంప్రదాయాలకు నెలవైన భారతదేశంలో యువత విద్యతోపాటు సంస్కృతిక కార్యక్రమాల వైపు మక్కువ చూపాలి.

\- యశశ్రీ వీణ

- 2017లో రాయలసీమ రంగస్థలి వారు యశశ్రీవీణకు నాట్య రంజిత పురస్కారం అందించారు.
- హైదరాబాదులోని రవీంద్రభారతిలో రాష్ట్రప్రభుత్వ సాంస్కృతిక శాఖ 2018లో నాట్యమయూరి బిరుదు అందజేసింది.
- హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో నాలుగేళ్ల కూచిపూడి సర్టిఫికెట్ కోర్సు చేసి అరుదైన ఘనత సాధించింది. అప్పటి నెల్లూరు కలెక్టర్ ముత్యాలరాజు చేతుల మీదుగా ఉత్తమ నాట్య ప్రతిభా పురస్కారం అందుకుంది.
- రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ కార్యక్రమాల్లో ప్రతిభ చాటిన యశశ్రీవీణకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నుంచి ప్రశంసలు అందుకున్నారు. అప్పటి ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ మంత్రులు సోమిరెడ్డి, దేవినేని, ఆనం నారాయణ, పొంగూరు నారాయణ, మండలి బుద్ధప్రసాద్, చిత్తూరు అపోలో వైద్య కళాశాల వీసీ పలువురు ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు.

పెరుగుతున్న హైగ్రేడ్ పొగాకు ధర

కలిగిరి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో ప్రస్తుతం హైగ్రేడ్ పొగాకు ధర పెరుగుతుండగా లోగ్రేడ్ ధర పతనమవుతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాణిజ్య పంట పొగాకుకు గత మూడేళ్లుగా రైతులకు మద్దతు ధర దక్కడంతో ఈ ఏడాది పొగాకు బోర్డు అనుమతించిన దానికంటే రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. 2024-25 పంట కాలంలో రైతులకు అనుమతించిన పొగాకు కొనుగోళ్లు పూర్తయ్యే నాటికి హైగ్రేడ్ పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.280 పలుకగా లోగ్రేడ్ ధర రూ.200 పలికింది. ప్రస్తుతం అనధికారికంగా సాగు చేసిన పొగాకును అపరాధ రుసుముతో కొనుగోలు చేయడం ప్రారంభించిన తరువాత ఒక్కసారిగా హైగ్రేడ్ పొగాకు ధర రూ.280 నుంచి రూ.330కి చేరుకోగా లోగ్రేడ్ పొగాకు ధర రూ.200 నుంచి రూ.100కి పతనమయింది. పొగాకు బోర్డు అనుమతించిన పొగాకు సాగు చేసిన రైతులకు రూ.280 ధర దక్కితే, అనుమతికి మించి సాగుచేసి పండించిన పొగాకు ధర కిలో రూ.330 కిపైగా పలుకుతుండటంతో పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్‌ను బట్టి ధరల్లో వ్యత్యాసముంటుందన్న అధికారుల మాటలు ప్రస్తుతం నీటి మూటలయ్యాయన్నారు. తమ వద్ద పొగాకు లేని సమయంలో మార్కెట్ ధరలను అమాంతం పెంచేయడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులవద్ద నాణ్యమైన పొగాకు ఉన్నపుడు తక్కువ ధరకు కొనుగోలు చేసి ప్రస్తుతం అరకొర ఉన్న బేళ్లను కిలో రూ.330కి పైగా కొనుగోలు చేయడంతోపాటు, ఎక్కువ శాతం ఉన్న లోగ్రేడు పొగాకును రూ.100కు కొనుగోలు చేయడం పట్ల పలువురు రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పొగాకు సాగు చేసిన రైతుకు పూర్తిస్థాయిలో మద్దతు ధర అందేలా బోర్డు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కలిగిరి వేలం కేంద్రంలో జరుగుతున్న పొగాకు కొనుగోళ్లు

కిలో పొగాకు ధర రూ.341

కలిగిరి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు మొత్తం 640 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 480 బేళ్లు కొనుగోలు చేశారు. నోసేల్-3, నోబిడ్-123, ఆర్‌ఆర్-10, సీఆర్-12, జంపింగ్‌లాట్స్-12 కారణాలతో 160 బేళ్లు తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.341, కనిష్ఠ ధర రూ.100, సగటు ధర రూ.213.14గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

ఘోర రోడ్డు ప్రమాదంపై ప్రముఖుల దిగ్భ్రాంతి

నెల్లూరు(క్రైం) : సంగం మండలం పెరమన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడు గురు మృతి చెందడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సీఎం ప్రగాఢ సానుభూతి తెలిపారు. విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

- జరిగిన రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆరా తీశారు. ఏడుగురు మృతి చెందడం తీవ్రంగా కలిచి వేసిందని, వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. రహదారులపై నియమాల అమలు తప్పనిసరి చేయాలని అధికారులకు ఆదేశించారు.
- రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం అత్యంత బాధాకరమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.
- జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం ఆవేదనకు గురి చేసిందని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. తరచూ జరుగుతున్న ప్రమాదల దృష్ట్యా నాలుగు లేన్ల రోడ్డు ఏర్పాటుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని జాతీయ రహదారి రీజినల్ అధికారిని కోరారు.
- కారును టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో ఏడుగురు మృత్యువాత పడటం అత్యంత బాధాకమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. బాధితుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు.
- రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కుటుంబసభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.



జడ్పీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్, సీఈవో తదితరులు



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జేసీ కార్తీక్ తదితరులు

దివ్య శిల్పి విశ్వకర్మ

- జయంతి సభలో జేసీ కార్తీక్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యావత్ ప్రపంచానికి శాస్త్ర సాంకేతిక నైపుణ్యాన్ని అందించిన దివ్య శిల్పి విశ్వకర్మ మహర్షి అని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు జరిగాయి. ఆయన చిత్రపటానికి జేసీ, అధికారులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ శిల్పకళా నైపుణ్యం, నిర్మాణ రూపకల్పన, దేవతల కథలు, ఆయుధాల తయారీకి ఆద్యుడిగా విశ్వకర్మ పూజలందుకుంటున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం విశ్వకర్మ పథకం ద్వారా చేతివృత్తుల వారికి ఆర్థిక సహాయం, ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. విశ్వకర్మ జీవిత విశేషాలను బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మమ్మ వివరించారు. జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఖాజన వెంకటశేషయ్య ఆచారి మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల మంది జనాభా కలిగిన విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గానికి తగిన గుర్తింపు లేకుండా పోయిందని, చేతివృత్తుల వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పోలినేని సదాశివయ్య ఆచారి, బుడమగుంట జానకి రామయ్య ఆచారి, తల్లం సురేష్ ఆచారి, వేములూరు రఘురామయ్య, శానంపూడి మహేశ్వరి, నూర్ బాషా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ కాలేషా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో...

నెల్లూరు(క్రైం): విశ్వకర్మ మహర్షి చిత్రపటానికి జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాస రావు, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ఏవో చంద్రమౌళి పాల్గొన్నారు.

జిల్లా పరిషత్‌లో...

నెల్లూరు (జడ్పీ): జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో విశ్వకర్మ చిత్రపటానికి చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈవో మోహనరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.